PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 262 | విజయవాడ, మంగళవారం 25 ఏప్రిల్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Tuesday 25 April 2023 | Rs

ఆర్-5 జోన్‌తో అమరావతి విధ్వంసం

- రాజధాని రైతుల పాదయాత్ర

● లోపలి పేజీలో..●

సన్‌రైజర్స్ చేజేతులా..

- ఢిల్లీ చేతిలో 7 పరుగుల తేడాతో ఓటమి

● క్రీడా పేజీలో..●

మేలో రైతు భరోసా

- యంత్రసేవా పథకం ద్వారా కిసాన్ డ్రోన్లు
- సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఖరీఫ్ ప్రారంభానికి ముందే మే నెలలో రైతు భరోసా ఇన్‌స్టాల్‌మెంట్ ఇచ్చేందుకు సిద్ధం కావాలని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దీనికోసం అర్హులైన రైతుల జాబితాను వెల్లడించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ మార్కెటింగ్ పౌరసరఫరాలశాఖపై ముఖ్యమంత్రి సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ మే 10 కల్లా రైతుభరోసా అర్హుల జాబితాను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలని తెలిపారు. రైతుల దగ్గర నుండి సేకరించిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు చేయాలని తెలపగా ఇప్పటికే రూ.7,200 కోట్ల చెల్లించామని, రూ.33 కోట్లు మాత్రమే బకాయి ఉందని అధికారులు సిఎంకు వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ మిగిలిన బకాయి కూడా వెంటనే చెల్లించాలని తెలిపారు. రబీ ప్రొక్యూర్‌మెంట్‌కు సంబంధించి రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని, దానివెనుక సూచనలు ఉండాలని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలను కూడా అందులో పేర్కొనాలన్నారు. రైతుల నుండి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా ధాన్యం కొనుగోలుకు వేరేచోటకు వెళ్లాలని చెప్పినా ఫిర్యాదు చేయడానికి 1967 టోల్‌ఫ్రీ నెంబరు తప్పనిసరిగా ఉండాలన్నారు. విదేశాల్లో ఉన్న డిమాండుకు తగిన విధంగా వంగడాలను సాగుచేయడంపై రైతుల్లో అవగాహన కల్పించాలని కోరారు. దీనివల్ల ఎగుమతులు పెరిగి మంచి ధర వస్తుందని తెలిపారు. ప్రతి ఆర్‌బికె పరిధిలో ఒక గోడౌన్ ఉండాలన్న కార్యాచరణ వేగవంతం చేయాలన్నారు. నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు విత్తనాలను ఆర్‌బికెల ద్వారా అందిస్తున్న ప్రక్రియ మరింత సమర్థవంతంగా ముందుకు సాగాలని, ప్రతియేటా పంపిణీ మొత్తం పెరగాలని తెలిపారు. సిఎం యాప్ ద్వారా వివిధ ప్రాంతాల నుండి వివిధ పంటలకు వస్తున్న ధరలు, వాటి పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. దీనిపై మాక్ డ్రిల్ చేయాలన్నారు. ఎక్కడైనా లోపాలుంటే వెంటనే సరిదిద్దాలని సూచించారు. రైతుకు కనీస మద్దతు ధర రాలేదని తెలిస్తే వెంటనే జోక్యం చేసుకోవాలన్నారు.

జులై నాటికి 700 డ్రోన్లు

సమీక్షలో జులై నాటికి 500 డ్రోన్లు, డిసెంబర్ నాటికి 1500 డ్రోన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందని అధికారులు సిఎంకు వివరించారు. దీనికోసం ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంతోపాటు తిరుపతి, కడప, మార్టేరు, విజయనగరంలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే 48.02 లక్షల ఎకరాల్లో ఇ-క్రాప్ బుకింగ్ పూర్తయిందన్నారు. ఇ-క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులకు డిజిటల్ రసీదులు, భౌతిక రసీదులు ఇచ్చామని, డేటాను పౌరసరఫరాలు, మార్కెటింగ్ డిపార్టుమెంటుకు అందించామని వివరించారు. 3,935 ఆర్‌బికె స్థాయి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లకూ, 194 క్లస్టర్‌స్థాయి సిహెచ్‌సిలకూ మే 20లోగా వైఎస్‌ఆర్ యంత్రసేవ కింద వ్యవసాయ ఉపకరణాలు అందిస్తామని తెలిపారు. ఇప్పటికే 6,500 ఆర్‌బికెల పరిధిలో సిహెచ్‌సిలకు వ్యవసాయ ఉపకరణాలు అందించామని చెప్పారు.

బంగ్లాదేశ్ కొత్త అధ్యక్షుడిగా షాబుద్దీన్ ప్రమాణం

ఢాకా : బంగ్లాదేశ్ 22వ అధ్యక్షుడిగా ప్రముఖ రాజకీయ నేత మహ్మద్ షాబుద్దీన్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. చారిత్రక దర్బార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో స్పీకర్ షిరిన్ షర్మిన్ ఆయనచే ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రధాని షేక్ హసీనా, ఆమె మంత్రివర్గ సహచరులు, కొత్త అధ్యక్షుడి కుటుంబ సభ్యులు, రాజకీయ నేతలు, సుప్రీం న్యాయమూర్తులు, సీనియర్ పౌర, మిలటరీ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రస్తుత అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ పదవీ కాలం ముగియడంతో ఆయన స్థానంలో షహబుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పాలక పార్టీ అవామీ లీగ్ అభ్యర్థిగా షహబుద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రమాణస్వీకారం అనంతరం హహబుద్దీన్ సంబంధిత ప్రమాణ పత్రాలపై సంతకాలు చేశారు. దేశాధ్యక్షుడి పదవి అలంకార ప్రాయమే అయినప్పటికీ, సార్వత్రిక ఎన్నికల సమయంలో అధ్యక్ష కార్యాలయం పట్ల అందరి దృష్టి కేంద్రీకృతమై వుంటుంది. అధ్యక్షుడు, ప్రధానిని నియమించడంతోపాటు దేశ రాజ్యాంగ సంరక్షకుడిగా కూడా వ్యవహరిస్తారు. ఎన్నికల వ్యవస్థ పట్ల పాలక అవామీ లీగ్, ప్రధాన ప్రతిపక్షం బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ మధ్య అభిప్రాయ బేధాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది డిసెంబరులో లేదా వచ్చే ఏడాది జనవరిలో బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. దిగువ కోర్టు న్యాయమూర్తి అయిన షహబుద్దీన్ గత వారం మీడియాకు ఇంటర్వ్యూ ఇస్తూ, ప్రజలందరూ తమ ఓటు హక్కు వినియోగించేలా ఓటర్లను ప్రోత్సహించేందుకు అనువైన వాతావరణాన్ని సృష్టించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దేనని అన్నారు.

పార్వతీపురంలో ఉపాధ్యాయుల ర్యాలీ

సస్పెన్షన్లపై వెనకడుగు

ఉపాధ్యాయుల ఆందోళన నేపథ్యంలో సిఎం ఆరా

విచారణ చేసి 2రోజుల్లో ఎత్తివేయాలని మన్యం కలెక్టరుకు ఆదేశం

ప్రజాశక్తి- కలెక్టరేట్ (పార్వతీపురం)

పార్వతీపురం మన్యం జిల్లాలో ఉపాధ్యాయ సస్పెన్షన్లపై రాష్ట్రప్రభుత్వం వెనక్కుతగ్గింది. ఈ ఘటనపై విచారణ జరిపి రెండు రోజుల్లో సస్పెన్షన్లు ఎత్తివేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనను ఆదేశించారని మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ సోమవారం ఉపాధ్యాయ సంఘాలతో చెప్పారు. పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పార్వతీపురం మన్యం జిల్లా పర్యటన సందర్భంగా డిఇఒను, ఎంఇఒలను, ఉపాధ్యాయులను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ప్రవీణ్‌ప్రకాష్ తీరుపై ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు సోమవారం పెద్ద ఎత్తున పార్వతీపురంలో ఉద్యమించారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యాన వేలాది మంది పార్వతీపురంలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ఆందోళన నేపథ్యంలో సంఘాల నాయకులతో కలెక్టర్ చర్చలు జరిపారు. ఆందోళనపై సిఎం తనతో మాట్లాడారని, సస్పెన్షన్ల అంశంతో పాటు, పుస్తకాల పంపిణీపై విచారణ జరపాలని, విచారణ అధికారిగా తననే ఉండాలని ఆదేశించినట్లు కలెక్టర్ వారితో చెప్పారు. రెండు రోజుల్లో విచారణ జరిపి సస్పెషన్లు ఎత్తివేయాలని సిఎం ఆదేశించారని వెల్లడించారు. దీంతో జిల్లాలో పోరాటాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల పోరాట

మిగతా 7లో

నేడు, రేపు నిరసనలు : ఫ్యాప్టో

- పిడిఎఫ్ ఎమ్మెల్సీల మద్దతు

2

మోడీని గద్దె దించితేనే దేశానికి రక్ష

రాష్ట్రంలోని ఆ మూడు పార్టీలూ బిజెపి పల్లకి మోయడం మానుకోవాలి

- విశాఖ ఉక్కును అమ్ముతుంటే అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించవా!
- మంగళగిరి ప్రచారభేరి సభలో రాఘవులు, రామకృష్ణ

మంగళగిరి బహిరంగ సభలో మాట్లాడుతున్న బివి రాఘవులు

ప్రజాశక్తి- తాడేపల్లి (గుంటూరు జిల్లా)

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించితేనే దేశానికి రక్షణ అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మోడీ విధానాలను రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి ప్రశ్నించడం లేదని, ప్రశ్నించడానికే జనసేన పార్టీని పెట్టానని చెప్పున్న పవన్ కల్యాణ్ కేంద్రంలోని మోడీ ప్రభుత్వ పల్లకిని మోస్తున్నారని విమర్శించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన సోమవారం జరిగిన ప్రచారభేరి సభలో బివి.రాఘవులు మాట్లాడుతూ బిజెపిని నమ్ముకున్న ఏ పార్టీ బతికి బట్టకట్టలేదని తెలిపారు. దేశంలో లౌకికతత్వాన్ని, ఫెడరలిజాన్ని ఎలా నాశనం చేస్తుందో చూస్తున్నామన్నారు. బిజెపియేతర ప్రభుత్వాలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని తెలిపారు. బిజెపి పాలనలో దేశంలో ముస్లిములు, క్రైస్తవులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రతిపక్షాలు ఉండకూడదని మోడీ, అమిత్ షా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కనబెట్టి మనుధర్మ శాస్త్రాన్ని తీసుకొచ్చి మతం, కులం పేరుతో ప్రజల మధ్య చీలికలు తేవాలని ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలు చేస్తోందన్నారు. మైనార్టీలకు రక్షణ కల్పించాలని, అందరినీ సమానంగా చూడాలని రాజ్యాంగంలో రాసుకున్నామని, దీనికి భిన్నంగా బిజెపి వ్యవహరిస్తూ మతసామరస్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. మరోపక్క దేశ సంపదను అదానీ, అంబాని వంటి కార్పొరేట్లకు దోచిపెడుతోందని, ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అమ్మేస్తోందని అన్నారు. అందుకే బిజెపిని అధికారానికి దూరంగా ఉంచాలని, అందుకు ప్రతిపక్షాలు కలిసికట్టుగా ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ ఢిల్లీలో మాత్రం కేంద్ర

మిగతా 7లో

పాక్‌లో 'ఆత్మాహుతి' బాంబు దాడి

- 12 మంది పోలీసులు బలి

పెషావర్ : పాకిస్తాన్‌లోని పెషావర్‌లో ఖైబర్ పక్తూన్ శ్వాత్ వ్యాలీలోని కబాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమవారం రాత్రి ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో 12 మంది పోలీసులు చనిపోయారు. మరో 57 మంది ఇతరులు గాయపడ్డారు. వీరిలో ముగ్గురు పౌరులు ఉన్నారు. శ్వాత్ డిపిఓ షఫీ ఉల్లా గండపూర్ ఇది ఆత్మాహుతి బాంబు దాడేనని ధ్రువీకరించారు. ఈ దాడిలో గాయపడిన పోలీస్ అధికారి ఇమ్దాద్ ఖాన్ డాన్ పత్రికతో మాట్లాడుతూ, ప్రాథమిక సమాచారం ప్రకారం పోలీస్ స్టేషన్ ఆవరణలోని ఉగ్రవాద వ్యతిరేక విభాగాన్ని లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి బాంబర్ దాడి చేసింది. శక్తివంతమైన బాంబు ప్రేలుడు ధాటికి మూడు భవనాలు క్షణంలో కుప్పకూలాయి. భవన శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారని, కాబట్టి మృతుల సంఖ్య ఇంకా పెరగవచ్చని సహాయక చర్యలు చేపడుతున్న అధికారి ఒకరు తెలిపారు.

అవినాష్ రెడ్డికి ఎదురుదెబ్బ

- ముందస్తు బెయిల్ ఉత్తర్వులు నిలిపివేత
- సిబిఐ నిర్దేశించిన రీతిలోనే దర్యాప్తు చేయాలన్న సుప్రీంకోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైసిపి ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డికి అత్యున్నత న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనను సిబిఐ అరెస్టు చేయకుండా మధ్యంతర రక్షణ కల్పిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. అవినాష్ రెడ్డికి ఇచ్చిన ముందస్తు బెయిల్ ఉత్తర్వులను నిలిపివేసింది. అంతేకాదు విచారణను లిఖిత పూర్వకంగా ప్రశ్నలు ఇవ్వాలని సిబిఐని హైకోర్టు ఆదేశించడాన్ని కూడా సుప్రీంకోర్టు తప్పుబట్టింది. కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)ని నిర్దేశించిన రీతిలోనే దర్యాప్తు చేయాలని ఆదేశించింది. ఇటువంటి ఆదేశాలు తీవ్ర పక్షపాత దర్యాప్తునకు సంబంధించినవని పేర్కొంది. హైకోర్టు ఉత్తర్వులు దర్యాప్తునకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అవినాష్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను సవాల్ చేస్తూ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహాతో కూడిన ధర్మాసనం విచారించింది.

సునీతారెడ్డి తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా వాదనలు వినిపిస్తూ అవినాష్ రెడ్డికి సంధించిన ప్రశ్నలను ముద్రించిన, లేదా రాతపూర్వక రూపంలో అందించాలని తెలంగాణ హైకోర్టు సిబిఐకి ఆదేశించడం అసంబద్ధం అని వాదించారు. 'ఇది నిజంగా నిరుపయోగ కసరత్తుగా మారుతోంది. దర్యాప్తు ఇలా జరగడం లేదు. ఇది అసంబద్ధం. ఇలాంటిది ఎప్పుడూ చూడలేదు' అని అన్నారు.

అవినాష్ రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ అవినాష్ రెడ్డికి ప్రశ్నలు ఇవ్వాలని హైకోర్టు సిబిఐని ఆదేశించినట్లుగా పిటిషనర్ కేసును తప్పుగా

మిగతా 7లో

జిఓ 1పై పిటిషన్‌ను హైకోర్టు సిజె ధర్మాసనం పరిష్కరించాలి

- సుప్రీం కోర్టు ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల ర్యాలీలు, ధర్నాలు జరపడాన్ని నిషేధిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జిఓ నెంబరు 1పై దాఖలైన పిటిషన్‌ను ఎపి హైకోర్టు సిజె ధర్మాసనం త్వరగా పరిష్కరించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించి, విచారణ ముగించింది. హైకోర్టులో తీర్పు జాప్యం నేపథ్యంలో టిడిపి నేత, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

ఈ పిటిషన్‌పై సోమవారం సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ ధర్మాసనం విచారించి, ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఎపి హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్‌ను ఆశ్రయించాల్సిందిగా పిటిషనర్‌కు సూచించింది. జిఓ నెంబరు 1పై జనవరి 24న

విచారణ ముగించి ఎపి హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును వాయిదా వేసింది. అప్పటి నుంచి తీర్పు పెండింగ్‌లో ఉన్నట్లు పిటిషనర్ల తరపున న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వీలైనంత త్వరగా తుదితీర్పు ఇవ్వాలని హైకోర్టుకు సుప్రీం కోర్టు సూచించింది.

బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులపై విచారణ జరపాలి

- సుప్రీంను ఆశ్రయించిన అగ్రశ్రేణి రెజ్లర్లు
- ఎన్‌సిడబ్ల్యు ఛైర్‌పర్సన్ రేఖా శర్మకు ఫిర్యాదు
- రాత్రంతా జంతర్ మంతర్‌లోనే నిరసన

● లోపలి పేజీలో..●

ఈదురుగాలులు.. వర్షాలు

- పిడుగుపాటుకు ఒకరు మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. బాపట్ల జిల్లా భట్టిప్రోలులో జొన్న, మొక్కజొన్న పంటలు కళ్లాల్లోనే తడిసి ముద్దయ్యాయి. కొల్లూరు మండలంలోని ఇటుకలు తడిసి పాడైపోయాయని, భారీగా నష్టపోయామని బట్టీల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఈదురుగాలుల దాటికి మామిడి కాయలు నేలరాలిపోయాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, పెదబయలు, జికె.వీధి మండలాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం పడింది.

విజయనగరంలోని గాజులరేగలో మైదానంలో యువకులు క్రికెట్ ఆడుతుండగా వారికి సమీపంలో పిడుగుపడడంతో ఇజ్రాయిల్ అనే యువకుడు అక్కడికక్కడే మరణించాడు. మరో ముగ్గురు యువకులు సురేష్, అఖిల్, విజయ్ గాయపడ్డారు. సురేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

అర్హులందరికీ పోస్టింగులు

- డిఎస్‌సి-1998 అభ్యర్థుల రాష్ట్ర సదస్సు డిమాండ్
- 2న ధర్నాలకు పిలుపు

సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అర్హత పొంది, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన డిఎస్‌సి-1998 అభ్యర్థులందరికీ రాష్ట్రప్రభుత్వం పోస్టింగులు ఇవ్వాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఈ నియామకాల్లో రిజర్వేషన్లు పాటించాలని కోరారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), 1998 డిఎస్‌సి క్వాలిఫైడ్ పోస్టుల సాధన పోరాట కమిటీల ఆధ్వర్యాన విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర సదస్సుకు అభ్యర్థులు పెద్దఎత్తున హాజరయ్యారు. సదస్సులో లక్ష్మణరావు మాట్లాడుతూ డిఎస్‌సి-1998లో అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలివ్వాలని 20 ఏళ్లుగా పోరాడుతున్నామని, ఏ ప్రభుత్వం పట్టించుకోలే దన్నారు. జగన్ ప్రభుత్వం ఉద్యోగాలు అందరికీ కాకుండా కొంతమందికే ఇచ్చిందని, ఇందులో కూడా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదని చెప్పారు. 6,008 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పిన ప్రభుత్వం 4,052 మందికే నియామకాలు అందజేసిందన్నారు. ప్రభుత్వం చేసే ప్రతి నియామకంలో కచ్చితంగా రిజర్వేషన్లు పాటించాలని, లేదంటే అది రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులందరికీ రిజర్వేషన్ ప్రకారం పోస్టింగులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికోసం అభ్యర్థులు చేసే పోరాటానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీలుగా అండగా ఉండి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ సామాజిక న్యాయం అంటే నలుగురు దళితులకు మంత్రి పదవులివ్వడం కాదని, ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు అమలుచేయడం అని అన్నారు. రిజర్వేషన్లు పాటించాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కోరితే ధర్నాలు చేసుకోండి, కోర్టుకు వెళ్లండంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు మాత్రం అర్హులైన అభ్యర్థుల జాబితా తమ వద్ద లేవంటూ తప్పించు కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిన అభ్యర్థుల జాబితాను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఎం సోమేశ్వరరావు, బిసి సంక్షేమ సంఘం నాయకులు శంకర్, రెల్లి సంఘం నాయకులు నాగేంద్ర, దళిత జాగృతి నాయకులు గణేష్ తదితరులు పాల్గొని తమ మద్దతు ప్రకటించారు. డిమాండ్ల సాధన కోసం మే 2న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించాలని సదస్సు తీర్మానించింది. మే 10 నుంచి 14 వరకు విజయవాడలో రిలే దీక్షలు చేపట్టాలని పేర్కొంది. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రాలు అందించాలని తీర్మానించింది. సాధన కమిటీ నాయకులు శ్రీను, రమేష్, కె శ్రీను, కామేష్, సుహాసిని, విశ్వరూప్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి నటరాజ్ వందన సమర్పణ చేశారు.

వైఎస్ షర్మిలకు రిమాండ్

- విజయమ్మను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేపర్ లీకేజీ కేసులో సిట్‌ను కలిసేందుకు వెళుతున్న వైఎస్ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అడ్డుకోవడంతో సోమవారం లోటస్ పాండ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తనను ఎందుకు నిర్బంధించారో చెప్పాలని కింద కూర్చొని పోలీసులను ఆమె ప్రశ్నించారు. పోలీసులు అడ్డుగా ఉన్నా లెక్కచేయకుండా కారులో ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అయినా, పోలీసులు అడ్డు తొలగకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన షర్మిల..అక్కడే విధుల్లో ఉన్న పోలీసు అధికారులతో దురుసుగా ప్రవర్తించారు. మధ్యలో అడ్డుకున్న మహిళా కానిస్టేబుళ్లను తోసేసి చేయి చేసుకున్నారు. అనంతరం షర్మిలను బలవంతంగా పోలీసు వాహనంలో ఎక్కించి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. షర్మిలను కలిసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆమె తల్లి విజయమ్మను పోలీసులు అడ్డుకున్నారు. ఆ సందర్భంలోనూ మహిళా పోలీసులను విజయమ్మ నెట్టివేసి తీవ్ర ఆగ్రహం ప్రదర్శించారు.కాగా, పోలీసుల ఫిర్యాదు మేరకు వైఎస్ షర్మిలపై ఐపిసి 553, 332, 509, 427 సెక్షన్ల కింద జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి నాంపల్లి కోర్టులో మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. షర్మిల రిమాండ్‌పై ఆమె తరుపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా పోలీసులు అడ్డుకుని షర్మిలపై దురుసుగా ప్రవర్తించారని, ఆత్మ రక్షణలో భాగంగానే పోలీసులు నెట్టివేయాల్సి వచ్చిందని వారు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. రిమాండ్ తిరస్కరించాలని కోరారు. ఇరు వాదనలు విన్న న్యాయమూర్తి 14 రోజులు జ్యూడిషియల్ రిమాండ్ విధించారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

యువతిని నిర్బంధించి.. శరీరంపై వేడి నూనె పోసి అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు త్రీటౌన్ స్టేషన్‌లో దిశ డిఎస్‌పి సత్యనారాయణ ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వివరించారు. ఆయన మాటల్లో..నగరంలోని దుగ్గిరాల ప్రాంతానికి చెందిన యువతి అదే ప్రాంతానికి చెందిన ఎస్.అనుదీప్ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. యువతి కాకినాడ జిల్లాలో ఇంజినీరింగ్ చదువుతున్నారు. పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి కాకినాడ నుంచి ఏలూరుకు తీసుకొచ్చి ఒక గదిలో నిర్బంధించాడు. శారీరకంగా కలిసేందుకు యువతి నిరాకరించడంతో ఈ నెల 10న ఆమె శరీరంపై వేడి నూనెను పోసి.. అత్యాచారానికి పాల్పడ్డాడు. నాటి నుంచి పలుమార్లు అత్యాచారానికి పాల్పడగా ఆదివారం ఉదయం అతని చెర నుంచి తప్పించుకుని తన తల్లిదండ్రులకు యువతి సమాచారం ఇచ్చింది. ఆమె ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. నిందితుడు అనుదీప్‌ను అరెస్టు చేశామని డిఎస్‌పి తెలిపారు.

సరైన ఆధారాల్లేకుండా ఆర్థిక నేరారోపణలు చేయొద్దు

- జనసేన కార్యకర్తలకు పవన్‌కల్యాణ్ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రాభివృద్ధి, ప్రజాశ్రేయస్సు కోసం తాము శ్రమిస్తున్న తరుణంలో మన దృష్టి మళ్లించడానికి, భావజాలాన్ని కలుషితం చేసేందుకు కొన్ని శక్తులు నిరంతరం పనిచేస్తున్నాయని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. సరైన ధ్రువపత్రాలు, ఆధారాలు లేకుండా ఎవరిపైనా ఆర్థిక నేరారోపణలు చేయొద్దని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఈ మేరకు సోమవారం కార్యకర్తలు, నాయకులనుద్దేశించి లేఖ రాశారు. నిర్ధారణ కాని అంశాల గురించి మాట్లాడవద్దని, పొత్తుల గురించి సామాజిక మాధ్యమాల్లో వచ్చే సమాచారం ఆధారంగా ఎవరూ మాట్లాడవద్దని, ఈ విషయంలో తానే నిర్ణయం తీసుకుంటానని లేఖలో పేర్కొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-పుట్లూరు

కేవవరెడ్డి (ఫైల్)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా పుట్లూరు మండల పరిధిలోని దోసలేడు గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... దోసలేడు గ్రామానికి చెందిన రైతు నోస్సం కేశవరెడ్డి (65) తనకున్న ఏడు ఎకరాలతో పాటు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని అరటి పంట సాగు చేశారు. పంట సాగు నిమిత్తం రూ.17 లక్షల వరకు అప్పులు చేశారు. ఈ ఏడాది పంట చేతికొచ్చే సమయంలో వడగండ్ల వాన దెబ్బకు పంట మొత్తం పాడైపోయింది. చేసిన అప్పులు తీర్చడం కష్టమై తీవ్ర మనస్తాపానికి గురైయ్యారు. ఆదివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన తరువాత పురుపుగుల మందు తాగారు.. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ను చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కేశవరెడ్డి మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పరామర్శించారు.

ఆర్-5 జోన్‌తో అమరావతి విధ్వంసం

- రాజధాని రైతుల పాదయాత్ర

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

పాదయాత్రలో పాల్గొన్న రాజధాని రైతులు, మహిళలు

పేదలకు స్థలాల సాకుతో రాజధాని అమరావతిని విధ్వంసం చేసే కుట్రలను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని రాజధాని రైతులు, మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్-5జోన్‌కు వ్యతిరేకంగా రాజధాని గ్రామాల్లో సోమవారం ప్రజాచైతన్య పాదయాత్ర చేపట్టారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కృష్ణాయపాలెంలోని రైతు దీక్షా శిబిరం నుంచి చేపట్టిన పాదయాత్రలో రైతులతో పాటు మహిళలు, వ్యవసాయ కార్మికులు, చేతి వృత్తిదారులు, వృద్ధులు, చిన్నపిల్లలూ పాల్గొన్నారు. కృష్ణాయపాలెం నుంచి ప్రధాన రహదారి మీదుగా తుళ్లూరు మండలం మందడం ఎన్ 7, ఇ 8 రోడ్డు వరకు పాదయాత్ర సాగింది. అక్కడ నుంచి ఐనవోలుకు చేరుకున్నారు. అనంతరం కురగల్లు మీదుగా నిడమర్రు చేరుకొని సాయంకాలం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతి రైతు ఐక్య కార్యాచరణ సమితి (జెఎసి) నాయకులు శివారెడ్డి, తిరుపతిరావు, పువ్వాడ సుధాకరరావు మాట్లాడుతూ.. జిఒ 45 ద్వారా రాజధానిలో పేదలకు సెంటు స్థలం పంపిణీ అంటూ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. వారి సొంత ఊరిలో పేదలకు ఐదు సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజధానిలో నాలుగేళ్లుగా అభివృద్ధి లేదని, కంపెనీలను వెళ్లగొట్టారని, పేదలకు ఉపాధి లేకుండా చేసిన ప్రభుత్వం ఇతర ప్రాంతాల నుంచి పేదలను తెచ్చి ఉద్ధరిస్తాననడం హాస్యాస్పదమన్నారు. పారిశ్రామిక, ఆర్థిక అవసరాల కోసం కేటాయించిన భూములను విభజించి లేఅవుట్లు వేసి 1100 ఎకరాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, 54 వేల మందిని ఇక్కడకు తీసుకువచ్చి వారి ఓట్లను పొందేందుకు రాజకీయ కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ కుట్రలను నిరసిస్తూ రానున్న రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. తొలుత అమరావతి ఉద్యమంలో అశువులు బాసిన వారికి జోహార్లర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, పాతూరి నాగభూషణం, పోతుల బాలకోటయ్య, ఆకుల జయసత్య, పోతినేని శ్రీనివాసరావు, గడ్డం మార్టిన్, చిలకా బసవయ్య, పులి సువార్త, బి.ప్రియాంక, అంకం సువర్ణ కమల, పాల్గొన్నారు.

'జై భారత్ సత్యాగ్రహ' సభలో అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

అదానీ, మోడీ సంబంధాలను
ప్రశ్నించినందుకే రాహుల్‌పై వేటు

- అధికారంలోకి రాగానే రూ.500కే గ్యాస్ సిలిండరు
- 'జై భారత్ సత్యాగ్రహ' సభలో కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అదానీ, మోడీ సంబంధాలను పార్లమెంటు సాక్షిగా ప్రశ్నించడంతో జవాబు చెప్పుకోలేని స్థితిలో కేంద్ర ప్రభుత్వం కోర్టు తీర్పును సాకుగా చూపి ఎఐసిసి మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశారని, విపక్ష నేతగా ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నించడమే నేరమా? అని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు రంజితా రంజన్ ప్రశ్నించారు. విజయవాడ జింఖానాగ్రౌండ్‌లో పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అధ్యక్షతన 'జై భారత్ సత్యాగ్రహ' బహిరంగ సభను సోమవారం నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన రంజితా రంజన్ మాట్లాడుతూ.. చారిత్రక ప్రదేశమైన జింఖానాగ్రౌండ్ సభలో మాట్లాడటం తన అదృష్టమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దేశ వ్యాప్తంగా గ్యాస్ సిలిండరును రూ.500లకే అందిస్తామన్నారు. ప్రధాని మోడీ విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకొచ్చి సామాన్యుల అకౌంట్లలో రూ.15 లక్షల చొప్పున వేస్తామని హామీనిచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని రంజితా రంజన్ పేర్కొన్నారు.

రాజ్యసభ మాజీ సభ్యులు కెవిపి రామచంద్రరావు మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చివరిగా మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని సందేశం ఇచ్చారన్నారు. కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, పిసిసి మాజీ అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ మాట్లాడారు. సభలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ నేషనల్ కో ఆర్డినేటర్ కొప్పులరాజు మాజీమంత్రి జెడి శీలం, ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, పార్టీ సీనియర్ నాయకులు నరహరశెట్టి నరసింహారావు, కొలనుకొండ శివాజీ, కొరివి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జై భారత్ సత్యాగ్రహ ఆందోళనలకు వామపక్షాల మద్దతు : ధన్యవాధాలు తెలిపిన పిసిసి

ఎఐసిసి మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీపై బిజెపి కక్ష సాధింపు ధోరణి, పార్లమెంటు నుంచి రాహుల్ బహిష్కరణను నిరసిస్తూ విజయవాడలో సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ చేపట్టిన సభకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పేర్కొన్నారు.

ఈ మేరకు పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజుకు సంఘీభావం తెలుపుతూ లేఖ రాశారు. సభలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ వామపక్షాలు పంపిన సౌహార్ద్ర సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా పిసిసి రాష్ట్ర కమిటీ తరపున వామపక్షాలకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యానికి పాతరేసిందని, రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తూ అనేక దుశ్చర్యలకు పాల్పడుతోందని లేఖలో పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలపై కక్షపూరిత ధోరణి ప్రదర్శిస్తోందని, ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తున్నదని, ఇప్పటికే అనేకమంది వామపక్ష మేధావులను జైళ్లకు పంపడమే కాకుండా పలు రకాలుగా వేధింపులకు గురి చేస్తోందని తెలిపారు. రాహుల్ గాంధీకున్న ప్రశ్నించే తత్వాన్ని గుర్తించిన మోడీ ప్రభుత్వం కింది కోర్టు తీర్పును సాకుగా చూపి పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దుచేసిందని తెలిపారు. చివరికి పార్లమెంటు సభ్యుల అధికారిక గృహం నుంచి అన్యాయంగా బయటకు పంపిందన్నారు. ఇది అత్యంత అప్రజాస్వామిక చర్యగా పేర్కొంటూ జాతీయ స్థాయిలో కూడా ఖండిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

6 నెలల్లో ఎస్‌సి, ఎస్‌టి కాంపొనెంట్ చట్ట సవరణకు నివేదిక

- డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి కాంపొనెంట్ చట్టం-2023 రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్సను చట్టసవరణ చేసేందుకు అవసరమైన నివేదికను ఆరు నెలల్లో ప్రభుత్వానికి నివేదించాలని, ఈ మేరకు సభ్యులు సూచనలు, సలహాలను అందించాలని రాష్ట్రస్థాయి కమిటీ ఛైర్మన్, డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర ఆదేశించారు. సోమవారం వెలగపూడిలోని సచివాలయంలో ఎస్‌సి, ఎస్‌టి కాంపొనెంట్ చట్టసవరణకు ఏర్పాటైన రాష్ట్ర స్థాయి కమిటీ తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ.. పదేళ్ల కాలానికి రూపొందించిన ఆంధ్రప్రదేశ్ ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం-2013 ఈ ఏడాది జనవరి 24వ తేదీతో ముగిసిందన్నారు. సబ్‌ప్లాన్ స్థానంలో ఎస్‌సి, ఎస్‌టి కాంపొనెంట్ చట్టం-2023ను రూపొందించేందుకు రాష్ట్రప్రభుత్వం ఆర్డినెన్సును తెచ్చిందన్నారు. ఆ బిల్లుకు గవర్నరు నుంచి ఆమోదం లభించిందన్నారు. సవరించిన చట్టం నోటిఫికేషన్ జారీ ప్రక్రియలో ఉందన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎంపి మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్యేలు ఉన్నమట్ల ఎలీజా, మొండితోక జగన్మోహనరావు, కంబాల జోగులు, విశ్వసరాయి కళావతి, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి జయలక్ష్మి, సంచాలకులు విజయకృష్ణన్, గిరిజన సంక్షేమశాఖ సంచాలకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జాప్యం వల్లే ఉద్యమం ఉధృతం

- ఎపి జెఎసి అమరావతి

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వ జాప్యం వల్లే ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వచ్చిందని ఎపి జెఎసి అమరావతి నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలోని సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డిని కలిసి తమ డిమాండ్ల గురించి వివరించారు. ఈ సందర్భంగా 47 రోజులుగా జరుగుతున్న ఉద్యమ తీరును సిఎస్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎపి జెఎసి అమరావతి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ వలిశెట్టి దామోదర్ పేర్కొన్నారు. ఈ నెల 28న ఉద్యోగ, కార్మిక సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నేడు, రేపు నల్లబ్యాడ్జీలతో నిరసన

- ఉపాధ్యాయుల సస్పెన్షన్‌లపై ఫ్యాప్టో కార్యాచరణ
- సంపూర్ణ మద్దతు ప్రకటించిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి పాఠశాలల పర్యవేక్షణ సందర్భంగా ఉపాధ్యాయులను కించపరుస్తూ, సస్పెన్షన్‌లను చేయటాన్ని వ్యతిరేకిస్తూ ఫ్యాప్టో నిరసనలకు పిలుపునిచ్చింది. సోమవారం జరిగిన ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ నిర్ణయాలను ఛైర్మన్ నక్కా వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ సిహెచ్ మంజుల ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. మంగళ, బుధవారాల్లో అన్ని పాఠశాలల్లో, పదో తరగతి స్పాట్ కేంద్రాల వద్ద నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని తెలిపారు. బుధవారం పాత తాలూక కేంద్రాల్లో కూడా నిరసన కార్యక్రమాలు చేయాలని కోరారు. ఫ్యాప్టో చేపట్టిన కార్యాచరణకు పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఫోరం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఒక ప్రకటనలో వెల్లడించారు. పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను కించపరచటం, సస్పెన్షన్‌లకు గురిచేయటంతోపాటు మానసిక ఆందోళనకు గురిచేయటాన్ని తీవ్ర స్థాయిలో ఖండిస్తూ ఫ్యాప్టో సమావేశంలో తీర్మానం చేసినట్లు వెంకటేశ్వర్లు, మంజుల వెల్లడించారు.

గత వారం రోజుల క్రితమే ఉపాధ్యాయుల్లో ఉన్న పొరపాట్లను గమనించి వాటిని సరిచేయటానికి సస్పెన్షన్ చేయడం సరికాదని తెలిపారు. ఉపాధ్యాయుల్లో మార్పు తీసుకురావటానికి ప్రయత్నం చేస్తామని చెప్పిన అధికారులే సస్పెన్షన్లు చేయటం తీవ్ర ఆక్షేపనీయమని ఖండించారు. పొరపాట్లను సరిచేసుకునేలా విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేలా సూచనలు చేయకుండా కక్షసాధింపు ధోరణితో ఉపాధ్యాయులపై చర్య తీసుకోవటం తగదన్నారు. ఫ్యాప్టో కార్యక్రమానికి ఫోర్టో సంపూర్ణ మద్దతు ప్రకటించిందని, ఈ కార్యక్రమాలను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఫ్యాప్టో కో ఛైర్మన్లు, కె నరహరి, బి మనోజ్‌కుమార్, సిహెచ్ వెంకటేశ్వర్లు, కె ప్రకాశ్‌రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎల్ సాయిశ్రీనివాస్, ఎస్ చిరంజీవి, వి శ్రీనివాసరావు, కోశాధికారి చింతల సుబ్బారావు, కార్యదర్శులు ఇమామ్ బాషా, డి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్‌లతో నాణ్యమైన విద్య ఎలా వస్తుంది? : లక్ష్మణరావు

పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను మానసిక ఇబ్బందులకు గురిచేయటం, సస్పెన్షన్లు చేయటం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా వస్తుందో అధికారులు చెప్పాలని ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. పాఠశాలల పర్యవేక్షణ చేయడాన్ని స్వాగతిస్తూనే, అందులో గమనించిన లోపాలకు బాధ్యులు ఎవరో గుర్తించకుండా ఉపాధ్యాయులనే శిక్షించడం సరికాదని పేర్కొన్నారు. పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల్లో పాఠశాల సమయం తర్వాత కూడా విద్యార్థుల ఇంటికి వెళ్లి ఉపాధ్యాయులను కించపరుస్తూ మాట్లాడడం ప్రభుత్వ విద్యారంగానికి ఎలా ఉపయోగపడుతుందో ఆలోచించాలని కోరారు. ఇప్పటికైనా సస్పెన్షన్‌లు గురైన ఉపాధ్యాయులకు తక్షణం పోస్టింగ్‌లు ఇవ్వాలని, షోకాజ్ నోటీసులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరారు.

దళిత ద్రోహి జగన్

- పుస్తకాన్ని ఆవిష్కరించిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్ దళిత ద్రోహి అని టిడిపి నేతలు విమర్శించారు. 'దళిత ద్రోహి జగన్-దళిత బాంధవుడు, పేదలపెన్నిధి చంద్రన్న' అనే పుస్తకాల్ని టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నేతలు సోమవారం ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ప్రతి దళితుడు చదివి, జగన్‌ను, ఆయన ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ.. జగన్ దళిత ద్రోహి కాదనే ధైర్యం దళిత మంత్రులు, వైసిపి దళిత నేతలకు, ఆ పార్టీ నేత సజ్జల రామకృష్ణారెడ్డికి ఉందా? అని ప్రశ్నించారు. దళిత నేతలు, మంత్రులతో సమావేశాలు పెట్టే హక్కు ప్రభుత్వానికి, సజ్జలకు ఎక్కడ ఉందన్నారు. ఈ పుస్తకంలోని ప్రతి అంశాన్నీ ఆధారాలతో సహా నిరూపించడానికి సిద్ధమని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు అన్నారు. వైసిపి ప్రభుత్వం తొలినుంచి ప్రజావ్యతిరేక విధానాలనే నమ్ముకుందని మాజీ మంత్రి పీతల సుజాత చెప్పారు.

హైకోర్టుకు వెళ్లే రహదారుల్లో వీధిలైట్ల పనులు పూర్తి చేస్తాం : సిఆర్‌డిఎ

ప్రజాశక్తి-అమరావతి

హైకోర్టుకు వెళ్లే ప్రధాన రహదారుల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు పనులు జరుగుతున్నాయని, జూన్ చివరి నాటికి పనులు పూర్తవుతాయని సిఆర్‌డిఎ తరపున న్యాయవాది శశివర్ధన్ హైకోర్టుకు తెలియజేశారు. కోర్టు ఆదేశాల తర్వాత విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి హైకోర్టుకు వచ్చే దారిలో దీపాల ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించినట్లు చెప్పారు. విచారణను జూన్ 20కు వాయిదా వేస్తూ జస్టిస్ డి రమేష్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ విచారణకు సిఆర్‌డిఎ కమిషనరు స్వయంగా హాజరు కావాలని స్పష్టం చేశారు. హైకోర్టుకు వచ్చే మార్గంలో విద్యుత్ దీపాలు, రోడ్లు, భద్రత ఏర్పాట్లు చేయాలని కోరుతూ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అక్కెన వేణుగోపాలరావు దాఖలు చేసిన కేసులో ఉత్తర్వులు అమలు చేయలేదని కోర్టు ధిక్కార పిటిషన్ వేశారు.

కర్ణాటక ఎన్నికల పరిశీలకుడిగా సిఆర్‌డిఎ కమిషనరు ఉన్నందున వ్యక్తిగత హాజరీకి మినహాయింపు కోరుతూ మెమో దాఖలు చేశారు.

స్టేకు నిరాకరణ

ఎపి భూదాన్ యజ్ఞ బోర్డు ఛైర్మన్‌గా టి విజయభాస్కర్‌రెడ్డి నియామకాన్ని సవాల్ చేసిన కేసులో స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ప్రతివాదులైన రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, భూ పరిపాలన ప్రధాన కమిషనర్, హైదరాబాద్, భూదాన్ యజ్ఞ బోర్డు కార్యదర్శి, ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను 2 వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. భూదాన్ యజ్ఞ బోర్డు ఛైర్మన్‌గా విజయ్‌భాస్కర్‌రెడ్డిని నియమిస్తూ జిఒ 190 జారీని సవాల్ చేస్తూ భూదాన్ బోర్డు ఛైర్మన్ జి.రాజేందర్‌రెడ్డి లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.

వడదెబ్బకు ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి - పోలాకి

వడదెబ్బకు ఉపాధి కూలీ మరణించిన ఘటన శ్రీకాకుళం జిల్లాలో చోటుచేసుకుంది. తోటి కూలిల సమాచారం మేరకు.. పోలాకి మండలం వెదుళ్లవలసకు చెందిన కరగాన సన్యాసమ్మ (70) సోమవారం ఉదయం స్థానిక మునసబుపేట చెరువులో ఉపాధి హామీ పనులకు వెళ్లారు. ఇంటికి తిరిగొస్తుండగా మార్గమధ్యంలో స్పృహ తప్పి పడిపోయారు. తోటి కూలీలు ఆమెను పోలాకి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. ఆమెకు ఓ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ప్రజాధనాన్ని హిందూజా కంపెనీకి చెల్లించొద్దు

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇప్పటికే రూ.800 కోట్లు డిస్కాముల నుండి పొందిన హిందూజా కంపెనీ మరో రూ.2000 కోట్లకు పైగా దొడ్డిదారిన సంపాదించాలని ప్రయత్నిస్తుండటం గర్హనీయమని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే విద్యుత్ రెగ్యులేటరీ కమీషన్ తీర్పులో కేవలం ఉత్పత్తి చేసిన విద్యుత్‌కే రూ.4.88 పైసలు చెల్లించాలని, ఇంకేమీ అవసరం లేదని తీర్పు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం డిస్కామ్ ద్వారా రూ.800 కోట్లు అప్పగించిందని తెలిపారు. హిందూజా కంపెనీ తనకు మరో రూ.1600 కోట్లు చెల్లించాలని తాజాగా ఎపిఇఆర్‌సిని కోరినట్లు వార్తలొచ్చాయని, ఆ ప్రతిపాదనను రాష్ట్రప్రభుత్వం అంగీకరించరాదని, విద్యుత్ నియంత్రణా మండలి (ఎపిఇఆర్‌సి) తిరస్కరించాలని కోరారు. హిందూజా కంపెనీకి ఏ పేరుతో కట్టబెట్టినా అంతిమంగా ఆ భారాన్ని ప్రజలే మోయాలని పేర్కొన్నారు. ఇప్పటికే విద్యుత్ ఛార్జీలు పెరిగి, ట్రూఅప్ ఛార్జీల పేరిట ప్రభుత్వం భారం వేసిందని, హిందూజా పేరుతో మళ్లీ వడ్డించడాన్ని తిరస్కరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మీడియాతో మాట్లాడుతున్న కెఎ పాల్

'ఉక్కు' దీక్షలకు కెఎ పాల్ సంఘీభావం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆలోచనను మోడీ విరమించుకోవాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ పాల్ డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారంనాటికి 802వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు పాల్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది అమరుల త్యాగం, 16 వేల మంది నిర్వాసితుల భూదానంతో ఏర్పడిన ప్లాంట్‌ను అమ్మాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. 2021లో ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా హైకోర్టులో తాను పిల్ వేశానని గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సిఎం జగన్మోహన్ రెడ్డితో చర్చిస్తానని తెలిపారు. ఉక్కు నిర్వాసితులకు, కార్మికులకు న్యాయం చేసేందుకు పార్టీలకు అతీతంగా పనిచేయాల్సి ఉందన్నారు. ఉక్కు కర్మాగారం వల్లే విశాఖ ఇంతలా అభివృద్ధి చెందిందని తెలిపారు. దానిని రక్షించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు.

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ వర్షాలకు వరి, మొక్కజొన్న, మిరప, మామిడి పంటలకు ఎక్కువగా నష్టం వాటిల్లిందని తెలిపింది. ఈ పంటలను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని కోరింది. ఈ మేరకు ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వరిపంట చేతికొచ్చే దశలో మొత్తం దెబ్బతిందని తెలిపారు. ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో మిరప పంటకు నష్టం వాటిల్లిందన్నారు. ఆరబెట్టిన మిరపతోపాటు చెట్ల మీద వున్న మిరప కూడా దెబ్బతిందన్నారు. కృష్ణా, నెల్లూరు, తిరుపతి, గుంటూరు, ప్రకాశం, సత్యసాయి జిల్లాల్లో 80 నుంచి 100 సెంటిమీటర్ల మేర వర్షాలు కురవడంతో పంటలన్నీ దెబ్బతిన్నాయన్నారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పిడుగుపాటుకు ఏడుగురు మరణించారని, వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారం : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో దళితులకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా.. ప్రతిపక్షాలు ఏదో ఒక పద్ధతిలో దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఎస్‌సి ముఖ్యనేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు కె నారాయణస్వామి, మేరుగ నాగార్జున, పినిపె విశ్వరూప్, ఆదిమూలపు సురేష్, ఎంపి గురుమూర్తి, వైసిపి సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఎస్‌సిలకు రాష్ట్రంలో అందుతున్న సంక్షేమ పథకాలపై చర్చించారు. సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా పార్టీ కార్యక్రమం వుండాలన్నారు. సమావేశం అనంతరం మంత్రి ఆదిమూలపు సురేష్ మీడియాతో మాట్లాడుతూ.. టిడిపి హయాంలో మసిపూసి మారేడుకాయ చేసినట్లు ఎస్‌సిలకు పథకాలు పెట్టారని, అవి కూడా వారి పార్టీ కార్యకర్తలకే దక్కేవని అన్నారు. తమ ప్రభుత్వం అర్హులైన వారందరికీ పథకాలు అందేలా సరిదిద్దిందని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు వక్రభాష్యంతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. వాటిని తిప్పికొట్టి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు.

పోరాటాలతో సొసైటీల ప్రయివేటీకరణకు అడ్డుకట్ట

- ముగిసిన సహకార సంఘాల రాష్ట్ర మహాసభ
- అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటరామయ్య, సత్యనారాయణ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పోరాటాలతోనే సహకార సంఘాల ప్రయివేటీకరణకు అడ్డుకట్ట వేయడం సాధ్యమని ఎపి సహకార సంఘాల యూనియన్ రాష్ట్ర, అధ్యక్ష కార్యదర్శులు తోట వెంకట రామయ్య, కొల్లి సత్యనారాయణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెంకటరామయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఏడవ రాష్ట్ర మహాసభ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆదివారం విజయవంతంగా ముగిశాయన్నారు. ఈ మహాసభకు 26 జిల్లాల నుంచి ఉద్యోగులు హాజరయ్యారని తెలిపారు.ఉద్యోగులకు సంబంధించిన హెచ్‌ఆర్ పాలసీ, జిఒ 36 ప్రకారం జీతాలు వెంటనే అమలు చేయాలని, డిస్ట్రిక్ట్ లెవెల్లో సపోర్ట్ ఫండ్ ఏర్పాటు, 2019 నాటి వేతన సవరణ అమలు, టిడిఎస్‌లకు పూర్తి మినహాయింపు, డ్యూటూ పద్దులను రద్దు చేయాలనే అంశాలపై ఈ మహాసభలో తీర్మానించినట్టు వెల్లడించారు. ప్రయివేటు వ్యక్తులకు 50 శాతం షేర్లను కట్టబెట్టడం ద్వారా సహకార సంఘాలను ప్రయివేటు పరం చేయడానికి ద్వారాలు తెరిచినట్లేనని, ఈ విధానాన్ని మహాసభ ఏకగ్రీవంగా వ్యతిరేకించిందని తెలిపారు. పోరాటాల ద్వారా రైతుల హక్కులను కాపాడటానికి వారితో కలిసి ఉద్యమిస్తామని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. రైతులు చెల్లించిన షేర్ ధనంపై ప్రతి సంవత్సరం చెల్లించాల్సిన డివిడెంట్ లేదా వడ్డీ రైతులకు అందాలన్నారు.

నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఎపి సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా పి.అజయకుమార్, అధ్యక్షునిగా తోట వెంకటరామయ్య, ప్రధాన కార్యదర్శిగా కొల్లి సత్యనారాయణ, కోశాధికారిగా పెంకే.సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా గిరిబుచ్చి రంగనాథం, కె.ఆదినారాయణ రావు, కె. వీర వెంకట సత్యనారాయణ, వి.మనోజ్‌కుమార్ ఎన్నికయ్యారు. మొత్తం72 మందితో కమిటీ ఏర్పాటైంది.

బిజెపిని, ఆ పార్టీ మద్దతుదారులను ఓడించాలి

- అటవీ భూములను అదానీకి అప్పగిస్తే ఖబడ్దార్
- ప్రచార భేరి బహిరంగ సభలో సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి- యంత్రాంగం

బిజెపితో పాటు దానికి మద్దతు పలుకుతున్న పార్టీలను కూడా ఓడించాలని సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. గిరిజన చట్టాలను ఉల్లంఘించి అటవీ భూములను అదానీకి అప్పగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం విస్తృత ప్రచారం జరిగింది. దీనిలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో నిర్వహించిన ప్రచార భేరి బహిరంగ సభలో వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మోడీ, జగన్‌లు కలిసి అటవీ భూములను అదానీకి కట్టబెట్టేందుకు పూనుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఐదు ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టుల పేరుతో ఐదు వేల ఎకరాల అటవీ భూములను అదానీ గ్రీన్ ఎనర్జీ, షిరిడీ సాయి కంపెనీలకు గ్రామసభల తీర్మానం లేకుండా అప్పగించారన్నారు. హైడ్రో ప్రాజెక్టుల వల్ల గిరిజనులకు ఒరిగేదేమీ లేకపోగా తాగు, సాగు నీటికి కొరత ఏర్పడనుందని, ఇరిగేషన్ ప్రాజెక్టులకు విఘాతం కలగనుందని తెలిపారు. గిరిజన హక్కుల పరిరక్షణకు రాబోయే కాలంలో విస్తృత పోరాటాలు చేపడతామని, ఇందుకు ఆదివాసీలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని బిజెపి తప్ప అన్ని పార్టీలూ, ఉద్యోగ, కార్మిక సంఘాలూ పోరాడుతున్నా మోడీ నుంచి కనీస స్పందన లేదన్నారు. దేశాన్ని ఎంతో అభివృద్ధి చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీ... మత ఘర్షణలు సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ బిజెపి విధానాల వల్ల దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. నిత్యావసర ధరలు పెంచి ప్రజలపై పెనుభారం మోపిందని తెలిపారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో జరిగిన బహిరంగ సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వ దుశ్చర్యలను రాష్ట్రంలోని అధికార వైసిపికిగానీ, ప్రతిపక్ష టిడిపికిగానీ, జనసేనకుగానీ ఖండించకపోవడం శోచనీయమన్నారు. నవరత్నాలైన ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్రం చూస్తుంటే మద్దతు తెలపడం సరికాదన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నాయకులు జివి.రామారావు అధ్యక్షత వహించారు. బాపట్లలో ప్రచార భేరిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ ప్రమాదంలో ఉన్న భారత దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని, కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీసేందుకు ప్రతిఒక్కరూ కదలి రావాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సింగన కొండ పాల్గొన్నారు.

ప్రచార భేరి బహిరంగ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై బాలేపల్లి వెంకటరమణ, సురేంద్ర తదితరులు

మైనార్టీల రిజర్వేషన్ల రద్దుపై జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ స్పందించాలి

మైనార్టీల రిజర్వేషన్లను రద్దు చేస్తామన్న అమిత్ షా ప్రకటనపై ముఖ్యమంత్రి జగన్, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. విజయవాడ 56, 57 డివిజన్లో జరిగిన ప్రచార భేరిలో ఆయన మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర నాయకులు దోనేపూడి శంకర్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీదేవి, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, సిపిఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తిరుపతిలో అలిపిరి వద్ద సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

- ఎస్మా ప్రయోగించే యోచనలో టిటిడి!

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమ్మె సోమవారం రెండోరోజుకు చేరుకుంది. గత 20 ఏళ్లకుపైగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నామని, జీతాలు పెంచకపోగా ఉన్న జీతాలను టిటిడి అధికారులు తగ్గిస్తున్నారని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. తమను కాంట్రాక్టు పద్ధతిలో కాకుండా టిటిడిలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అయితే యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా అవుట్ సోర్సింగ్ సిబ్బందితో టిటిడి అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కార్మికులు సమ్మె కొనసాగిస్తే.. ఎస్మా చట్టాని ప్రయోగించే యోచనలో అధికారులు ఉన్నట్లు సమాచారం.

భారత మార్కెట్లోకి మారుతి ఫ్రాంక్స్ విడుదల

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి మార్కెట్లోకి తన కొత్త ఎస్‌యువి 'ఫ్రాంక్స్' మోడల్‌ను విడుదల చేసింది. ఎక్స్‌షోరూం వద్ద దీని ధరల శ్రేణిని రూ.7.47 లక్షల నుంచి రూ.13.14 లక్షలుగా నిర్ణయించింది. ఇందులో ఫ్రాంక్స్ సిగ్మా, డెల్టా, డెల్టాం, జీటా, ఆల్ఫా అనే వేరియంట్లు ఉన్నాయి. 1.0 లీటర్, 1.2 లీటర్ ఇంజిన్ సామర్థ్యంతో వీటిని డిజైన్ చేసింది. రూ.11,000తో ముందస్తు బుకింగ్స్‌ను స్వీకరిస్తున్నట్లు తెలిపింది. త్వరలోనే డెలివరీలను ప్రారంభించనున్నట్లు పేర్కొంది.

IN THE COURT OF THE 3RD ADJ AND MACT AT HASSAN
M.V.C. No.64/2016
Petitioner: B.C. Shridhar, S/o Channappa, Bommanayakanahalli Village, Channapatna, Hassan Town.
-V/s-
Respondents: Nagaraja Chorgudi & another
Notice to Respondent No.1:
Nagaraja Chorgudi S/o Ramudu Major, #1931, Bhomma Center Yanamalakuduru Vijaywada District Andra Pradesh-520007. (owner of the Lorry AP:27N-7899)
NOTICE
Whereas the above named petitioner filed the above case against the respondents for compensation of accident claim.
The above case is posted to dated on 25-05-2023 for the appear of you. If you are interested to resist the relief of petitioners, you may appear before the above said Hon'ble court on the above said hearing date at 11.00 clock to oppose the case either personally or through your counsel. On your failure to appear the court will proceed with the matter by placing you exparte.
Given under my hand and seal of the court on 20-04-2023.
By order of the Court, Chief Administrative Officer, District & Sessions Court, Hassan.
Advocate for Petitioner:
KARUNAKARA
2nd Floor, Eden Complex, Harsha Mahal Road, Hassan City-573201.

IN THE COURT OF THE 3RD ADJ AND MACT AT HASSAN
M.V.C. No. 65/2016
Petitioner: B.C.Shridhar, S/o Channappa, Bommanayakanahalli Village, Channapatna, Hassan Town.
-V/s-
Respondents: Nagaraja Chorgudi & another
Notice to Respondent No.1:
Nagaraja Chorgudi S/o Ramudu Major, #1931, Bhomma Center Yanamalakuduru Vijaywada District Andra Pradesh-520007. (owner of the Lorry AP:27N-7899)
NOTICE
Whereas the above named petitioner filed the above case against the respondents for compensation of accident claim.
The above case is posted to dated on 25-05-2023 for the appear of you. If you are interested to resist the relief of petitioners, you may appear before the above said Hon'ble court on the above said hearing date at 11.00 clock to oppose the case either personally or through your counsel. On your failure to appear the court will proceed with the matter by placing you exparte.
Given under my hand and seal of the court on 20-04-2023.
By order of the Court, Chief Administrative Officer, District & Sessions Court, Hassan.
Advocate for Petitioner:
KARUNAKARA
2nd Floor, Eden Complex, Harsha Mahal Road, Hassan City-573201.

సచివాలయ వ్యవస్థను రద్దు చేయం

సర్పంచుల బకాయిలు తీర్చేందుకు కృషి : నారా లోకేష్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

గ్రామ సచివాలయ వ్యవస్థను రద్దు చేయబోమని, సర్పంచులతో అనుసంధానించి గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గం పెద్ద తుంబాల క్రాస్ వద్ద విడిది శిబిరం వద్ద సోమవారం "పల్లె ప్రగతి కోసం మీ లోకేష్" కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు లోకేష్ సమాధానం ఇచ్చారు. తాము అధికారంలోకి వచ్చాకా సర్పంచుల బకాయిలు తీర్చేలా కృషి చేస్తామని, గ్రామాలను అభివృద్ధి చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. ఇంటింటికీ ఇంటర్నెట్ సదుపాయం వచ్చేలా చేస్తామన్నారు. గతంలో పంచాయతీలకు ఎలా నిధులు ఇచ్చామో అలాగే ఇచ్చి పనులు చేపిస్తామని హామీ ఇచ్చారు. తాము పంచాయతీ ఖాతాలకే నిధులు ఇస్తామని, సర్పంచులకు విధి, విధానాలు వెల్లడిస్తామని తెలిపారు. పార్టీలతో సంబంధం లేకుండా, గ్రామీణాభివృద్ధికి పాటుపడే సర్పంచులను ప్రోత్సహిస్తామని, పంచాయతీలకు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు అందిస్తామని, చెక్ పవర్‌ను సర్పంచులకు ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మాట్లాడుతున్న నారా లోకేష్

చందనోత్సవం లోపాలపై కమిటీ

- మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సింహాద్రి అప్పన్న చందనోత్సవం సందర్భంగా ఈ నెల 23న చోటుచేసుకున్న అసౌకర్యాలపై జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జునతో విచారణ కమిటీని నియమిస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో సోమవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది 2.60 లక్షల మంది యాత్రికులు చందనోత్సవంలో పాల్గొన్నారన్నారు. వారిలో రెండు లక్షల మంది ఉచిత దర్శనం యాత్రకులని తెలిపారు. విఐపి క్యూలో నిలబడి ఉన్న కొంతమంది ప్రోటోకాల్ క్యూలోకి అకస్మాత్తుగా రావడంతో ఉద్రిక్తత చోటు చేసుకుందన్నారు.

దీనిపై కలెక్టర్ నివేదిక ఇచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సింహాచలం దేవస్థానం ఇఒగా రెగ్యులర్ అధికారిని త్వరలో ప్రభుత్వం నియమించనుందన్నారు. ప్రస్తుతం కొండపై ఒక ఘాట్‌రోడ్డు మాత్రమేఉందని, దీనివల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని, రెండో ఘాట్ రోడ్డు ఏర్పాటు చేసి మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేసే దిశగా సిఎంతో చర్చించి చర్యలు చేపడతామని చెప్పారు. కొంతమంది సిబ్బంది వైఫల్యం వల్ల శారదా పీఠం స్వరూపానంద స్వామి ఆగ్రహం చెందిన మాట నిజమేనన్నారు. ప్రభుత్వంపై స్వరూపానంద విమర్శలు చేయలేదని తెలిపారు.

అప్పుల్లో డిస్కామ్‌లు

- సబ్సిడీ సొమ్ములివ్వని సర్కారు
- మొత్తం రుణాలు రూ.30 వేల కోట్లుపైనే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అట్టడుగు వర్గాల వారికి, రైతులకు ఇస్తున్న విద్యుత్ సబ్సిడీలకు సంబంధించిన నిధులను డిస్కామ్‌లకు ప్రభుత్వం విడుదల చేయడం లేదు. దీంతో ఆయా డిస్కామ్‌లు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోతున్నాయి. ఇదే సమయంలో ఇతరత్రా చేసే అప్పులు కూడా డిస్కామ్‌లపై పెనుభారంగా మారుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని పంపిణీ సంస్థలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీ బకాయిలు రూ.12,188 కోట్లుగా ఉన్నాయి. ఇందులో తూర్పు పంపిణీ సంస్థకు రూ.3,034 కోట్లు సబ్సిడీ బకాయిలు రావాల్సి ఉండగా, దక్షిణ పంపిణీ సంస్థకు రూ.6,310 కోట్లు రావాల్సి ఉంది. ఇక పవర్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.2,844 కోట్లు రావాలని లెక్కలు తేల్చారు. వాస్తవానికి 2022 మార్చి వరకు రూ.13,596 కోట్ల సబ్సిడీ బకాయిలు ఉండగా, ఆ ఏడాది కేవలం రూ.1,408 కోట్లు మాత్రమే చెల్లించారు. దీంతో ఈ ఏడాది మార్చి నాటకి ఇంకా రూ.12,188 కోట్లు బకాయిలుగా ఉన్నట్లు తేలింది.

ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలతో డిస్కామ్‌లు తీసుకున్న రుణాలు మరో రూ.31వేల కోట్లుగా ఉన్నాయి. ఇలా గ్యారంటీలుగా తీసుకున్న రుణాన్ని కూడా ఆర్థికశాఖ పిడి ఖాతాల ద్వారా తీసుకుని, సకాలంలో తిరిగి చెల్లించకపోవడం వల్ల డిస్కామ్‌లకు మరిన్ని సమస్యలు పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. పిడి ఖాతాల్లో ఉన్న తమ నిధులు, సబ్సిడీ బకాయిలపై పలు దఫాలుగా ఆర్థికశాఖను కోరుతున్నప్పటికీ ఆశించిన ఫలితం దక్కడం లేదని ఇంధన శాఖ అధికారులు వాపోతున్నారు.

బకాయిల వివరాలు (రూ.కోట్లలో)

సంస్థ	2022 మార్చికి బకాయిలు	2022 మార్చికి చెల్లించినది	2023 మార్చికి బకాయిలు
ఇపిడిసిఎల్	3,293	259	3,034
ఎస్‌పిడిసిఎల్	7,292	982	6,310
ఎపిపిడిసిఎల్	3,011	165	2,844
మొత్తం	**13,596**	**1407**	**12,189**

మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

మినీ అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, తమకు వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మినీ అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం గుంటూరులోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బి బేబిరాణి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ మట్లాడారు. రాష్ట్రంలో 5605 మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయని, మినీ సెంటర్లకు హెల్పర్లు లేకపోయినా, వర్కర్.. హెల్పర్.. రెండు పనులూ వారే చేస్తున్నారని తెలిపారు. ఏజెన్సీలు, మారుమూల ప్రాంతాల్లోనూ లబ్ధిదారులకు ఆహారం అందిస్తోన్న వారిని రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. 400 జనాభాకు ఒక మినీ సెంటర్ ఉండాలని, కానీ వెయ్యిమందికి ఒకటి ఏర్పాటు చేశారన్నారు. జనాభా ప్రాతిపదికన వీటిని మెయిన్ సెంటర్లుగా మార్చటానికి సర్వే పూర్తి అయ్యి ఏడాది గడుస్తున్నా ఇంత వరకూ ఎలాంటి పురోగతీ లేదని తెలిపారు. మెయిన్ సెంటర్ వర్కర్లు, హెల్పర్లకు వేసవి సెలవులు ఇస్తున్న ప్రభుత్వం మినీ వర్కర్లకు మాత్రం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు.

ఖాళీలను మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇచ్చి భర్తీ చేయాలని, మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులకు అవకాశం కల్పించాలని, సెంటర్లను అదనపు హెల్పర్‌ను కేటాయించాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ అమలుకు మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజి మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం స్పందించి మినీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర నాయకులు జి శిబారాణి, రెహానాబేగం, నిర్మల, మల్లేశ్వరి, దీప్తి మనోజా, శ్రీదేవి, శకుంతల, దుర్గారాణి, లక్ష్మీదేవి, రమాషమ్మ, బాంధవి, సిఐటియు జిల్లా నాయకులు కె శ్రీనివాసరావు, పెద్ద సంఖ్యలో మినీ వర్కర్లు పాల్గొన్నారు.

అదనపు పరిహారం కోసం ఆందోళన

వ్యకాస నాయకుడిపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తమకు అదనపు పరిహారం అందజేయాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద వంశధార నిర్వాసితులు సోమవారం ధర్నా చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగరాపు సింహాచలం మాట్లాడారు. వంశధార ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు అదనపు పరిహారం రూ.లక్ష చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పరిహారం చెల్లింపు విషయంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు వెళ్తున్న వ్యకాస నాయకులు, నిర్వాసితులను పోలీసులు అడ్డుకున్నారు. సింహాచలం చొక్కా పట్టుకుని దాడి చేశారు. ఎస్ఐ జోక్యం చేసుకుని పోలీసులను వారించి, వినతిపత్రం ఇచ్చేందుకు నాయకులను అనుమతించారు.

ధర్నా చేస్తున్న వంశధార నిర్వాసితులు

పోలీసులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

శాంతియుతంగా ధర్నా చేసి, వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న సింహాచలంపై పోలీసుల దాడిని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి ఖండించారు. పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, సమస్యలు విన్నవించుకోవడానికి వెళ్తున్న వారిపై ప్రభుత్వం దౌర్జన్యకాండకు పాల్పడుతోందని విమర్శించారు.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.
టెండరు నం.: జిటిఎల్-ఇఎం-01-2023-24, తేది: 20.04.2023
PUB/0421
భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ మెయింటేనన్స్/గుంతకల్ వారు వ్యవహరిస్తూ, దిగువ పనుల కొరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.
టెండరు నం.: జిటిఎల్-ఇఎం-01-2023-24. గుంతకల్ డివిజన్- మంత్రాలయం రోడ్, ఆదోని, గూటి జంక్షన్, తాడిపత్రి, రాజంపేట, శ్రీకాళహస్తి& ధోన్ జంక్షన్ స్టేషన్ల వద్ద సాఫ్ట్ అప్‌గ్రేడ్స్/ మెరుగుపరుచుటకు ఎలక్ట్రికల్ ఏర్పాట్లుచేయుట- ఎలక్ట్రికల్ ఏర్పాట్లు. అంచనా విలువ: రూ.5,49,35,754/-.
ముగింపు తేది& సమయం: 15.05.2023న 15:00గం.లు.
టెండరు పై బిడ్డింగ్& ఇతర వివరాల కొరకు, http://www.ireps.gov.in. ను లాగిన్‌చేయండి. టెండరు యొక్క సవరణ, ఏవేని ఉంటే ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీచేయబడుతాయి. టెండరుదారులు టెండరు పత్రంను http://www.ireps.gov.in ద్వారా ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
గమనిక: ఈ టెండరులో పాల్గొనుట/ బిడ్‌కు, టెండరుదారు వాలిడ్ డిఎస్‌సి (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్) కలిగియుండవలెను.
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, మెయింటేనన్స్, గుంతకల్
ఇ-టెండరు ప్రకటన నం.: 01/2023-24, తేది: 19.04.2023
PUB/0422
భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (మెయింటేనన్స్), గుంటూరు వారు వ్యవహరిస్తూ, ఐఆర్‌ఇపిఎస్ పోర్టల్ www.ireps.gov.in ద్వారా దిగువ ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.
క్ర.సం.:01. టెండరు టైటిల్: గుంటూరు డివిజన్: గుంటూరు డివిజన్ పై రైల్వే స్టేషన్ల వద్ద ప్యాసింజర్ లిఫ్టులు 11నం.లు ఏర్పాటుచేయుట. (1) నర్సారావుపేట్, నడికుడి వద్ద ఒక్కొటి చొ॥న 02నం.ల లిఫ్టులు), (2) సత్తెనపల్లి, మిర్యాలగూడ వద్ద ఒక్కొటి చొ॥న 02నం.ల లిఫ్టులు & (3) నల్లగొండ వద్ద 01నం.ల లిఫ్ట & మర్కాపూర్ రోడ్ వద్ద 02నం.ల లిఫ్టులు.
టెండరు రెఫరెన్స్ నం.: జిఎన్‌టి/ఇ.01/2023-24, తేది: 19.04.2023. అంచనా విలువ రూ.: 36,43,171.22 పై.లు, ధరావత్తు డిపాజిట్ రూ.: 72,900/-. టెండరు ఫారం ధర (వాపసు రానిది) రూ: 0/-
ఇ-బిడ్స్ ఆన్‌లైన్ దాఖలుచేయుట కొరకు చివరి తేది& సమయం: 12.05.2023న 10:30గం.ల వరకు.
ఏవేని తదుపరి సమాచారం/ సవరణలు ఇ-పోర్టల్ www.ireps.gov.in లో మాత్రమే ప్రచురించబడుతాయి.
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, మెయింటేనన్స్, గుంటూరు.
A0589
తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైటు https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి

यूनियन बैंक ऑफ इंडिया యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
Andhra | Corporation
ప్రత్తిపాడు బ్రాంచి
మెయిన్ రోడ్డు, ప్రత్తిపాడు, గుంటూరు జిల్లా.
ఫోన్: 0863-2280224
NOTICE UNDER SECTION 13 (2) OF ACT 54 OF 2002 FOR ENFORCEMENT OF SECURITY INTEREST
డిమాండ్ నోటీసు
టు : ఋణగ్రహీత : 1) శ్రీ మెరికనపల్లి వీరాంజనేయులు, తండ్రి : పరమేశ్వరుడు, డి.నెం. 11-50, శివాలయం దగ్గర, నాయుళ్ళ బజారు, ప్రత్తిపాడు గ్రామం, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా. ఎపి - 522019. 2) శ్రీ మెరికనపల్లి వెంకట సాంబశివరావు, తండ్రి : పరమేశ్వరుడు, డి.నెం. 11-43, శివాలయం దగ్గర, నాయుళ్ళ బజారు, ప్రత్తిపాడు గ్రామం, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా. ఎపి - 522019.

ఫెసిలిటీ / లోన్	లిమిట్స్	సమయం	బకాయి మొత్తము (రూ.) ది. 27-03-2023
HL005	రూ. 15,00,000/-	13-01-2022	Rs. 14,21,952/-

ప్రాథమిక హామీ : ఎ) శ్రీ మెరికనపల్లి వీరాంజనేయులు గారి పేరిట గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మండలం, ప్రత్తిపాడు గ్రామం, నాయుళ్ళ బజారు, శివాలయం దగ్గర, సర్వే డి.నెం. 761/ఎ, డోర్ నెం. 11-50 వద్ద 187 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము అందలి ఆర్ సి సి డాబా ఇల్లు. హద్దులు : తూర్పు : పంచాయితీ రోడ్డు, దక్షిణం : మెరికనపల్లి కృష్ణమూర్తి గారి స్థలము, పడమర : మెరికనపల్లి వెంకట సాంబశివరావు గారి ఇల్లు, ఉత్తరం : నీలం వెంకట సత్యనారాయణ గారి ఆర్‌సిసి ఇల్లు.
అమ్మా / అయ్యా,
విషయం : ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు - మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి - నిరర్థక ఆస్తులుగా వర్గీకరణ.
ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు HL005 లోన్ క్రింద మా ప్రత్తిపాడు బ్రాంచి వద్దనున్న మీ ఋణ బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున మీ ఖాతాను ది. 27-03-2023 న నిరర్థక ఆస్తిగా (NPA) వర్గీకరించ బడింది. ఎగువ తెలిపిన తేదిన మీ ఋణ ఖాతాల బకాయిలు మొత్తము పైన తెలుప బడినవి. అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు / మీ ఋణములను చెల్లించలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 యొక్క సెక్షన్ 13 (2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పందపు రేటు ప్రకారము పైన తెలుపబడిన బకాయి తేది తదుపరి నెలవారి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంకుకు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.
1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంకు వారు సదరు చట్టం ప్రకారం వారికి సంక్రమించిన అన్ని హక్కులను వినియోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయ ధనముతో బకాయిలను పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము / డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ నందు తగు న్యాయపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.
2) సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (13) ప్రకారము ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏ విధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.
SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.
తేది : 05-04-2023 సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

Chola Enter a better life
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: నం.2, దారె హౌస్, 1వ అంతస్తు, ఎన్ఎస్‌సి బోస్ రోడ్, చెన్నై-600001.
బ్రాంచి ఆఫీసు చిరునామా: డోర్ నం.59-14-2ఎ, 1వ అంతస్తు, శాంతి ప్లాజా, గాయత్రినగర్, విజయవాడ-520008.
బ్రాంచి ఆఫీసు చిరునామా: ఇంటి నం.6-9-23, వార్డు 3, 9వ లేన్, 2వ అంతస్తు, అరండల్‌పేట్, గుంటూరు-522002. సంప్రదించాల్సిన నం. 9177101060-దుర్గా ప్రసాద్ జి.
స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన
ది సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1)కు నియమాలతో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.
ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత/సహారుణగ్రహీత/తాకట్టుదారుకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టుపెట్టబడినవి, వాటిని చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిచేత భౌతిక స్వాధీనం చేసుకోబడినవి. దానిని ఇందు తదుపరి చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ గా పేర్కొనుట జరుగుతుంది. సెక్యూర్డ్ అసెట్స్ "ఏది ఎక్కడ ఎలా ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది" ప్రాతిపదికన ఇవేలం ద్వారా విక్రయించబడుతుంది.
ఇందుమూలంగా సర్వజనులకు తెలియజేయబడునది ఏమనగా, మేము వెబ్‌సైట్:https://bankauctions.in/ ద్వారా బహిరంగ ఇ-వేలంను నిర్వహించుటకు ముందుకుసాగుతున్నాము.

ఖాతా నం. & రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, తాకట్టుదారుల పేరు	సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు ప్రకారం తేది& మొత్తాలు	ఆస్తి వివరణ	రిజర్వు ధర / ధరావత్తు / బిడ్ పెంపుదల మొత్తాలు	ఇ-వేలం తేది& సమయం / ధరావత్తు దాఖలుచేయుటకు చివరి తేది / పరిశీలన తేది
యక్స్0హెచ్ఇజియుఎన్0000223470 &హెచ్ఇ02సిఆర్ఎ00000008543, 1. శ్రీ ఆదిత్య సాయి కుమార్ చెవురు, 2. పసుమర్తి ఫణి లక్ష్మి పద్మిన్, 3. చెరువు శ్రీ సూర్యకాంత్: అందరి నివాసం: డోర్ నం.13-5-6, పాత ఇన్‌కంటాక్స్ ఆఫీసు రోడ్, బాపట్ల-522101. 4. మెసర్స్ కుమార్ ఏజెన్సీస్, డోర్ నం.4-3-21, జిబిసి రోడ్, బాపట్ల-522101.	18.10.2021 & 18.10.2021 నాటికి రూ.1,57,34,709.60 పై.లు మరియు రూ.29,75,384/- మొత్తం రూ.1,87,10,093.60పై.లు	ఆస్తి-1: నరసారావుపేట్ సబ్-రిజిస్ట్రార్ (ఆర్.ఒ), పశ్చిమ బాపట్ల గ్రామం, బాపట్ల మున్సిపాలిటీ వద్ద రిజిస్టరైన తేది: 17.06.2016 నాటి సేల్ డీడ్ పత్రం నం.4730/2016 ద్వారా దానిని సేకరించియున్న పాత ఇన్‌కం టాక్స్ ఆఫీసు రోడ్డు, రైల్వే స్టేషన్ దగ్గర, బాపట్లా522101 వద్ద డోర్ నం.13-5-6/1 వద్దగల 350.9చ.గ.ల విస్తీర్ణపు నిర్మాణ ఏరియాతో ల్యాండ్, డోర్ నం.573/4 గల ఇంటి ఆస్తి మొత్తం. ల్యాండ్ సరిహద్దులు: తూర్పు: మున్సిపల్ రోడ్, దక్షిణం: చెరువు శివ రామ కృష్ణన్ ఆస్తి, పడమర: ముచ్చ అంకమ్మ ఆస్తి, ఉత్తరం: మున్సిపల్ రోడ్.	Rs.2,00,70,000/- Rs.20,07,000/- Rs.1,00,000/-	15.05.2023 ఉ॥ 11:00గం.ల నుండి మ॥ 1:00గం.లు (ప్రతిసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)
		ఆస్తి-2: సుల్లూరుపేట్ సబ్-రిజిస్ట్రీ (ఆర్.ఒ), నర్సింహునిగుంట గ్రామపంచాయతి వద్ద రిజిస్టరైన సేల్ డీడ్ నం.2039/2016, తేది: 13.07.2016 ద్వారా దానిని సేకించిన ప్లాట్ నం.86, ఆర్యభట్ట నగర్, కెఆర్‌పి రోడ్, దేగలపాలెం గ్రామం, కుదిరి చెరువు, నరసంహోంగునిగుట్ట గ్రామపంచాయతి, పూలూరుపేట్-524121 వద్దగల భవన ఏరియాతో 166.66చ.గ.ల విస్తీర్ణంతో సర్వే నం.120/3ఎ, 121/3బి, పి.ఆర్.నం.2/2005, పట్టా నం.148& 298గల ఇంటి ఆస్తి మొత్తం మరియు ల్యాండ్ సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం.122లో ఖాళీ సైటు, దక్షిణం: ప్లాట్ నం.85లో ఖాళీ సైటు, పడమర: 25అ.ల వెడల్పు రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నం.87లో ఖాళీ సైటు.	Rs.34,47,000/- Rs.3,44,700/- Rs.50,000/-	12-05-2023 (up to 5.30.P.M) 08-05-2023 and 09-05-2023 (10.00 A.M to 1.00. P.M)

1. పాల్గొనుటలో ఆసక్తిగల వారు/ బిడ్డరుదారులు వెబ్‌సైట్:https://bankauctions.in/&https://www.cholamandalam.com/auction-notices. ను దర్శించవలసిందిగా కోరబడుచున్నది. వివరాలు, సహాయం, విధానం మరియు ఇ-వేలం పై ఆన్‌లైన్ శిక్షణ కొరకు, ఆసక్తిగల బిడ్డరుదారులు శ్రీ మహ్మద్ రహీస్-8124000030, ఎం.4క్లోజర్; శ్రీ యు.సుబ్బారావు, ఫోన్ నం.8142000061, ఇ-మెయిల్:subbarao@bankauctions.in, ఇ-మెయిల్:bharathi@bankauctions.inను సంప్రదించగలరు.
2. నియమాలు& నిబంధనల పై తదుపరి వివరాల కొరకు, ఇ-వేలంలో పాల్గొనుట కు దయచేసి https://bankauctions.in/& https://www.cholamandalam.com/auction-notices ను దర్శించండి.
ఇది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) క్రింద 15 రోజుల చట్టబద్ద అమ్మకం ప్రకటన కూడా.
తేది: 25.04.2023, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, మెసర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

సంపాదకీయం

ధాన్యం రైతు గోడు

రబీ ధాన్యం సేకరణపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. రైతు పండించిన ప్రతి గింజకూ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ఇచ్చి తీరతామని ప్రతిన బూనిన సర్కారు ఏప్రిల్ నాల్గవ వారం గడుస్తున్నా రబీ ధాన్యం సేకరణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయకపోవడాన్ని బట్టి ప్రభుత్వ బాసలను శంకించాల్సి వస్తోంది. కొన్ని జిల్లాల వారీగా తప్ప రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడెక్కడ ఎంత పరిమాణంలో ధాన్యాన్ని కొంటారో టార్గెట్‌పై స్పష్టత లేదు. ఇలాగైతే కొనుగోళ్లు ఎలా సాగుతాయి? రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె)లో కొనుగోలు కేంద్రాలంటున్నా చాలా చోట్ల ప్రారంభం కాలేదు. ఒకటీఅరా ప్రారంభించినా అవసరమైన మౌలిక సదుపాయాల్లేవు. కాగా వేసవిలో అకాల వర్షాల భయం అన్నదాతలను వెంటాడుతోంది. అందుకే రైతులు సర్కారీ కొనుగోలు కేంద్రాలను నమ్ముకోకుండా వచ్చినకాడికి పంటను తెగనమ్ముకుంటున్నారు. ఇదే సందని మిల్లర్లు, వ్యాపారులు, దళారులు రైతులను అందినకాడికి దోచుకుంటున్నారు. ఎంఎస్‌పిలో బస్తాపై రూ.వంద రెండొందలు తక్కువ ఇస్తున్నారు. వరి కోతల ప్రారంభ దశలోనే పరిస్థితులు ఇలా ఉంటే, ఇక కోతలు ముమ్మరమై విరివిగా ధాన్యం మార్కెట్‌కొస్తే దోపిడీ ఇంకెంతగా ఉంటుందో ఊహించవచ్చు. మరోవైపు 'బోండాలు' రకం ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం స్పష్టతనివ్వక పోవడంతో ఆ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.

ఖరీఫ్‌లో ధాన్యం రైతులు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఇ-క్రాప్, ఇ-కెవైసి, ఆధార్ బేస్డ్ బ్యాంక్ పేమెంట్స్, ల్యాండ్ రికార్డ్స్, ముందస్తు రిజిస్ట్రేషన్లు... నిబంధనలతో రైతులు విసిగివేసారి పోయారు. కౌలు రైతులైతే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల గుమ్మం తొక్కలేకపోయారు. తగినన్ని గోనె సంచులను సైతం ప్రభుత్వం అందుబాటులో ఉంచలేకపోయింది. తేమ శాతం, నాణ్యతా ప్రమాణాల పేరుచెప్పి మిల్లర్లు రైతులను దోచుకున్నారు. ధాన్యాన్ని మిల్లర్ల వద్దకు తోలేందుకు అయ్యే రవాణా, హమాలీ ఛార్జీలను ప్రభుత్వం భరిస్తుందనగా, ఆ పేమెంట్స్ రైతులకు కాకుండా మిల్లర్లకు అందాయి. అన్ని అవాంతరాలనూ దాటుకొని ధాన్యం తోలితే, నిర్ణీత గడువు మూడు వారాల్లోపు సొమ్ము చెల్లించాల్సి ఉండగా, నెలల పర్యంతం చెల్లింపులు ఆగిపోయాయి. ధాన్యం ఇచ్చి రొక్కం కోసం ఎదురు చూపులు చూడాల్సిన దైన్యం రైతులది. ఇప్పటికీ ఖరీఫ్ పేమెంట్స్ జరగని ఉదంతాలున్నాయి. రబీ వచ్చినా అక్కడక్కడ రైతుల వద్ద ఖరీఫ్ ధాన్యం ఉంది. ఈ అనుభవాల నేపథ్యంలో ప్రభుత్వం రబీ ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాల్సి ఉండగా, ఇంకా కొనుగోలు కేంద్రాల ప్రారంభంపై ఆచితూచి అడుగులేయడం రైతుల పట్ల ప్రభుత్వ నిలువెత్తు నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యం.

రబీలో వరి సాగు తగ్గింది. సాధారణ సాగు 19.52 లక్షల ఎకరాలు కాగా 16.40 లక్షల ఎకరాల్లోనే సాగైంది. ఎకరానికి 37 బస్తాలొస్తాయని (బస్తాకు 75 కిలోలు) అంచనా వేశారు. సుమారు 50 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి వస్తుంది. రబీ ధాన్యం సేకరణ అంతకంతకూ తగ్గుతోంది. 2019-20లో 34.73 లక్షల టన్నులు, ముందటేడు 37.24 లక్షల టన్నులు సేకరించగా, నిరుడు 26.24 లక్షల టన్నులే సేకరించారు. ఈ పూర్వరంగంలో ఈ తడవ ఎంత మేరకు సేకరిస్తారో తెలీదు. ఖరీఫ్‌లో 37 లక్షల టన్నులు సేకరించాలనుకొని టార్గెట్‌లో లక్షన్నర టన్నులు సేకరించలేదు. ప్రభుత్వం సేకరణ తగ్గించినపక్షంలో వ్యాపారులు, దళారులు ఇంకా రైతుకు ధరలు దిగ్గోస్తారు. ప్రస్తుతం సర్కారు ప్రకటించిన ఎంఎస్‌పి క్వింటాకు 'ఎ' గ్రేడు రకానికి రూ.2,060, సాధారణ రకానికి 2,040. ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోకపోతే రైతులు అంతకంటే తక్కువకు అమ్ముకొని నష్టపోతారు. ఒక్క వరి ధాన్యమే కాదు పప్పుశనగ, పసుపు, మిరప, మొక్కజొన్న పంటలు కొనే దిక్కు లేక రైతులు ఆగమాగమవుతున్నారు. ధరల స్థిరీకరణ నిధిని ఉపయోగించి మార్కెట్‌లో జోక్యం చేసుకొని ప్రభుత్వం రైతుల నుంచి పంటలు కొనుగోలు చేసి ఆదుకోవాలి. మార్కెట్‌లో జోక్యం పథకాలకు కేంద్రం బడ్జెట్‌లో నిధులివ్వలేదు. వరి ధాన్యం సేకరణను కేంద్రం కుదిస్తోంది. రాష్ట్రం కేంద్రంపై పోరాడాలి. రాష్ట్రానికి రావాల్సిన ఆహార భద్రతా చట్టం నిధుల సాధనకు కేంద్రంపై ఒత్తిడి చేయాలి. అప్పుడే రాష్ట్ర రైతు, ప్రజల ప్రయోజనాలు కాపాడబడతాయి.

మహనీయుని మాట



పేదరికంలో మగ్గుతున్న అభాగ్యుడికి తనను ఆకలికి గురిచేసిన దేశాన్ని ఎవరు పాలిస్తే ఏమిటి? తనకు కావలసిందంతా తన దుర్భర పరిస్థితిలో మార్పు వస్తుందా రాదా అనేదే.

- డేనియల్ డి లియోన్,
అమెరికన్ సోషలిస్టు లేబర్ పార్టీ నాయకుడు.

మన దేశ ఆర్థిక పరిస్థితి పుంజుకునే మార్గం

ప్రభాత్ పట్నాయక్

భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోని ప్రధాన దేశాలలోకల్లా అతి వేగంగా పెరుగుతోందని మన ప్రభుత్వ అధికారులు అలుపూ, విరామం లేకుండా చెప్తూనే వుంటారు. 2020-21లో మన దేశం అత్యంత దుర్మార్గమైన లాక్‌డౌన్‌ను అమలు చేసిన సంగతి గాని, దాని పర్యవసానంగా ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నింటిలోకీ మన దేశమే అత్యంత ఎక్కువ మోతాదులో జిడిపి పతనాన్ని చవిచూసిన సంగతి గాని వారు ఎన్నడూ ప్రస్తావించరు. అలా అతి హీన స్థాయికి పడిపోయిన సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుని అక్కడి నుంచి మన పెరుగుదలను లెక్కించి మన దేశ ఆర్థిక వ్యవస్థ చాలా వేగంగా వృద్ధి చెందుతోందంటూ చెప్పుకుంటున్నారు.

లాక్‌డౌన్ కన్నా ముందటి ఏడాది, అంటే 2019-20తో 2021-22 సంవత్సరపు (లాక్‌డౌన్ తర్వాత ఏడాది) జిడిపిని పోల్చి చూస్తే కేవలం 1.5 శాతం మాత్రమే ఎక్కువగా ఉంది. ఇక 2022-23 సంవత్సరపు జిడిపి అంతకు ముందటి ఏడు (2021-22) కన్నా 6.8 శాతం ఎక్కువగా ఉంటుందని ఐఎంఎఫ్ గాని, మన రిజర్వు బ్యాంకు గాని అంచనా వేస్తున్నాయి. అంటే అది 2019-20 కన్నా 8.4 శాతం ఎక్కువ అన్నమాట. మధ్యలో 2020-21 ని పక్కన పెట్టి చూస్తే (అది లాక్‌డౌన్ సంవత్సరం కనుక) 2019-20 నుండి 2022-23 దాకా ఉన్న మూడు సంవత్సరాల కాలంలో ఏడాదికి 2.7 శాతం చొప్పున మాత్రమే మన దేశ ఆర్థిక వ్యవస్థ పెరుగుదలను నమోదు చేసినట్టు కనిపిస్తుంది. ఈ హీనమైన పెరుగుదల కూడా 2023-24లో కొనసాగే అవకాశాలు లేవు. గత ఏడాది కన్నా తక్కువ స్థాయిలోనే పెరుగుదల ఈ సంవత్సరం ఉండబోతున్నట్టు అంచనాలు సూచిస్తున్నాయి.

దాదాపు అన్ని సంస్థలూ 2023-23లో వృద్ధి రేటు గతేడాది కన్నా తక్కువగానే ఉండబోతున్నట్టు తమ తమ అంచనాలను ప్రకటించాయి. ఐఎంఎఫ్ అంచనాలనే చూసుకుంటే భారతదేశం 2022-23లో 6.8 శాతం వృద్ధి నమోదు చేసిందని, అదే 2023-23లో వృద్ధి 5.9 శాతం మాత్రమే ఉండబోతున్నదని తెలిపింది. మన ప్రభుత్వ అధికారులు ప్రకటిస్తున్న వృద్ధిరేటు తప్పుడు ప్రాతిపదికలతో లెక్కించినందు వలన వాటిని ప్రామాణికంగా తీసుకోకూడదని, వాస్తవ వృద్ధి రేటు కన్నా బాగా ఎక్కువగా చూపిస్తున్నారని కేంద్ర ప్రభుత్వానికి గతంలో ముఖ్య ఆర్థిక సలహాదారుగా పని చేసినవారు తెలిపారు. లాక్‌డౌన్‌తో కుదేలైన మన ఆర్థిక వ్యవస్థ ఆ తర్వాత పడుతూ లేస్తూ ముందడుగు వేస్తోందని, ఇప్పుడు ఆ పరిస్థితి కూడా కొనసాగే అవకాశాలు కనిపించడం లేదని, ఈ ఏడాది వృద్ధిరేటు తగ్గబోతోందని అంచనాలు వెల్లడిస్తున్నాయి.

ఇప్పుడు వేస్తున్న అంచనాల కన్నా కూడా ఇంకా తగ్గుదల ఎక్కువగా ఉండబోతోందని చెప్పవచ్చు. ఎందుకంటే చమురు ఉత్పత్తి దేశాలు మే ఒకటో తేదీ నుండి తమ ఉత్పత్తిని రోజుకు పది లక్షల బ్యారెళ్ళ మేరకు తగ్గించుకోవాలని నిర్ణయించాయి. గత అక్టోబర్ లో 20 లక్షల బ్యారెళ్ళ మేరకు తమ రోజువారీ ఉత్పత్తిని తగ్గించాయి. దానిమీద ఇప్పుడు అదనంగా మరోసారి తగ్గించబోతున్నాయి. దీని ఫలితంగా మన దేశ వృద్ధిరేటు మరింత దెబ్బ తింటుంది.

చమురు ఉత్పత్తి తగ్గించినందు వలన అమెరికాలో ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం మరింత కష్టసాధ్యం ఔతుంది (గత వారం వ్యాసంలో ఈ విషయాన్ని వివరంగా మనం చర్చించాం). అందువలన అమెరికా తన వడ్డీ రేట్లను మరింత పెంచక తప్పదు. అప్పుడు మన దేశం నుండి పెట్టుబడులు అమెరికా వైపు మరింత ఎక్కువ వేగంగా తరలిపోతాయి. మన దగ్గర ఉండే డాలరు నిల్వలు తరిగిపోతే మన రూపాయి విలువ పడిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే విదేశీ నిల్వలు అమెరికాకు తరలిపోకుండా ఆపాలి. అందుకోసం మన దగ్గర వడ్డీ రేట్లను కూడా బాగా పెంచాలి. అప్పుడు మన దేశంలో ద్రవ్యోల్బణం బాగా పెరుగుతుంది. దాని ఫలితంగా మన ఆర్థిక వృద్ధిరేటు తగ్గిపోతుంది.

అమెరికా వడ్డీరేట్ల సంగతి పక్కన పెట్టినా, చమురు ఉత్పత్తి తగ్గిందంటే దాని ఫలితంగా పెట్రోలు, ఇతర చమురు ఉత్పత్తుల ధరలు పెరిగిపోతాయి. అప్పుడు మన దేశం దిగుమతి చేసుకునే చమురుకు ఎక్కువ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. దాని కారణంగా ఇతరత్రా ఆర్థిక కార్యకలాపాలకు చేసే ఖర్చు తగ్గిపోతుంది. దానిఫలితంగా మన వృద్ధిరేటు తగ్గిపోతుంది.

ఈ చమురు ధరలు పెరగడం వలన కలిగే ప్రభావం పక్కన పెట్టినా, మన దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగం తగ్గిపోనుంది. నిజానికి 2022-23 చివరి త్రైమాసికం లోనే వృద్ధిరేటు అంతకు ముందరి మూడు నెలలతో పోల్చితే 4.4. నుండి 4.2 కి తగ్గిపోయిందని రిజర్వు బ్యాంకు అంచనాలు చెప్తున్నాయి. కరోనా మహమ్మారి అనంతరం మన దేశం సాధించిన స్వల్పమైన వృద్ధి రేటు కూడా నిలబడకుండా ఎందుకు దిగజారిపోతోంది?

దీనికి మూల కారణం నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థ స్వభావంలోనే ఉంది. ఈ తరహా ఆర్థిక వ్యవస్థలో జరిగే మొత్తం ఉత్పత్తిలో ప్రైవేటు వ్యక్తుల వినిమయం భాగం తగ్గిపోతుంది. ఆర్థిక అసమానతలు నయా ఉదారవాద విధానాల ఫలితంగా పెరిగిపోతాయి. అందువలన ఎక్కువ మంది వ్యక్తుల వినిమయ శక్తి తగ్గిపోతుంది. తమ ఆదాయాలతో నిమిత్తం లేకుండా ఖర్చు చేయగలవారు (సంపన్నులు) కొద్ది శాతమే ఉంటారు. వారి వినిమయం ఎంత ఉన్నా, దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు నెట్టడానికి అది సరిపోదు. ఇంకోవైపు ప్రైవేటు వ్యక్తులు పెట్టే పెట్టుబడులు మార్కెట్‌లో వృద్ధి ఎంత మోతాదులో ఉండబోతోంది అన్న అంచనా బట్టి ఉంటాయి. కాబట్టి ప్రైవేటు పెట్టుబడులూ ఆర్థిక వృద్ధిని ముందుకు నెట్టడానికి తోడ్పడవు. ఇక ప్రభుత్వం చేసే వ్యయంతో ఆర్థిక వృద్ధిని ప్రేరేపించాలనుకుంటే, ఆ ప్రభుత్వ వ్యయం కూడా పరిమితులకు లోబడే ఉండాలి. ఎందుకంటే ద్రవ్యలోటు జిడిపిలో ఒక నిర్దిష్ట శాతానికి (దాదాపు 4 శాతం) మించి ఉండకూడదన్నది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి విధించిన నిబంధన. ఆ నిబంధనను అతిక్రమించకుండా ప్రభుత్వ వ్యయం పెరగాలంటే సంపన్నుల మీద విధించే పన్నులను పెంచడమే మార్గం. కాని అందుకు కూడా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఒప్పుకోదు. ఇంక మిగిలినవి రెండే మార్గాలు. మొదటిది: దిగుమతులకన్నా ఎగుమతులు బాగా ఎక్కువగా ఉండేలా చూసుకోవడం, రెండోది: గృహాల, భూముల విలువలను కృత్రిమంగా పెంచివేయడం. అప్పుడు వ్యక్తుల ఆదాయాలతో నిమిత్తం లేకుండా ఆర్థిక వ్యవస్థ వృద్ధి కొంతవరకూ జరగవచ్చు.

కాని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే ఆర్థికమాంద్యం దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఉన్న ద్రవ్యోల్బణానికి విరుగుడుగా ఆర్థికమాంద్యాన్ని ప్రయోగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో ఎగుమతులు పెరగడం మాట అటుంచి తగ్గే ప్రమాదం ఉంది. ఇక గృహాల, భూముల మార్కెట్ విలువలను కృత్రిమంగా పెంచడం అనేది మన దేశంలో అంతగా ఫలితాన్ని ఇవ్వదు. ఒక చిన్న సామాజిక తరగతిని మరింత ధనవంతులుగా చేయడానికి మాత్రమే అది తోడ్పడుతుంది. ఆ తరగతి చేసే వినిమయం ప్రధానంగా విదేశాల మార్కెట్లకు తోడ్పడుతుంది. మొత్తంగా చూస్తే మన దేశ ఆర్థిక వృద్ధి అనేది పెరుగుతుందని ఆశించడానికి ఏ కారణమూ కనిపించడంలేదు. పైగా అది తగ్గుముఖం పడుతోందని చెప్పడానికి తగిన కారణాలు ఉన్నాయి. పెట్టుబడుల వృద్ధి రేటు తగ్గుతోంది. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వినిమయం తగ్గుతోంది. ఐఎంఎఫ్ కూడా ప్రైవేటు వ్యక్తుల వినిమయంగాని, పెట్టుబడులు గాని పెరగని కారణంగానే భారతదేశ ఆర్థికవృద్ధి తగ్గుముఖం పట్టనున్నట్టు చెప్తోంది. ఇంత తేడా ఉన్నప్పుడు ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా దానిని అధిగమించగలిగే పరిస్థితి ఎటుతిరిగీ లేనే లేదు.

ఇన్ని పరిమితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం తాను ఏయే పద్దుల మీద ఖర్చు చేస్తోందో ఆ ఖర్చు కేటాయింపులను మార్చితే మన ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని ప్రేరేపించే అవకాశాలు ఉన్నాయి. ఉదాహరణకు ప్రభుత్వం చేసే ఖర్చు నేరుగా శ్రామిక ప్రజానీకానికి అందించవచ్చు, లేదా, మౌలిక వసతుల కల్పనపై ఖర్చు చేయవచ్చు. ఒకవేళ ప్రభుత్వం నేరుగా శ్రామిక ప్రజానీకానికి అందే విధంగా ఖర్చు చేసిందనుకుందాం. అప్పుడు ఆ సొమ్ము మొత్తం శ్రామిక ప్రజానీకం తిరిగి ఖర్చు చేసేస్తారు. వాళ్ళు సరుకులను, సేవలను పొందడానికి ప్రధానంగా ఖర్చు చేస్తారు. ఆ సరుకుల ఉత్పత్తి ప్రధానంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో జరుగుతుంది. ఆ పరిశ్రమలకు మిగిలే లాభాలు చాలా తక్కువగా ఉంటాయి. అంతేగాక, ఆ చిన్న పరిశ్రమల యజమానులు తమ వద్దకు వచ్చిన సొమ్మును మళ్ళీ పెట్టుబడి రూపంలోనో, ఖర్చు రూపంలోనో మార్కెట్ లోకి మరోసారి పంపిస్తారు. ఆ విధంగా శ్రామిక ప్రజలకు నేరుగా అందేలా ప్రభుత్వం ఖర్చు చేస్తే అది రెండు, మూడింతలు మార్కెట్ లో వినిమయం జరగడానికి, అంటే డిమాండ్ పెరగడానికి దోహదపడుతుంది. అదే మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తే అప్పుడు ఆ ఖర్చులో ఎక్కువ భాగం దిగుమతుల కోసం గాని, ప్రాజెక్టులు చేపట్టిన కార్పొరేట్ల దగ్గర మిగులు రూపంలో గాని ఉండిపోతుంది. మార్కెట్ లోకి ఎక్కువ భాగం రావడం అనేది ఉండదు. అందువలన మార్కెట్ లో డిమాండ్ పెరగడానికి అంతగా దోహదపడదు.

కరోనా తర్వాత మన ప్రభుత్వం తన వద్ద నిల్వ ఉన్న ఆహార ధాన్యాలలో కొంత భాగాన్ని పేద కుటుంబాలకు అందిస్తోంది. అందుచేత శ్రామిక ప్రజానీకానికి నేరుగా అందేలా ప్రభుత్వ వ్యయం ఉంటే, ఆ సొమ్ము ఆహార దినుసుల కొనుగోలు కన్నా ఇతర వినిమయ సరుకుల కొనుగోలు కోసం ఎక్కువగా ఖర్చు అవుతుంది. అప్పుడు ఆ సరుకులను మళ్ళీ ఉత్పత్తి చేయవలసిన అవసరం ఏర్పడుతుంది. ఆ విధంగా డిమాండ్ పెరిగి ఆరిక్థ వ్యవస్థ మళ్ళీ వేగం పుంజుకునే వీలుంటుంది. పైగా అదనపు ఉపాధికల్పన కూడా జరుగుతుంది. ఈ విధంగా ప్రస్తుతం ఆర్థిక భారాలతో నలిగిపోతున్న శ్రామిక ప్రజానీకానికి ఊరట లభించడంతోబాటు ఆర్థిక వ్యవస్థవేగం కూడా పెరిగేందుకు వీలు ఉన్నప్పుడు ప్రభుత్వం ఆ విధంగా ఎందుకు చేయడం లేదు ? తన ఆశ్రయంలో ఉన్న కార్పొరేట్ల సేవ తప్ప తక్కినదేదీ పట్టని మోడీ ప్రభుత్వానికి శ్రామిక ప్రజలను పట్టించుకునే తీరిక ఎంతమాత్రమూ లేదు.

(స్వేచ్ఛానుసరణ)

ఒకవేళ ప్రభుత్వం నేరుగా శ్రామిక ప్రజానీకానికి అందే విధంగా ఖర్చు చేసిందనుకుందాం. అప్పుడు ఆ సొమ్ము మొత్తం శ్రామిక ప్రజానీకం తిరిగి ఖర్చు చేసేస్తారు. వాళ్ళు సరుకులను, సేవలను పొందడానికి ప్రధానంగా ఖర్చు చేస్తారు. ఆ సరుకుల ఉత్పత్తి ప్రధానంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో జరుగుతుంది. ఆ పరిశ్రమలకు మిగిలే లాభాలు చాలా తక్కువగా ఉంటాయి. అంతేగాక, ఆ చిన్న పరిశ్రమల యజమానులు తమ వద్దకు వచ్చిన సొమ్మును మళ్ళీ పెట్టుబడి రూపంలోనో, ఖర్చు రూపంలోనో మార్కెట్ లోకి మరోసారి పంపిస్తారు. ఆ విధంగా శ్రామిక ప్రజలకు నేరుగా అందేలా ప్రభుత్వం ఖర్చు చేస్తే అది రెండు, మూడింతలు మార్కెట్ లో వినిమయం జరగడానికి, అంటే డిమాండ్ పెరగడానికి దోహదపడుతుంది.

విమర్శ

చరిత్ర వక్రీకరణ ఎందుకోసం...?

డా॥ సి.ఎన్. క్షేత్రపాల్ రెడ్డి

మానవ చరిత్రను ఒక జాతి చరిత్రగా చూడడానికి వీల్లేదు. ఏ దేశంలోనైనా ప్రత్యేకంగా ఒక జాతి జన్మించదు. రూపొందుతుంది. భారతదేశం ఇందుకు మినహాయింపు కాదు. అయితే నేడు దేశంలో హిందూ జాతి ఉన్నతమైనదని, అది దైవ నిర్మితమనే భావనల్ని కొన్ని మతతత్వ శక్తులు తమ ఊహలతో కూడిన వ్యాఖ్యానాలతో నిర్ధారించాలని చూస్తున్నాయి. ఈ జాతి ఆధారంగా మతపరమైన జాతీయవాదాన్ని ముందుకు తెచ్చి మతాన్ని, జాతిని సమానార్థకాలుగా చేసి తమ రాజకీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఇందుకోసం 1960 నుంచే రాజకీయంగా ప్రయత్నాలు మొదలు పెట్టాయి. ఎన్‌డిఎ తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడే సంఘ్ పరివార్ శక్తులు తమ అభూత కల్పనలతో కూడిన మతతత్వ చరిత్రను దేశ చరిత్రగా మార్చేందుకు విద్యా వ్యవస్థను వినియోగించుకోవాలని తీవ్రంగా ప్రయత్నాలు చేశాయి. ఈ కుట్రను పసిగట్టిన ప్రజాస్వామిక శక్తులు, చరిత్రకారులు, పౌరసమాజం ఏకమై గొంతు సవరించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో నాటి ప్రభుత్వం మూకుమ్మడిగా చరిత్ర వక్రీకరణ చర్యల్ని నిలిపివేసింది. నాలుగు దశాబ్దాలుగా తాము అనుకున్నది ఒకేసారి జరగలేదనే అసహనం, తమ రాజకీయ ముసుగు అయిన బిజెపి పూర్తి స్థాయిలో అధికారంలోకి రావడంతో 2014 నుంచి విద్యావ్యవస్థను కేంద్రంగా చేసుకుని దేశ చరిత్రను మతపరమైన చరిత్రగా మార్చేందుకు మరోసారి కుట్రలకు పాల్పడుతున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అందరి నోళ్లు మూయించి తాము అనుకున్న పని చేసుకుపోవాలని తలస్తున్నాయి. చరిత్రను మార్చడం ద్వారా తమ హిందుత్వ పునాదుల్ని బలోపేతం చేసుకోవాలన్న తలంపే ఇందుకు కారణం. దేశ చరిత్రలో మతోన్మాద శక్తులకు స్థానం లేదు. ఇప్పటి వరకూ ఉన్న చరిత్ర వారి మతతత్వ వ్యాప్తికి అనుకూలం కాదు. కాబట్టే చరిత్రను మార్చడం ద్వారా రానున్న భవిష్యత్తు తరాన్ని మతమౌఢ్యంలోనే పుట్టి పెరిగేలా చేయడం వారి ప్రధాన ఆశయం. ఇందుకోసమే సంఘ్ పరివార్ శక్తులు దేశ చరిత్రను తమకు అనుకూలంగా తిరగరాయాలనుకుంటున్నారు. చరిత్రను కాషాయ రంగులోకి మార్చడమే తమ అధికారానికి పరమావధిగా ఎంచుకున్నారు.

హిందూ రాష్ట్ర అనే భావనను ప్రతిపాదించిన మహారాష్ట్రకు చెందిన భిడే గురూజీ చేసిన ప్రసంగం సంఘ్ శక్తులకు ఒక ప్రేరణ. దేశ చరిత్రను ఆయన మూడు భాగాలుగా చూపించారు. ఇందులో ముస్లిం యుగం, బ్రిటీష్ యుగం, స్వాతంత్ర్యానంతరం అనే విభజన చూపించి ఈ యుగాలకు ముందు భారత దేశంలో అత్యున్నతమైన హిందూ రాజ్యం ఉండేదని, ఈ మూడు యుగాలు దాన్ని సర్వనాశనం చేశాయని పేర్కొన్నారు. ఇవి హిందూ సంస్కృతిపై తీవ్రమైన దాడి చేసి అప్పటికే విరాజిల్లుతున్న పురాతన హిందూ సంస్కృతిని తుడిచిపెట్టాయని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే పురాతన హిందూ సంస్కృతిని పునరుద్ధరించడం హిందుత్వ లక్ష్యం కావాలని కోరుకున్నారు. ఈ ఊహాజనితమైన వ్యాఖ్యలను ఆధారంగా చేసుకుని సంఘ్ పరివార్‌కు చెందిన రచయితలు తమ మెదళ్లకు పని పెట్టారు. తమ ఆశయ సాధన కోసం నిత్యం ఊహలతో కూడిన అంశాలతో చరిత్రలోని ఘట్టాలను వక్రీకరించి రూపొందించిన చరిత్రను వివిధ రూపాల్లో జనంలోకి జొప్పించినా అది నిజమైన చరిత్ర అనిపించుకోలేకపోయింది. వారు రూపొందిస్తున్న చరిత్రకు ఆధారాలు లేకపోవడమే ఇందుకు కారణం.

చరిత్రకు కొన్ని స్పష్టమైన ఆధారాలు ఉండాలి. ఆధార రహితమైంది, ఊహాజనితమైంది చరిత్ర కాజాలదు. కాబట్టే పాఠ్యపుస్తకాల్లోకి తమ వక్రీకరణలతో కూడిన అంశాలను జొప్పించడం ద్వారా దాన్ని స్థిరపరచాలని విద్యావ్యవస్థను ఎంపిక చేసుకున్నారు. పాలకుల అండతో ఉన్నత విద్యా వ్యవస్థ లోని యుజిసి, ఎన్‌సిఇఆర్‌టి వంటి సంస్థల ఆలంబనగా తమ పనిని మొదలు పెట్టాయి. తమకు కంటగింపుగా ఉన్న చరిత్రను, తమ నిజస్వరూపాన్ని బహిర్గతం చేస్తున్న అంశాలను ఎంపిక చేసి వాటి స్థానంలో తమ అనుకూల విధానాలతో కూడిన వ్యక్తుల చరిత్రను చొప్పిస్తున్నాయి. ఇందులో బాగంగానే బిజెపి అధికారంలో ఉన్న కర్ణాటక పాఠ్యపుస్తకాల్లో ఏకంగా స్వాతంత్ర్య సమర యోధుడైన భగత్‌సింగ్ పాఠ్యాంశాన్ని తొలగించి హిందుత్వ సావర్కర్ చరిత్రను చొప్పించారు. ఇటువంటి ఘటనల్ని ఈ ఎనిమిదేళ్ల బిజెపి పాలనలో అనేకం చూడవచ్చు.

తాజాగా హేతుబద్ధీకరణ పేరుతో చరిత్ర పుస్తకాల్లో మొఘల్ సామ్రాజ్యం గురించి ఉన్న అన్ని అధ్యాయాలను తొలగించడానికి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) కసరత్తు చేసింది. మరో అడుగు ముందుకేసి గాంధీ హత్య, ఆ హత్యకు కారణమైన గాడ్సేకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)తో ఉన్న సంబంధాన్ని, హత్యానంతరం ఆ సంఘంపై నాటి ప్రభుత్వం విధించిన నిషేధాన్ని తెలిపే అంశాలను చరిత్ర పుస్తకాల నుంచి మాయం చేసేందుకు కసరత్తు జరుగుతోంది. అసలు గాంధీ హత్యోదంతాన్నే చరిత్ర నుంచి పూర్తిగా చెరిపేయాలనేది వారి ఆశ. ఇందుకు ఒక ప్రయత్నం జరిగింది. బిజెపి పాలిత ఒక రాష్ట్రంలో చరిత్రకు సంబంధించి గాంధీ ఆత్మహత్య చేసుకున్నాడనే భావన వచ్చేలా ప్రశ్నాపత్రం రూపొందిన విషయం తెలిసిందే.

చరిత్రను ఒక జ్ఞాన శాస్త్రంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) అభివర్ణించింది. గతంలో ఎన్నడూ లేని పద్ధతుల్లో ఐడియా ఆఫ్ భారత్ పేరుతో కొత్త సిలబస్‌ను తయారు చేసింది. ఇందులో భారతీయ శౌర్యం అనే ప్రత్యేక చాప్టర్ ద్వారా ఏం చెప్పబోతున్నారో హిందుత్వ ఎజెండా తెలిసిన వారికి సులభంగా అర్థమవుతుంది. తాజాగా డిగ్రీ చరిత్ర పాఠ్యపుస్తకాల్లో ఆర్యుల చరిత్రకు అత్యధిక ప్రాధాన్యత లభిస్తోంది. అదే సమయంలో ద్రావిడుల చరిత్రను తక్కువ చేసింది. బౌద్ధం పట్ల తీవ్రమైన వ్యతిరేకత కారణంగానే అప్రాధాన్యతాంశంగా మారింది. కేవలం ముస్లింల పట్ల ద్వేషం మరింత బలం పుంజుకునేందుకు అవకాశం ఉన్న చరిత్రను ఉంచేసి మితగా అంశాలను తొలగించింది. ఉదాహరణకు మత సహనం ప్రదర్శించిన అక్బర్‌ను చరిత్ర లోంచి తోసేసి, ఆ స్థానంలో రాణా ప్రతాప్‌కు పెద్ద పీట వేశారు. వాస్తవానికి తన చేతిలో ఓటమి పాలై కన్నుమూసిన రాణా ప్రతాప్‌ను గురించి అక్బర్ సమ ఉజ్జీ అయిన వీరుడు మరణించాడు, నేను ఇక ఎవరితో యుద్ధం చేయాలని కన్నీరు కార్చాడనేది చరిత్ర. ఇవన్నీ కనిపించకుండా అక్బర్, షాజహాన్ వంటి వారి చరిత్రకు పాఠ్యపుస్తకాల్లో రిక్త హస్తం చూపించేస్తున్నారు.

సంఘ్ చరిత్ర, వారి కార్యశాలల్లో జరిగే కార్యక్రమాలు, మతపరమైన చరిత్రను బోధించే సమయంలో ఔరంగజేబును వర్ణించే తీరు తెలిసివారు లోగుట్టును సులభంగానే పసిగట్టవచ్చు. దేశ చరిత్ర పరిణామక్రమంలో మత చిహ్నాల విధ్వంసం, ఆలయాలు-విగ్రహాల ధ్వంసం అనేవి ముస్లింల పాలనా కాలంలోనే జరిగాయనడం సంఘ్ శక్తులు చేస్తున్న ప్రచారానికి బలం చేకూర్చేందుకే.

నూతన విద్యావిధానం పేరుతో విద్యా సంస్థలన్నిటినీ మతతత్వ వాదులతో నింపేస్తున్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రకు దక్కవలసినంత ప్రాధాన్యత లభించడం లేదు. కారణం సంఘ్ శక్తులు...స్వాతంత్ర్యోద్యమానికి వ్యతిరేకంగానే పని చేశారు. జాతీయ స్వాతంత్ర్య ఉద్యమం అంతా ఒక డ్రామా అని, అనంతర కాలంలో అంబేద్కర్ అందించిన రాజ్యాంగం బూటకమనే తమ భావనను చరిత్రగా చూపించాలని తపిస్తున్నారు. ఇదంతా సంఘ్ పరివార్ ఎజెండాను సమర్థించేందుకే. సంఘ్ వక్రీకరణలతో, ఊహలతో కలగలిపిన ఈ చరిత్ర అధికారికంగా పుస్తకాల్లో చేరినట్లయితే భవిష్యత్తు తరాన్ని మతమౌఢ్యంలోకి నెడుతుంది. ఈ వక్రీకరణలకు గురైన అంశాలు రానున్న రోజుల్లో ఆధునిక చరిత్రగా మారితే జరగబోయే నష్టం పూడ్చుకోలేనిదవుతుంది. ప్రజల మతపరమైన మనోభావాలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్న శక్తుల నిజస్వరూపాన్ని బహిరంగంగా చర్చకు పెట్టడం ద్వారానే వారి కుట్రలను సమర్థవంతంగా ఎదుర్కోగలం.

(వ్యాసకర్త సెల్ : 9059837847)

ఇప్పటి వరకూ ఉన్న చరిత్ర వారి మతతత్వ వ్యాప్తికి అనుకూలం కాదు. కాబట్టే చరిత్రను మార్చడం ద్వారా రానున్న భవిష్యత్తు తరాన్ని మతమౌఢ్యంలోనే పుట్టి పెరిగేలా చేయడం వారి ప్రధాన ఆశయం. ఇందుకోసమే సంఘ్ పరివార్ శక్తులు దేశ చరిత్రను తమకు అనుకూలంగా తిరగరాయాలనుకుంటున్నారు. చరిత్రను కాషాయ రంగులోకి మార్చడమే తమ అధికారానికి పరమావధిగా ఎంచుకున్నారు.

కవిత్వం

పుల్వామా రంగు

ఏంటో, మరీ ఆ బేషరమ్?
ఊహకందని క్రూరత్వంతో
సాధుత్వపు ముసుగులో
దానవత్వపు వికటాట్టహాసం
ఇంకెంత ఉన్మాదం
ఆ అధికారం ఆవల దాగి ఉందో?
నలభై మంది దేశభక్తులను హత్య చేసి
పర దేశానికి భక్తిగా ప్రకటించింది
అందలమెక్కిన అహంలో
విషకరకుతనంతో విషాద ఛాయలు
ప్రభుత్వ పడకగదిలో
పట్టు పరుపు వేసుకుని
ఉరవడి పవళిస్తూ
లొట్టలేస్తున్న వేళ
పుల్వామాలో పారిన రక్తం
నేడు జలపాతమై
స్మృతిగీతి పాడుతూ ఉరికింది
పహారా పని మరిచి పరాయి
పటాసుల పక్కా పథకానికి పళ్లికిలిస్తూ
కాపాడాల్సిన కన్నే గన్నై
ప్రాణం కోసం విమానం అడిగితే
కనీస ప్రమాణాలు మరిచింది
పాడె మీద పేలాలేరుకునే
పాలకుల జమానాలో
మన రాజీవనమే జుర్మానా
కానీండి, ఎప్పటికీ మాయని గాయంతో
ఘాతుకానికి పట్టాభిషేకం
దొడ్డి దారిలో అసత్య నిచ్చెనలెక్కండి
సత్యాన్ని కాండ్రించి ఉమ్మడానికి
కాల నాగులు పొంచి ఉన్నాయి
దేశాన్ని మట్టుబెట్టే దారులసాక్షిగా
నా మత జవాన్ల చితిలో
పేలిన తూటాలు యావత్ దేశం
సంచరిస్తూ పరిహారాన్ని ప్రశ్నిస్తున్నాయి
వడ్డీతో వసూల్‌కై సవాల్ చేస్తున్నాయి.

- డా॥ మాటూరి శ్రీనివాస్
సెల్ : 9849000037

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ

BHARATMALA ROAD TO PROSPERITY

కాంపిటెంట్ అథారిటీ, భూ సేకరణ ఎన్‌హెచ్-516 ఎఫ్ మరియు సంయుక్త కలెక్టర్, కాకినాడ వారి కార్యాలయం

రిఫ్.ఎల్6/118/2018 జాతీయ రహదారుల చట్టం, 1956 లోని సెక్షన్ 3జి (3) క్రింద తేదీ. 19.04.2023

బహిరంగ ప్రకటన

జాతీయ రహదారుల చట్టం 1956 లోని సెక్షన్ 3జి(3) క్రింద ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లో కాకినాడ జిల్లాలో కి.మీ. 0.000 -కి.మీ 40.621 వరకు జాతీయ రహదారి నెం. 16 నుండి కాకినాడ ఓడరేవును కలుపుటలో భాగం గా జాతీయ రహదారి నెం.516F లోని వాకలపూడి జంక్షన్ నుండి అన్నవరం బై పాస్ వరకు రహదారి నిర్మాణం (నాలుగు-లేనింగ్) నిర్వహణ, మేనేజ్మెంట్ మరియు ఆపరేషన్ కోసం.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లో కాకినాడ జిల్లాలో కి.మీ. 0.000 -కి.మీ 40.621 వరకు జాతీయ రహదారి నెం.16 నుండి కాకినాడ ఓడరేవును కలుపుటలో భాగంగా జాతీయ రహదారి నెం.516F లోని వాకలపూడి జంక్షన్ నుండి అన్నవరం బై పాస్ వరకు రహదారి నిర్మాణం (నాలుగు-లేనింగ్) నిర్వహణ, మేనేజ్మెంట్ మరియు ఆపరేషన్ కోసం భారత విశేష రాజపత్రం సంచిక నెం. 1664 (ఇ) పార్ట్ II, సెక్షన్ -3, ఉప సెక్షన్ -ii), తేదీ: 6 ఏప్రిల్ 2023 ప్రచురించబడిన, No.1585 తేదీ 06.04.2023 భారత ప్రభుత్వం, రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ప్రకటన ప్రకారం జాతీయ రహదారుల చట్టం 1956 (48/1956) లోని సెక్షన్ 3డి (2) క్రింది తాకట్టు రుణభారాలు ఏవి లేకుండా దిగువ షెడ్యూలు లో తెలిపిన భూములు, కట్టడాలు మరియు చెట్లు మొదలగు వాటితో కేంద్ర ప్రభుత్వానికి సంక్రమించాయి. సదరు భూములలో ప్రయోజనం గల వ్యక్తులందరూ తమ భూములకు చెందిన డాక్యుమెంట్లు/పట్టాదారు పాసుపుస్తకాలు /టైటిల్ డీడ్స్ లేదా ఏవేనీ ఇతర సంబంధిత డాక్యుమెంట్లు యొక్క అసలు డాక్యుమెంట్లు మరియు జిరాక్స్ కాపీలతో వారికి ఏవేనీ కట్టడాలు ఉంటే ఆమోదిత ప్లాన్లు, పన్ను అసెస్మెంట్స్, పన్ను రసీదులతో స్వయంగా లేదా ఏజంట్లు ద్వారా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా సమర్ధ ప్రాధికారి (ఎన్.హెచ్. భూసేకరణ) మరియు జాయింట్ కలెక్టర్, కాకినాడ జిల్లా వారి సమక్షంలో దిగువ తెలిపిన విధముగా ప్రతి గ్రామానికి ఎదురుగా తెలిపిన తేదీలలో ఈ క్రింది తెలిపిన కార్యాలయాలలో హాజరు కావాల్సిందిగా మరియు సదరు భుమిలలో వారి సంబంధిత ప్రయోజనం మరియు హక్కుల స్వభావాన్ని తెలియజేయవలసిందిగా కోరబడుతున్నారు.

జిల్లా : కాకినాడ **రాష్ట్రం : ఆంధ్రప్రదేశ్**

వ.నెం	మండలం పేరు	గ్రామము పేరు	విచారణ కార్యాలయము పేరు	తేదీ మరియు సమయము
1	2	3	4	5
1	కాకినాడ రూరల్	నేమం	తహశీల్దార్ వారి కార్యాలయం, కాకినాడ రూరల్ మండలం	03.05.2023 ఉదయం 9.30 గం. లకు
2	శంఖవరం	అన్నవరం	గ్రామ సచివాలయం అన్నవరం- 1	03.05.2023 ఉదయం 9.00 గం. లకు
3		ఆరెంపూడి	గ్రామ సచివాలయం అన్నవరం- 1	03.05.2023 ఉదయం.9.00 గం. లకు
4	తొండంగి	A. కొత్తపల్లి	తహశీల్దార్ వారి కార్యాలయం, తొండంగి	03.05.2023 ఉదయం.9.00 గం లకు
5		బెండపూడి	తహశీల్దార్ వారి కార్యాలయం, తొండంగి మండలం	03.05.2023 ఉదయం 9.00
6		P.E.చిన్నయ్యపాలెం	తహశీల్దార్ వారి కార్యాలయం, తొండంగి మండలం	03.05.2023 ఉదయం 9.00 గం. లకు
7		శృంగవృక్షం	తహశీల్దార్ వారి కార్యాలయం, తొండంగి మండలం	03.05.2023 ఉదయం 9.00 గం. లకు
8		తొండంగి	తహశీల్దార్ వారి కార్యాలయం, తొండంగి మండలం	03.05.2023 ఉదయం 9.00 గం. లకు
9	U. కొత్తపల్లి	కుతుకుడుమిల్లి	తహశీల్దార్ వారి కార్యాలయం, U. కొత్తపల్లి మండలం	03.05.2023 ఉదయం 9.00 గం. లకు

షెడ్యూలు

జిల్లా : కాకినాడ **మండలం : కాకినాడ రూరల్** **గ్రామం : నేమం**

క్ర. సం.	సర్వే నెం.	భూమి యొక్క రకం	భూమి యొక్క స్వభావం	విస్తీర్ణం హెక్టార్లలో	విస్తీర్ణం ఎకరాలలో	ప్రయోజనము గల వ్యక్తి పేరు	నిర్మాణాలు మరియు చెట్లు మొదలైన వాటి వివరాలు
1	11/7బి	ప్రైవేట్	నంజ	0.0097125	0.024	గుమ్మళ్ళ శ్రీనివాస్ తండ్రి సుబ్బారావు 11/7బి	–
2	11/7బి	ప్రైవేట్	నంజ	0.0671778	0.166	గొల్లపల్లి రాంబాబు తండ్రి పాపారావు 11/7బి	–
3	139/1	ప్రైవేట్	నంజ	0.006962	0.017	పోసిన రామకృష్ణ తండ్రి సత్యనారాయణ 139/1	–
4	207/2	ప్రభుత్వ భూమి	నంజ	0.00416	0.010	NPI (ఖాళీ స్థలం) 207/2	–
5	219/1బి	ప్రైవేట్	నంజ	0.021363	0.053	మంచం వెంకట రాయుడు తండ్రి ధర్మ గణపతి రావు 219/1బి	–
6	220/1	ప్రైవేట్	పుంజ	0.0000626	0.0002	వంశీధార పాలిమర్స్ లిమిటెడ్ 220/1	–
7	220/2బి	ప్రైవేట్	పుంజ	0.003715	0.009	వంశీధార పాలిమర్స్ లిమిటెడ్ 220/2బి	–
8	221/3బి	ప్రైవేట్	పుంజ	0.157828	0.390	వంశీధార పాలిమర్స్ లిమిటెడ్ 221/3బి	–
9	246/6	ప్రభుత్వ భూమి	పుంజ	0.03405	0.084	NPI (ఖాళీ స్థలం) 246/6	–
10	246/7	ప్రభుత్వ భూమి	పుంజ	0.004047	0.010	NPI (ఖాళీ స్థలం) 246/7	–
11	246/8	ప్రభుత్వ భూమి	పుంజ	0.012141	0.030	NPI (ఖాళీ స్థలం)246/8	–
12	249/12	ప్రభుత్వ భూమి	నంజ	0.035319	0.087	NPI (ఖాళీ స్థలం) 249/12	–
13	289/2	ప్రభుత్వ భూమి	నంజ	0.015784	0.039	NPI (ఖాళీ స్థలం) 289/2	–
14	289/3	ప్రభుత్వ భూమి	నంజ	0.033865	0.084	NPI (ఖాళీ స్థలం) 289/3	–
15	296/ 1సి/2	ప్రభుత్వ భూమి	నంజ	0.032343	0.080	NPI (ఖాళీ స్థలం) 296/1సి/2	–
16	84/2ఎ	ప్రైవేట్	నంజ	0.017134	0.042	నందిపాటి సూర్యచక్ర భర్త చక్ర రావు 84/2ఎ	–
17	91/2బి	ప్రైవేట్	నంజ	0.040469	0.100	అంగజాల సుజాత భర్త వేణుగోపాల్ 91/2బి	–
18	91/4బి	ప్రైవేట్	నంజ	0.012137	0.030	దాది శివనారాయణ (లేట్) తండ్రి ముల్లయ్య 91/4బి	–
	మొత్తం			**0.5082699**	**1.256**		

మండలం : శంఖవరం **గ్రామం : అన్నవరం**

1	114/2	ప్రైవేట్	నంజ	0.0485623	0.12	కశిరెడ్డి అప్పారావు తండ్రి రాములు 114/2	వరి
2	114/3	ప్రైవేట్	నంజ	0.3751436	0.927	కశిరెడ్డి సత్తిబాబు తండ్రి రాంబాబు, చిటికిరెడ్డి సత్తిబాబు తండ్రి కన్నయ్య, లింగంపల్లి చిన్నయ్య దొర & లింగంపల్లి శివ శంకర్ తండ్రి సూర్యుడు 114/3	వరి
3	115	ప్రైవేట్	నంజ	0.0012545	0.003	శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారు 115/2	వరి
4	116-1ఎ	ప్రైవేట్	పుంజ	0.1214056	0.30	పొన్నాడ సుబ్రహ్మణ్యం తండ్రి మంగన్న 116-1ఎ	వరి
5	116-1బి	ప్రైవేట్	పుంజ	0.0323748	0.080	గంట లోవరాజు & గంట శ్రీనివాస్ తండ్రి పెరుమాళ్ళయ్య 116-1బి	వరి
6	116-1సి	ప్రైవేట్	పుంజ	0.0962342	0.238	పొన్నాడ సత్తిబాబు తండ్రి మంగన్న 116-1సి	వరి
7	117-1ఎ	ప్రైవేట్	పుంజ	0.0040468	0.010	సిరికి గౌరీష్ తండ్రి సోమన్న 117-1ఎ	వరి
8	126-ఎ2	ప్రైవేట్	పుంజ	0.1011714	0.250	కామిరెడ్డి సుబ్బారావు తండ్రి సూర్యనారాయణ 126-ఎ2బి	వరి
9	126/బి2	ప్రైవేట్	పుంజ	0.3725536	0.921	కామిరెడ్డి చక్రం భర్త రామారావు, ముత్యం శ్రీరామ శేఖర్ తండ్రి సత్యనారా-యణ, కామిరెడ్డి సత్తిబాబు తండ్రి సూర్యనారాయణ, కామిరెడ్డి పద్మారావు తండ్రి సూర్యనారాయణ, వెలుగుల చక్రం తండ్రి చంద్రయ్య 126/బి2బి, బి2సి, బి2డి, బి2ఇ, బి2ఎఫ్	వరి
10	91/1ఎ	ప్రైవేట్	నంజ	0.2720702	0.672	బండారు వీర వెంకట అంజని రాజ్య లక్ష్మి భర్త ముత్యాలరావు 91/1ఎ	వరి
11	91/1సి	ప్రైవేట్	నంజ	0.1659211	0.410	బండారు వీర వెంకట అంజని రాజ్య లక్ష్మి భర్త ముత్యాలరావు 91/1సి	వరి
12	91/2ఎ2	ప్రైవేట్	నంజ	0.0829605	0.205	బండారు వీర వెంకట అంజని రాజ్య లక్ష్మి భర్త ముత్యాలరావు 91/2ఎ2	వరి
13	92/2	ప్రైవేట్	నంజ	0.0010117	0.002	సిరిపురపు ముసలి అనే బాపన్న 92/2ఎఫ్	వరి
	మొత్తం			**1.6747103**	**4.1383**		

మండలం : శంఖవరం **గ్రామం : ఆరెంపూడి**

1	176	ప్రైవేట్	నంజ	0.591934	1.463	రాయవరపు వెంకట రమణ తండ్రి తాతారావు అనే నాగన్న, గొళ్ళు సూరమ్మ భర్త చిన సూర్యనారాయణ, బండారు నూకరాజు తల్లి అచ్చియ్యమ్మ (late), బండారు విష్ణు సాహితి 176-2,3,4,5	వరి
2	177-1	ప్రైవేట్	నంజ	1.3071346	3.23	బండారు కృష్ణ స్వామి తండ్రి ముత్యాలరావు, బండారు కృష్ణ చైతన్య తండ్రి సత్యనారాయణ, యాళ్ళ గణేశ్ తండ్రి తలుపులు, యాళ్ళ అప్పన్న తండ్రి తలుపులు, మెరపాల వెంకట సత్యవతి తండ్రి వెంకట రమణ, శిరపరపు బాపన్న తండ్రి మరిడియ్య, బండారు వెంకట అప్పారావు తండ్రి సూర్యనారాయణ, మాండలిక లక్ష్మి కామేశ్వర్ , మాండలిక విజయ శాంతి భర్త రాజు చిరపాల అప్పారావు తండ్రి మరిడియ్య, మెరపాల అప్పారావు తండ్రి తాతీలు, శిరపరపు పెంటయ్య తండ్రి బాపన్న, దాసరి సూర్యకాంతం, శిరపరపు బండారయ్య తండ్రి బాపన్న, శిరపరపు అచ్చారావు తండ్రి బాపన్న, కశిరెడ్డి సత్యవతి భర్త అప్పారావు 177-1ఎ2 నుండి 177- 1ఎ16	వరి
3	177/2	ప్రైవేట్	నంజ	0.075191	0.186	గండి లక్ష్మి భర్త బాబూరావు 177/2ఎ	వరి
4	178/1	ప్రైవేట్	నంజ	0.527103	1.302	మెరపాల బాబూరావు తండ్రి కన్నయ్య, రెడ్డి తులసి భర్త సుర్ల సందీప్, సుర్ల సందీప్ తండ్రి రామకృష్ణ, పైల రాజమ్మ భర్త మల్లయ్య గునూరు తాతబాబు తండ్రి అప్పలనాయుడు, రాయవరపు సత్యనారాయణ మూర్తి తండ్రి సింహాచలం, రాయవరపు జోగమ్మ భర్త అప్పారావు, బయలుపూడి లక్ష్మి భర్త తలుపులయ్య, శిరపరపు నాగభూషణం, మెరపాల అప్పన్న, మెరపాల త్రిమూర్తులు తండ్రి కన్నయ్య, మెరపాల బాబూరావు తండ్రి కన్నయ్య, కలిదిండి ఆశ భర్త కాళీ చందు, కోటని రాంబాబు తండ్రి సత్యనారాయణ, 178-1బి నుండి 178-1హెచ్	వరి
5	178/6	ప్రైవేట్	నంజ	0.153416	0.379	కలిదిండి కిషన్ తండ్రి భాస్కర నారాయణరాజు కలిదిండి ఆశ తండ్రి కాళీ చందు కనుమూరి సీత భర్త వెంకట రామరాజు దాసరి నాగమణి భర్త సత్యనారాయణ & దాసరి వేంకటేశ్వర రావు తండ్రి చిన సత్యనారాయణ కోటని రాంబాబు తండ్రి సత్యనారాయణ 178-6బి నుండి 6ఎఫ్	వరి
6	189/1	ప్రైవేట్	నంజ	0.874607	2.161	ఈమని వెంకట శ్రీనివాస్ తండ్రి సూర్యనారాయణ గూనూరు సత్యనారాయణ తండ్రి సింహాచలం గూనూరు శ్రీనివాస్ తండ్రి సింహాచలం కొల్లు గోవిందరాజులు తండ్రి నాగరాజు సంగాన వెంకట రమణ తండ్రి వెంకటచలం చిటికిరెడ్డి సత్తిబాబు & చిటికిరెడ్డి రాంబాబు తండ్రి కన్నయ్య 189/1బి నుండి 1హెచ్	వరి
7	189/3	ప్రైవేట్	నంజ	0.311325	0.769	గోడే నాగేశ్వర రావు & గోడే వెంకట లక్ష్మి చిటికిరెడ్డి సత్తిబాబు & చిటికిరెడ్డి రాంబాబు తండ్రి కన్నయ్య సంగాన నాలక్ష్మి భర్త నాగేశ్వర రావు, సంగాన శ్రీనివస రావు తండ్రి అచ్చారావు సంగాన వెంకటరమణ తండ్రి వెంకటాచలం 189/3బి నుండి 3ఎఫ్	వరి
	మొత్తం			**3.84071060**	**9.491**		

మండలం : తొండంగి **గ్రామం : A. కొత్తపల్లి**

1	284/1బి	ప్రైవేట్	పుంజ	0.0303514	0.075	కశిరెడ్డి అప్పాజీ తండ్రి అప్పారావు 284-1బి	–
(1) వేలంలో పాల్గొనదలచిన బిడ్డర్స్ ఆస్తి యొక్క రిజర్వు ధరలో పది శాతం (10%) ధరావతు (EMD) మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరున "డిమాండ్ డ్రాఫ్ట్ " రూపంలో విజయవాడ వద్ద చెల్లునట్లు 24.05.2023న మ.గం.2.30 వరకు లేదా ఆలోగా చెల్లించవలెను. (2) ఆసక్తి కల బిడ్డర్స్ ఆస్తి/ఆస్తులు గురించి తనిఖీ చేసుకోవలెను మరియు వారు సంతృప్తి చెందవలెను మరియు ఆస్తి తనిఖీ గురించి మరియు ఆస్తికి సంబంధించిన డాక్యుమెంట్లు పరిశీలన నిమిత్తం బ్రాంచి మేనేజర్లు (సాద రమణ – అధీకృత అధికారి కమ్ టెరటరి మేనేజర్, సెల్ నెం..9642221444, T. శ్యామ్ కుమార్-బ్రాంచి మేనేజర్, సెల్ నెం : 8464921084, వై. భాను ప్రకాష్-బ్రాంచి మేనేజర్, సెల్ నెం.6281621113, Ch. క్రాంతి, బ్రాంచి మేనేజర్, సెల్ నెం.7095212111, N. అనిల్, లీగల్ మేనేజర్, సెల్ నెం.9291632239,) ఉ.గం.10.00 నుండి సా.గం.4.00 మధ్య వారిని సంప్రదించవచ్చును. (3) గెలుపొందిన బిడ్డరు బిడ్ మొత్తములో ఇరవై అయిదు శాతం (25%) (EMD తగ్గించి) అదే రోజున వెంటనే లేదా మరుసటి పనిదినం మించకుండా ఎలా అయితే అలా తప్పక చెల్లించాలి. మరియు అతని పేరున అమ్మకం ఖాయం అయిన తర్వాత EMD ఇరవై అయిదు శాతం (25%) పైన సూచించినట్లుగా బిడ్ మొత్తమునకు వెంటనే సర్దుబాటు చేయబడుతుంది. పైన తెలిపినట్లుగా బిడ్ మొత్తములో ఇరవై అయిదు శాతం (25%) చెల్లించుటలో విఫలమైతే, EMD స్వాధీనపరచు కోబడుతుంది, మరియు ఆస్తి తిరిగి అమ్మకం చేయబడుతుంది. (4) గెలుపొందిన బిడ్డర్ బిడ్ మొత్తములో మిగిలిన మొత్తము డెభై అయిదు శాతం (75%) అమ్మకం జరిగిన 15 రోజులు లోగా లేదా అధీకృత అధికారి/ సెక్యూర్డ్ క్రెడిటర్ వారిచే వారి విచక్షణాధికారంతో లిఖిత పూర్వకంగా అంగీకరించినచో పొడిగించిన కాలం లోగా చెల్లించాలి. నిర్ణీత కాలపరిమితి లోగా డిపాజిట్ మొత్తము చెల్లించుటలో విఫలమైతే, డిఫాల్టర్ పర్చేజర్ యొక్క సబ్-రూలు (5) ప్రకారం డిపాజిట్ స్వాధీనం చేసుకోబడుతుంది, అతనికి/ఆమెకు విక్రయించిన ఆస్తి పైన లేదా అందలి ఏదైన భాగం పైన ఎలాటి క్లెయిమ్ ఉండదు. (5) SARFAESI చట్టం పరిధిలో పాల్గొనుటకు డిపాజిట్ చేసిన ఏ సొమ్ము మొత్తమునకు వడ్డీ చెల్లింపు ఉండదు. (6) అధీకృత అధికారి వారికి తెలిసినంత వరకు సదరు ఆస్తి పై ఎలాంటి ఎంక్రెంబ్రెంసెస్ లేవు. బ్యాంకు వారికి తెలియని ప్రస్తుత మరియు భవిష్యత్తు ఎంక్రెంబ్రెంసెస్ లతోటి ఆస్తి/హక్కులు విక్రయించబడతాయి. అందువలన తమ బిడ్ దాఖలు చేయుటకు ముందుగా ఆస్తికి సంబంధించి ఎంక్రెంబ్రెంసెస్/క్లెయిమ్స్/ హక్కు/బకాయిలు ఉన్నవేమో తెలుసుకొనుటకు స్వంత విచారణ చేసుకోవలసినదిగా పాల్గొనగోరు బిడ్డర్స్ నకు సూచించడమైనది. (7) అమ్మకపు ఆస్తి/ఆస్తులు నకు సంబంధించిన ఏదైన చార్జి, హక్కు ఎంక్రెంబ్రెంసెస్ ఆస్తి పన్ను లేదా ఏదైనా ఇతర బకాయిలు ప్రభుత్వం లేదా ఏదైన ఇతర సంస్థకు చెల్లించవలసిన వాటికి అధీకృతఅధికారి/సెక్యూర్డ్ క్రెడిటర్ బాధ్యత వహించరు. (8) గెలుపొందిన బిడ్డర్ చట్ట ప్రకారం వర్తించు రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటి వగైరా వంటి కన్వేయన్స్ లు భరించాలి. (9) ఎలాంటి కారణములు చూపకుండా అమ్మకం ను అంగీకరించుటకు/తిరస్కరించుటకు/వాయిదా వేయుటకు లేదా రద్దు చేయుటకు మరియు ఎలాంటి కారణములు చూపకుండా అమ్మకం నియమ నిబంధనలు మార్పు చేయుటకు అధీకృత అధికారి హక్కు కలిగి ఉన్నారు. (10) ఆస్తి/ఆస్తులు పైన నిర్ధారించిన రిజర్వు ధర కంటే తక్కువకు విక్రయించరు. (11) ఆస్తి/ఆస్తులు **"ఎక్కడ ఉన్నవి అక్కడ" "ఏమి ఉంటే అవి"** మరియు **"అక్కడ ఏమి ఉంటే అవి"** పద్ధతి పైన వేలం వేస్తారు. (12) పైన వివరించిన స్థిర ఆస్తి/ఆస్తులు అధీకృత అధికారి వారిచే భౌతికంగా స్వాధీన పరచుకున్నవి, వేలంలో కొనుగోలు చేసిన కొనుగోలుదారునికి ఆయనే అందచేస్తారు. (13) ఆసక్తి కల బిడ్డర్ వేలం లో పాల్గొను సమయం లో గుర్తింపునకు ఏదైన ఒక రుజువు అనగా ఆధార్ కార్డ్, పాస్ పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, రేషన్ కార్డ్, ఓటరు ఐ.డి కార్డ్, పాన్ కార్డ్ వగైరా కలిగి ఉండాలి. (14) నియమావళి ప్రకారం చెల్లింపు చేసిన కొనుగోలుదారు/విజయము పొందిన బిడ్డరు పేరున మాత్రమే సేల్ సర్టిఫికేట్ జారీచేయబడుతుంది మరియు మరే ఇతర పేరున జారీచేయబడదు. సేల్ సర్టిఫికేట్ నిర్వర్తించుటకు అవసరమైన అన్ని స్టాంపు డ్యూటి, రిజిస్ట్రేషన్ చార్జీలు మరియు అన్ని ఇతర సంబంధిత ఫీజులు, సుంకాలు పన్నులు వగైరా కొనుగోలుదారే భరించవలెను. (15) సెక్యూరిటైజేషన్ మరియు రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్ఫోర్స్ మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు -2002 పరిధిలోని నియమాలు/షరతులు/నిర్ధారించిన వాటికి లోబడి అమ్మకం ఉంటుంది. (16) గెలుపొందిన బిడ్డరు/కొనుగోలుదారు 1961 ఆదాయపన్ను చట్టం సెక్షన్ 19(1-ఎ) ప్రకారం అమ్మకం వసూలు పైన TDS 1% మినహాయించి & దానిని ఫారం- 26 QB చలాను ద్వారా చెల్లించాలి మరియు TDS యొక్క ఒరిజినల్ రశీదును MRHFL వారికి దాఖలు చేయాలి. (17) చట్టం యొక్క 13వ విభాగం ఉప విభాగం (8) పరిధిలో సెక్యూర్డ్ఆస్తులు విడిపించుకొనుటకు తగిన సమయం అందుబాటులో ఉంటుందని రుణగ్రహీతకు తెలియచేయటమైనది. (30 రోజుల నోటీసు) (18) అమ్మకం ప్రకటన వెబ్ సైట్ **www.mahindrahomefinance.com** నందు అప్ లోడ్/ప్రచురించుట చేయటమైనది. ఇతర వివరాలు కొరకు పైన తెలిపిన బ్రాంచి ఆఫీసు చిరునామా వద్ద టెరటరి మేనేజర్ / అధీకృత అధికారి మరియు బ్రాంచి మేనేజర్ వారిని సంప్రదించండి.

ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి
తేది: 25-04-2023 — మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులపై విచారణ జరపాలి

- సుప్రీంను ఆశ్రయించిన రెజ్లర్లు
- ఎన్‌సిడబ్ల్యు ఛైర్‌పర్సన్ రేఖా శర్మకు ఫిర్యాదు
- రాత్రంతా జంతర్ మంతర్‌లోనే నిరసన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఫిర్యాదులపై న్యాయమైన విచారణ జరిపించాలని కోరుతూ అగ్రశ్రేణి రెజ్లర్లు సోమవారం అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం రెజ్లర్ల తరపున న్యాయవాది సిజెఐ ముందు విచారణపై ప్రస్తావించనున్నారు. వినేష్ ఫోగట్‌తో సహా మొత్తం ఏడు మంది ఆటగాళ్లు పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన రెజ్లర్లు ఈ కేసులో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసే వరకు అక్కడే ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ హామీ ఇచ్చిన తరువాత అథ్లెట్లు జనవరిలో తమ నిరసనను విరమించుకున్నారు. డబ్ల్యుఎఫ్ఐ చీఫ్‌పై ఇంకా ఎటువంటి చర్య తీసుకోలేదని వారు పేర్కొన్నారు.

మాకు న్యాయం కావాలి

'మాకు న్యాయం కావాలి' అని రెజ్లర్లు స్పష్టం చేశారు. రెజ్లర్లు జంతర్ మంతర్‌లో కఠిక నేలపైనే రాత్రంతా ఉన్నారు. కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన మొదటి భారతీయ మహిళా రెజ్లర్ వినేష్ ఫోగట్ మాట్లాడుతూ.. 'పదేపదే ప్రయత్నించినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదు. 'మాకు న్యాయం జరిగే వరకు ఇక్కడే నిద్రపోతాం.. భోజనం చేస్తాం. మూడు నెలలుగా వారిని (క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్, ఇతర సంబంధిత అధికారాలను) సంప్రదించడానికి ప్రయత్నిస్తున్నాం. కమిటీ సభ్యులు స్పందించడం లేదు. క్రీడా మంత్రిత్వశాఖ కూడా ఏమీ అనలేదు. మా ఫోన్ కాల్స్ కూడా ఎత్తడం లేదు. మేము దేశం కోసం పతకాలు సాధించాం. దీనికోసం మా జీవితాన్ని ఫణంగా పెట్టాం' అని అన్నారు. 'మేము ఎవరినీ గుడ్డిగా నమ్మం. గతసారి మమ్మల్ని తప్పుదారి పట్టించారు. ఈసారి ఈ కేసులో రాజకీయాలు ఉండవని మేము ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. 'ఫిర్యాదు చేసి మూడు రోజులైనా వారు ఎఫ్ఐఆర్ ఎందుకు దాఖలు చేయడం లేదు?' అని ఒలింపిక్ విజేత సాక్షి మాలిక్ ప్రశ్నించారు. 'న్యాయం కోరేందుకు, సత్యాన్ని బయటకు తీసుకురావడానికి మేము ఇక్కడ ఉన్నాం' అని అన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసే వరకు ఇక్కడి నుంచి వెళ్లబోమని ఒలింపిక్ విజేత బజరంగ్ పునియా తెలిపారు. ఈసారి తాము ఎవరినీ తిరస్కరించబోమని, తమ నిరసనకు మద్దతు ఇవ్వదలచిన వారు వచ్చి తమతో చేరవచ్చని అన్నారు. 'బిజెపి, కాంగ్రెస్, ఆప్ మరే ఇతర పార్టీలైనా మా నిరసనలో చేరడానికి స్వాగతిస్తాం. మాకు ఏ పార్టీతో సంబంధం లేదు' అని అన్నారు. క్రీడా మంత్రిత్వశాఖ నియమించిన పర్యవేక్షణ కమిటీ ఇప్పటికే నివేదికను ఆ శాఖకు అందజేసింది. ఆ నివేదికను ఇవ్వాలని ఢిల్లీ పోలీసులు కోరారు. రెజ్లర్ల ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు విచారణ ప్రారంభించారు. ఎన్‌సిడబ్ల్యు ఛైర్‌పర్సన్ రేఖా శర్మకు రెజ్లర్లు ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారులతో మాట్లాడి కంప్లైంట్ కాపీ రాబట్టి ఎఫ్ఐఆర్ ఎందుకు దాఖలు చేయడం లేదో పరిశీలిస్తానని రేఖా శర్మ రెజ్లర్లకు హామీ ఇచ్చారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఆరోపణల నేపథ్యంలో మే 7న జరగాల్సిన డబ్ల్యుఎఫ్ఐ ఎన్నికలు వాయిదా పడ్డాయి.

బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న రెజ్లర్లుకు జన్‌వాదీ మహిళా సమితి తమ మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలో జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న రెజ్లర్లను సమితి ప్రతినిధి బృందం పరామర్శించింది. రెజ్లర్ల డిమాండ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని బృందం విజ్ఞప్తి చేసింది.

లోక్‌సభ ఎన్నికల వ్యూహ రచనకు కసరత్తు

మమత, నితీష్ భేటీ

కోల్‌కతా : బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సోమవారం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో భేటీ అయ్యారు. ప్రతిపక్ష పార్టీల సంకీర్ణ కూటమిని రూపొందించేందుకు వీరు కసరత్తు చేస్తున్నారు. 2024లో లోక్‌సభ ఎన్నికల కోసం కలిసి సన్నద్ధమవాల్సిన అవసరాన్ని ఇరువురు నేతలు నొక్కి చెప్పారు. ఈ సమావేశానికి బీహార్ డిప్యూటీ ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ కూడా హాజరయ్యారు. "చాలా సానుకూల చర్చలు జరిగాయి. ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి కూర్చుని వ్యూహ రచన చేయాల్సివుంది." అని నితీష్ కుమార్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర సచివాలయం నబన్నాలో ఈ సమావేశం జరిగింది. "మేమందరం కలిసే వున్నామని సందేశం ఇవ్వాల్సి వుంది." అని మమతా సమావేశం నుండి బయటకు వస్తూ వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు పనిచేయగల సంకీర్ణం రూపకల్పన కోసం ఎలా ముందుకు సాగాలన్నది ఆ సమావేశంలో చర్చించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు దేశ అభివృద్ధి కోసం జరిగిందేమీ లేదు. పాలించినవారు వారి సొంత ప్రచారం పట్లే ఆసక్తి చూపారని నితీష్ కుమార్ వ్యాఖ్యానించారు.

లఖింపూర్ ఖేరి కేసులో విచారణను నిశితంగా పరిశీలిస్తాం : సుప్రీం

న్యూఢిల్లీ : లఖింపూర్ ఖేరి హత్యల కేసులో ఇక్కడి సెషన్స్ కోర్టులో రోజువారీ విచారణ జరిపితే విచారణా న్యాయమూర్తి ముందున్న ఇతర పెండింగ్ కేసుల విచారణను ప్రభావితం చేయవచ్చని సుప్రీం కోర్టు సోమవారం వ్యాఖ్యానించింది. జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని బెంచ్ ముందు బాధితుల తరపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ హాజరై వాదనలు వినిపించారు. ఇప్పటివరకు ఈ కేసులో 200మందికి పైగా సాక్షులుంటే కేవలం ముగ్గురిని మాత్రమే విచారించారని తెలిపారు. పలుకుబడి గలిగిన వ్యక్తులు వున్న కేసుల్లో విచారణను ఇలాగే నిరవధికంగా కొనసాగడం తమకు అనుభవమేనని వ్యాఖ్యానించారు. ప్రతి వారంలో కనీసం ఇద్దరు సాక్షులను విచారణా కోర్టులో విచారించేలా ఆదేశించాలని ఆయన సుప్రీంకోర్టును కోరారు. దానిపై బెంచ్ స్పందిస్తూ, రోజువారీ విచారణ సాధ్యం కాదు, ఎందుకంటే దీనివల్ల న్యాయమూర్తి ముందున్న ఇతర కేసులు దెబ్బతింటాయని పేర్కొంది. ఈ కేసులో కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా నిందితుడిగా వున్నాడు.

సస్పెన్షన్లపై వెనకడుగు

(మొదటి పేజీ తరువాయి)

సమితి నాయకులు తెలిపారు. చర్చలకు ముందు సస్పెన్షన్లను నిరసిస్తూ వేలాది మంది ఉపాధ్యాయులు జిల్లా విద్యా శాఖ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిరసన తెలిపారు. 'ప్రవీణ్ ప్రకాష్ గో బ్యాక్', 'తప్పెవరిది-శిక్ష ఎవరికి' అంటూ నినాదాలు చేశారు. అంతకుముందు డిఆర్‌ఒకు నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రవీణ్ ప్రకాష్ ఉద్దేశ పూర్వకంగానే ఉపాధ్యాయులను, అధికారులను వేధిస్తున్నారన్నారు. అక్రమంగా సస్పెండ్ చేసిన అధికారులను, ఉపాధ్యాయులను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే రాష్ట్ర స్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు, ఎపిటిఎఫ్ నాయకులు ఎన్.బాలకృష్ణ, వి.రాధ, ధనుంజయరావు, ఎస్‌టియు నాయకులు శ్రీనివాసరావు, హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు సిహెచ్.శ్రీనివాసరావు, యు.గోవింద, పిఆర్‌టియు నాయకులు విజయ్, ఎస్‌ఎపిఎఫ్ నాయకులు ఎం.మధు, పిఇటి అసోసియేషన్ నాయకులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మోడీని గద్దె దించితేనే దేశానికి రక్ష

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ముందు మోకరిల్లుతున్నాయని, ప్రజావ్యతిరేక చట్టాలకు మద్దతు తెలుపుతున్నాయని విమర్శించారు. బిజెపిని మోస్తోన్న, సమర్థిస్తోన్న పార్టీలకు పెనుప్రమాదం తప్పదని హెచ్చరించారు. బిజెపి తొమ్మిదేళ్ల పాలనలో గతంలో ఎన్నడూ లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయన్నారు. రాష్ట్రానికి విభజన హామీలు, ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా బిజెపిని వైసిపి ఎందుకు సమర్థిస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. జాతీయ ప్రాజెక్టు పోలవరాన్ని, అక్కడి ప్రజలను ముంచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రాజధానులంటూ రాజధానిపై జగన్ కపట నాటకం ఆడుతున్నారని విమర్శించారు. గత టిడిపి ప్రభుత్వం సింగ్‌పూర్ అంటూ రాజధానిని భ్రమల్లో ముంచిందన్నారు. విశాఖ ఉక్కును అమ్మేస్తుంటే రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటినీ ఖూనీ చేస్తోందని విమర్శించారు. రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి ప్రతిపక్షపాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను తన చెప్పుచేతుల్లో ఉంచుకోవడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరుస్తోందని దుయ్యబట్టారు. దేశంలో పచ్చి మతోన్మాద, వినాశకర ప్రభుత్వం నడుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్ పాలన అధ్వానంగా ఉందన్నారు. గత నాలుగేళ్లలో రాష్ట్రానికి కొత్తగా ఎన్ని పరిశ్రమలు తెచ్చారో, ఎంతమందికి ఉద్యోగులు కల్పించారో చెప్పాలని ప్రశ్నించారు. లౌకిక పార్టీలన్నీ ఒకే వేదికపైకి వచ్చి బిజెపిని గద్దె దింపాలని, వామపక్షాలు ముందు పీఠిన ఉంటాయని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సిపిఎం, సిపిఐ గుంటూరు జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవినాష్ రెడ్డికి ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

చూపించడానికి ప్రయత్నిస్తున్నారని వాదించారు. 'సిబిఐ ప్రశ్నాపత్రం ట్రాన్స్క్రిప్ట్ ముందుగానే ఇవ్వలేదు. అవినాష్ రెడ్డి పారిపోవడం లేదు. వారు పదేపదే ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి వారు పునరావృతమైతే, ప్రశ్నల ట్రాన్స్‌స్కిప్ట్ ఇవ్వవచ్చని హైకోర్టు చెప్పింది' అని వాదనలు వినిపించారు. మరోవైపు ఈనెల 25 వరకు అరెస్టు చేయవద్దని అవినాష్ తరపు మరో సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ ధర్మాసనాన్ని కోరారు. మంగళవారం హైకోర్టులో కేసు విచారణ ఉన్నందున అప్పటి వరకు అరెస్టు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. అలాంటి ఆదేశాలు ఇవ్వలేమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ విజ్ఞప్తిని మన్నిస్తే ఉత్తర్వులు పరస్పరం విరుద్ధంగా ఉంటాయన్నారు. 'విచారణకు ఇదే ప్రమాణం అయితే, సిబిఐని గాలికొదిలేయడమే మేలు. ఎందుకంటే ఇప్పుడు అందరూ దీనిని ఉదాహరణగా పేర్కొంటారు. అప్పుడు సిబిఐ, ఇడి దర్యాప్తు చేస్తున్న అన్ని విషయాలలో, మీరు వేర్వేరు ప్రమాణాలను ఎందుకు ప్రయోగిస్తున్నారని అడుగుతారు. సిబిఐకి ప్రింటెడ్ రూపంలో ప్రశ్నలు అడగమని అడిగారు. అలాంటప్పుడు మనకు సిబిఐ ఎందుకు ఉంది? ముందుగా ముందస్తు బెయిల్, ఆపై ప్రశ్నావళి సిబిఐకి! ఇది క్రిమినల్ లా న్యాయశాస్త్రాన్ని తిరిగి రాయడం లాంటిది' అని అన్నారు.

వాదనలు ముగిసిన తరువాత ధర్మాసనం "దర్యాప్తును స్తంభింపజేసింది" కాబట్టి హైకోర్టు ఆదేశాలను పక్కన పెడుతూ తన ఉత్తర్వులను జారీ చేసింది. "హైకోర్టు ఆదేశాలు స్పష్టంగా అకాలమైనవి. సిబిఐ పేర్కొన్న వాటిని పరిగణనలోకి తీసుకుంటే, హైకోర్టు తనను తాను తప్పుగా అన్వయించుకుంది. అసాధారణమైన ఉత్తర్వును జారీ చేసిందని మేము భావిస్తున్నాము. ఈ తరహా ఆదేశాలు దర్యాప్తునకు హాని కలిగిస్తాయి. అక్కడ దర్యాప్తు చేయబడిన వ్యక్తికి రాతపూర్వకంగా లేదా ముద్రించిన రూపంలో ప్రశ్నలు ఉండాలనేది హైకోర్టుకు వారెంట్ కాదు. కోర్టు ఇచ్చిన అటువంటి ఆదేశాలు దర్యాప్తుకు తీవ్ర దురభిప్రాయాన్ని కలిగిస్తాయి" అని పేర్కొంది.

సిబిఐ విచారణకు గడువు పెంపు

ఏప్రిల్ 30 నాటికి విచారణ ముగించాలని సిబిఐకి గతంలో ఇచ్చిన గడువును జూన్ 30కు సుప్రీంకోర్టు పెంచింది. హైకోర్టు బెయిల్‌పై తేల్చేంత వరకు అరెస్ట్ చేయకుండా సిబిఐకి ఆదేశాలు ఇవ్వాలని అవినాష్ తరపున న్యాయవాది కోరగా.. ఈ విజ్ఞప్తిని సుప్రీం అంగీకరించలేదు. ముందస్తు బెయిల్ సంగతేంటో తెలంగాణ హైకోర్టులోనే తేల్చుకోవాలని స్పష్టం చేసింది.

పాట్నా హైకోర్టులో రాహుల్‌కు ఊరట

- స్టే ఉత్తర్వులు జారీ

పాట్నా : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి పాట్నా హైకోర్టులో ఊరట లభించింది. దిగువ కోర్టు సమన్లపై హైకోర్టు సోమవారం స్టే ఉత్తర్వులు జారీ చేసింది. మోడీ ఇంటిపేరుపై పరువుకు భంగం కలిగేలా వ్యాఖ్యలు చేశారంటూ రాజ్యసభ సభ్యుడు సుశీల్ కుమార్ మోడీ వేసిన కేసులో ఎంపి, ఎంఎల్ఎ కోర్టు సమన్లు జారీ చేసింది. రాహుల్ స్టేట్‌మెంట్‌ను నమోదు చేయడానికి మంగళవారం రావాల్సిందిగా దిగువ కోర్టు ఆదేశించింది. వీటి అమలుపై పాట్నా హైకోర్టు స్టే ఇచ్చింది. ఇదే కేసులో సూరత్ కోర్టు రాహుల్‌ను దోషిగా నిర్ధారించిన వారంరోజుల తర్వాత పాట్నా కోర్టు మార్చి 30న రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. ఏప్రిల్ 12న రాహుల్ తమ ముందు హాజరు కావాలని ఎంపి, ఎంఎల్ఎ కోర్టు ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆది దేవ్ మార్చి 18న ఉత్తర్వులు జారీ చేశారు. వేరే విచారణా తేదీని నిర్దేశించాల్సిందిగా రాహుల్ తరపు న్యాయవాది కోరడంతో ఏప్రిల్ 25 తదుపరి విచారణా తేదీగా నిర్ధారించారు. తాజాగా ఈ ఆదేశాలు అమలుపై పాట్నా హైకోర్టు స్టే ఇచ్చింది.

ఎపి భవన్ విభజనపై భేటీ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎపి భవన్ విభజనపై ఎపి, తెలంగాణ రాష్ట్రాలతో కేంద్ర హోంమంత్రిత్వశాఖ నిర్వహించ తలపెట్టిన సమావేశం వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం సోమవారం సమావేశం జరగాల్సి ఉండగా.. బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు రాష్ట్రాలకు కేంద్ర హోంమంత్రిత్వశాఖ సమాచారం అందించింది. సమావేశం వాయిదాకు గల కారణాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ సమావేశానికి రావాలని ఇరు రాష్ట్రాల అధికారులను ఇదివరకే హోంశాఖ కోరిన సంగతి తెలిసిందే. కేంద్ర హోంమంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ అధ్యక్షతన ఈ సమావేశం జరగాల్సి ఉంది.

ఆ వార్తలకు రక్షణ ఏది ?

- ఐటి చట్ట సవరణలపై బాంబే హైకోర్టు

న్యూఢిల్లీ : ఐటి చట్టంలో చేసిన సవరణలు అనుకరణ, వ్యంగ్య వార్తలకు ఎలాంటి రక్షణ ఇవ్వడం లేదని బాంబే హైకోర్ట్ అభిప్రాయపడింది. సవరణల రాజ్యాంగ చెల్లుబాటును ప్రశ్నిస్తూ హాస్యనటుడు కునాల్ కమ్రా దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జిఎస్ పటేల్, జస్టిస్ నీలా గోఖలేతో కూడిన బెంచ్ సోమవారం విచారణ జరిపింది. ఆన్‌లైన్ గేమ్స్‌ను, కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక వార్తలను నియంత్రిస్తూ ఈ నెల 6న ఈ సవరణలు ప్రతిపాదించారు. కేంద్రప్రభుత్వానికి సంబంధించిన ఏ సమాచారమైనా అవాస్తవమైనదని, తప్పుదోవ పట్టించేదిగా ఉన్నదని భావిస్తే.. వాటిని నియంత్రించడానికి నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసేందుకు ఈ సవరణ ఐటీ శాఖకు అధికారం కట్టబెట్టింది. అనుకరణ, వ్యంగ్య వార్తలను అడ్డుకోవాలన్న ఉద్దేశం తనకు లేదని కేంద్రం సమర్పించిన అఫిడవిట్‌ను జస్టిస్ పటేల్ ప్రస్తావిస్తూ 'మీ నిబంధనలు అలా చెప్పడం లేదే' అని ప్రశ్నించారు. ఆ వార్తలకు ఎలాంటి రక్షణ ఇవ్వడం లేదని, ఆ విషయాన్ని తాము పరిశీలిస్తామని చెప్పారు. నిబంధన అవసరమైన రక్షణ చర్యలు లేవని తెలిపారు. కమ్రా పిటిషన్ రాజ్యాంగంలోని భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించినదని చెప్పారు.

బంగ్లాదేశ్‌లో పిడుగుల భీభత్సం

9 మంది మృతి

ఢాకా : బంగ్లాదేశ్‌లో పిడుగులు పడి తొమ్మిది మంది చనిపోయారు. వీరంతా రైతులు, వ్యవసాయ కార్మికులే. ఆదివారం ఉదయం 10.00 గంటల నుండి 11.00 గంటల మధ్య ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి సునమ్‌గంజ్, మౌల్విబజార్, సిల్హెట్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పంట నష్టం కూడా సంభవించినట్లు అధికారులు తెలిపారు.

ఎన్నికల వేళ సోదాల కలకలం

కర్ణాటకలో ఐటి, లోకాయుక్త దాడులు

బెంగళూరు : మే 10న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఉధృతంగా జరుగుతుండగా, సోమవారం ఆదాయపు పన్ను, లోకాయుక్త దాడులు జరగడం కలకలం సృష్టించింది. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె. గంగాధర గౌడ, ఆయన కుమారుడు, బెల్తంగడి కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు రంజన్ జి. గౌడ నివాసాలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. బెల్తంగడి, దాని సమీప గ్రామం ఇన్‌దబెట్టులో ఉన్న ఈ ఇద్దరు నాయకులు నివాసాల్లో దాడులు జరిగాయి. ప్రసన్న ఎడ్యుకేషన్ ట్రస్టు కార్యాలయంపైనా దాడులు జరిగాయి. ఈ ట్రస్టు ద్వారా గంగాధర గౌడ, రంజన్ గౌడ పలు విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారు. స్థానిక పోలీసుల సహాయంతో ఐటి అధికారులు ఈ దాడులు జరిపారు. గంగాధర గౌడ, రంజన్ జి. గౌడ నివాసాలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడులు రాజకీయ ప్రేరేపిత చర్య అని బెల్తంగడి కాంగ్రెస్ అభ్యర్థి రక్షిత్ శివరామ్ విమర్శించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు వస్తున్న మద్దతు చూసి అధికార బిజెపి ఆందోళన చెందుతుందని అన్నారు. ఎఐసిసి అధికార ప్రతినిధి చరణ్ సింగ్ సప్రా మాట్లాడుతూ ఈ దాడులను చట్టపరంగా ఎదుర్కొంటామని చెప్పారు.

అధికారులపై లోకాయుక్త దాడులు

కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో అధికారులపై లోకాయుక్త పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. అక్రమాస్తుల కేసులు నమోదు చేశారు. బెంగళూరు, శివమొగ్గ, చిత్రదుర్గ, కోలార్, బీదర్ జిల్లాలో ఈ దాడులు జరిగాయి. బెంగళూరులో బిబిఎంపి యెలహంక జోన్ టౌన్ ప్లానింగ్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ గంగాధరయ్య కార్యాలయం, నివాసంపై దాడులు జరిగాయి. సోమవారం మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో దాడులు జరిపినట్లు లోకాయుక్త పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

చరిత్రనే కాదు సైన్స్‌ను చెరిపేస్తున్నారు

- ప్రకాష్ కారత్

తిరువనంతపురం: బిజెపి-ఆరెస్సెస్‌లు ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల నుంచి చరిత్రనే కాదు, సైన్స్‌ను కూడా తొలగించేస్తున్నాయని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాశ్ కారత్ విమర్శించారు. ఎకెజి స్టడీ అండ్ రీసెర్చ్ సెంటర్ నిర్వహించిన వైకోమ్ సత్యాగ్రహ శతాబ్ది సెమినార్‌లో ఆయన కీలకోపన్యాసం చేస్తూ, బిజెఇ-ఆర్ఎస్ఎస్‌ల తప్పుడు విధానాలను ఎండగట్టారు. కాంగ్రెస్ మొదట్లో వైకోమ్ సత్యాగ్రహానికి మద్దతు ఇచ్చిందని, తరువాత వైఖరి మార్చుకుందని అన్నారు.

ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంవీ గోవిందన్ మాట్లాడుతూ వైకోమ్ సత్యాగ్రహం పీడిత ప్రజల ప్రజాస్వామిక హక్కులకు అద్దం పడుతోందని అన్నారు. సెమినార్‌లో థామస్ ఐజాక్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కనం రాజేంద్రన్, సునీల్ పి ఇలయత్ తదితరులు మాట్లాడారు.

కమెడియన్ మున్వర్ ఫరూఖీకి బెయిల్

న్యూఢిల్లీ : కమెడియన్ మున్వర్ ఫరూఖీకి సుప్రీంకోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. మున్వర్‌పై ఇతర రాష్ట్రాల్లో నమోదైన కేసులన్నింటినీ మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు బదిలీ చేయాలని ఆదేశించింది. కేసులను ముంబయి లేదా ఢిల్లీకి బదిలీ చేయాలని సోమవారం నాటి విచారణలో మున్వర్ తరపు సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి కోర్టును కోరారు. ఇండోర్, ప్రయాగ్ రాజ్‌లలో మున్వర్ ప్రాణాలకు ముప్పు ఉందని పేర్కొన్నారు. మున్వర్ అరెస్టుకు ముందు ఇండోర్‌లో హిందూ మతతత్వ సంస్థ మద్దతుదారులు ఆయనపై దాడి చేశారని తెలిపారు. ఎదుట విచారణకు హాజరుకావాలని కోరుతూ మున్వర్‌కు జారీ చేసిన వారెంట్ల స్టే పై గడువును మూడువారాలకు పొడిగిస్తున్నట్లు తెలిపింది.

మతసామరస్యం పాటలో నటించిన యువకుడిపై బిజెపి మూకల దాడి

అగర్తల : మత సామరస్యాన్ని చాటే పాటలో నటించిన ఓ యువకుడిపై బిజెపి మూక దాడి చేసి, తీవ్రంగా గాయపరిచింది. రంజాన్‌రోజు జరిగిన ఈ ఘటనపై వీడియో తాజాగా చర్చనీయాంశమైంది. అగర్తలా ఉదయ్‌పూర్‌కు చెందిన యువకుడు బాపన్ నంది (23) సోషల్‌మీడియాలో బాగా ఫేమస్. ఆయన నటించిన పలు వీడియోలు సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతూ.. మంచి గుర్తింపు తెచ్చాయి. సామాజికాంశాలపై సందేశాత్మకంగా రూపొందించే ఆయన వీడియోలు నెటిజన్లను ఆకర్షిస్తాయి. రంజాన్ పండుగ సందర్భంగా మతసామరస్యాన్ని చాటేవిధంగా.. ఉత్తేజం కలిగే పాటతో నాలుగు నిమిషాల నిడివి గల వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ పాటలో రంజాన్ పండుగను అందరూ సంతోషంగా జరుపుకున్నట్లు కనిపించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో కనిపించగానే బిజెపి మూకలు బాపన్ నందిని పోలీస్ లైన్ బజార్ ప్రాంతానికి రమ్మని పిలిచాయి. ఆయనపై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. స్థానిక బిజెపి నాయకుడు, పంచాయతీ ఉప ప్రధాన్ అను మురా సింగ్, ఇతర బిజెపి నాయకులు కొట్టారు. అంతటితో ఆగకుండా స్థానిక పోలీస్ స్టేషన్‌కి వెళ్లి బాపన్ నందిపై సింగ్ ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు అతనిడిని విచారణ కోసం స్థానిక పోలీస్ స్టేషన్‌కి పిలిపించారు. ఈ దాడి తర్వాత నంది విలేకర్లతో మాట్లాడుతూ.. దాడి చేసిన వారిలో ఓ మహిళా బిజెపి నాయకురాలు కూడా ఉన్నారని నంది చెప్పారు. ముస్లిం యువకుడిలా నటించి హిందూత్వ మూలాలను కించపరిచినట్లు ఆమె ఆరోపించారని, చొక్కా చించి, కాలర్ పట్టుకుని కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. 'వాళ్లు నన్నెందుకు కొట్టారో నాకు తెలియదు. నేను వ్లాగులు క్రియేట్ చేస్తూ, సోషల్ మీడియా ద్వారా జీవనోపాధి పొందుతున్నాను. ఈ పాటను అగర్తలాకి చెందిన వ్యక్తి వివాదాస్పదం చేశాడు. నేను ఆ పాటలో నటించానంతే. నాపై దాడి చేసిన తర్వాత వారిపై పోలీసులకు ఫిర్యాదు చేద్దామనుకున్నాను. కానీ వారంతా అక్కడ స్థానికంగా పరపతి కలిగినవారు. అందుకే నేను వారిపై ఫిర్యాదు చేయలేకపోయాను ' అని అన్నారు. బాపన్ నందిని కొట్టిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుంది. బిజెపి నేతల దాడిపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఈ దాడిని సిపిఎం నేత, ఎమ్మెల్యే జితేంద్ర చౌదరి తీవ్రంగా ఖండించారు.

'ఆపరేషన్ కావేరి' షురూ..

సూడాన్ నుంచి భారతీయుల తరలింపు

న్యూఢిల్లీ: ఆఫ్రికా దేశమైన సుడాన్‌లో ఆర్మీ, పారామిలటరీ దళాల మధ్య భీకర పోరు కొనసాగుతుండడంతో అక్కడి భారతీయులను ఖాళీ చేయించే ప్రక్రియ (దీనినే ఆపరేషన్ కావేరి) ప్రారంభమైంది. అంతర్యుద్ధం రూపం తీసుకున్న మిలిటరీ, పారా మిలిటరీ బలగాల మధ్య ఆధిపత్య పోరులో అమాయక పౌరులు చనిపోతున్నారు. ఈ దాడుల్లో ఇంతవరకు 500 మంది దాకా సాధారణ పౌరులు మరణించారు. మరో 3,500 మంది దాకా గాయపడ్డారు. మతుల్లో కొందరు భారతీయులు ఉన్నారు. సూడాన్‌లో అంతర్యుద్ధం తీవ్రమవుతుండడంతో అక్కడ ఉన్న 4,000 మందికిపైగా భారతీయులు బిక్కుబిక్కుమంటున్నారు. దీనిపై మీనమేషాలు లెక్కిస్తూ వచ్చిన భారత విదేశాంగశాఖ చివరికి వీరిని అక్కడి నుంచి ఖాళీ చేయించాలని నిర్ణయించుకుంది. ఆపరేషన్ కావేరి పేరుతో వీరిని భారత్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టింది. మొదటి బ్యాచ్ కింద సుమారు 500 మందిని సూడాన్ పోర్ట్‌కు తరలించారు. వీరిని తరలించేందుకు భారత నౌకా దళానికి చెందిన ఐఎన్ఎస్ సుమేధ అక్కడికి చేరుకుంది. సూడాన్‌లో భారతీయులను ఖాళీ చేయించి, స్వదేశానికి తీసుకొచ్చే ప్రక్రియ సోమవారం ప్రారంభమైందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు.

ఈజిప్టు, ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాలు కూడా తమ పౌరులను అక్కడి నుంచి ఖాళీ చేయించే ప్రక్రియ ఇప్పటికే చేపట్టాయి. సూడాన్ అధికారుల సహకారంతో 436 మంది ఈజిప్టు పౌరులను అది ఖాళీ చేయించింది. కార్టూమ్, పోర్ట్ సూడాన్, వాడిహాల్ఫా ప్రాంతాల నుండి దౌత్య వేత్తలను రోడ్డు మార్గం ద్వారా సరిహద్దు దాటించింది. సూడాన్‌లో సుమారు 10,000 మంది ఈజిప్షియన్లు ఉన్నట్లు ఆ దేశ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. అంతర్యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ఈజిప్ట్ జాతీయ విమానయాన సంస్థ ఈజిప్ట్ ఎయిర్ ఖార్టూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి తమ సేవలను నిలిపివేసింది.

సూడాన్ ఆర్మీ చీఫ్ అబ్దేల్ ఫత్తా అల్ బుర్హాన్, ఆయన డిప్యూటీ, పారామిలటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్)కు నేతృత్వం వహిస్తున్న మొహమ్మద్ హమ్దాన్ డాగ్లో మధ్య ఆధిపత్య పోరు ఆ దేశాన్ని తీవ్ర అనిశ్చితిలోకి నెట్టింది. ఆర్మీ, ఆర్ఎస్ఎఫ్ దళాల మధ్య గత తొమ్మిది రోజులుగా సాగుతున్న భీకర పోరుకు స్వస్తి పలికి, శాంతిని పునరుద్ధరించాలని ఐక్యరాజ్య సమితి ఇరు వర్గాలకు విజ్ఞప్తి చేసింది.

అమెరికాలో మనుషుల కంటే తుపాకులే ఎక్కువ

వాషింగ్టన్: జనాభాలో భారత్ అగ్రస్థానంలో ఉండగా, తుపాకుల్లో అమెరికా నంబర్ వన్‌గా ఉంది. అమెరికా వద్ద ప్రజల కంటే తుపాకులే ఎక్కువ అంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. 2020-22లో కోవిడ్-19 విజృంభించిన సమయంలో జీవితం అసురక్షితమైనప్పుడు, 15 లక్షల మంది అమెరికన్లు సుమారు 60 లక్షల తుపాకులను కొనుగోలు చేసినట్లు ట్రేస్ అనే ప్రభుత్వేతర సంస్థ అధ్యయనం వెల్లడించింది. దేశంలోని ప్రతి ఐదు ఇళ్లకు ఒకరు తుపాకులు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుత వార్షిక తుపాకీ విక్రయాలు 15 సంవత్సరాల క్రితం కంటే రెట్టింపు.. ట్రేస్ అధ్యయనం మరి కొన్ని ఆసక్తికర విషయాలను కూడా వెల్లడించింది. ప్రజలు అన్ని సమయాలలో తీసుకెళ్లగలిగే సెమీ ఆటోమేటిక్ తుపాకులను కొనుగోలు చేస్తున్నారు. మహమ్మారి సమయంలో, మొదటిసారి తుపాకీ కొనుగోలుదారులు 5 శాతం మంది ఉన్నారు, ఎక్కువగా యువకులు. వీరిలో ఎక్కువ మంది మహిళలు మరియు నల్లజాతీయులు ఎక్కువ అభద్రతను ఎదుర్కొన్నారు. కోవిడ్ కాలంలో తుపాకీ దుకాణాల ముందు ప్రజలు పొడవైన క్యూలలో నిలబడి ఉన్న చిత్రాలు చాలా మంది దృష్టిని ఆకర్షించాయి. 2019 -2021 మధ్య 75 లక్షల మంది అమెరికన్లు కొత్త తుపాకీని కొనుగోలు చేసినట్లు మరో అధ్యయనం కనుగొంది. ఇప్పటికే తుపాకులు కలిగి ఉన్న రెండు కోట్ల మంది ఈ కాలంలో మరిన్ని తుపాకులు కొనుగోలు చేశారు.

కేరళ పర్యటనలో మోడీ

- నేడు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

కొచ్చి : రెండు రోజుల కేరళ పర్యటన కోసం సోమవారం సాయంత్రానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కొచ్చికి చేరుకున్నారు. బిజెపి నిర్వహించిన 'యువం 2023' అనే యువజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు రోడ్ షోను మోడీ నిర్వహించారు. కొచ్చిలోని ఐఎన్ఎస్ గరుడా నావెల్ ఎయిర్ స్టేషన్ నుంచి యువజన కార్యాక్రమం వేదిక వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర మోడీ రోడ్ షో జరిగింది. ఈ కార్యక్రమంలో మోడీ మాట్లాడుతూ కేరళలో మౌలిక వసతుల్లో మార్పులను కేంద్ర ప్రభుత్వమే తీసుకుని వచ్చిందని చెప్పడం విశేషం. మంగళవారం మోడీ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించనున్నారు. తిరువంతనపురం నుంచి కాసరగఢ్ వరకూ నడిచే ఈ రైలును మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభించనున్నారు. అయితే ఈ ట్రైన్ రెగ్యులర్ సర్వీసులు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్నాయి.

పరస్పర ఆమోదయోగ్య పరిష్కారానికి కసరత్తు

- తూర్పు లడఖ్‌పై భారత్, చైనా అంగీకారం

న్యూఢిల్లీ : తూర్పు లడఖ్ (పశ్చిమ సెక్టార్)లో మిగిలివున్న సమస్యలకు సాధ్యమైనంత త్వరలో పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని రూపొందించేందుకు, సన్నిహిత సంబంధాలు కలిగివుండేందుకు భారత్, చైనా అంగీకరించాయి. ఆదివారం జరిగిన మిలటరీ చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరింది. ఈ మేరకు సోమవారం విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. పశ్చిమ సెక్టార్‌లో వాస్తవాధీన రేఖ పొడవునా సంబంధిత సమస్యల పరిష్కారంపై ఉభయ పక్షాలు అరమరికలు లేకుండా, కూలంకషంగా చర్చలు జరిపాయని ఆ ప్రకటన పేర్కొంది. కింది స్థాయిలో భద్రతను, సుస్థిరతను కొనసాగించేందుకు కూడా ఇరు పక్షాలు అంగీకరించాయి. తద్వారా సరిహద్దు ప్రాంతాల్లో శాంతి భద్రతలు పునరుద్ధరించి, ద్వైపాక్షిక సంబంధాల్లో పురోగతికి వీలు కల్పించడానికి అంగీకారం కుదిరిందని ఆ ప్రకటన పేర్కొంది. భారత్, చైనా కార్ప్స్ కమాండర్ స్థాయి 18వ దఫా చర్చలు ఆదివారం చైనా వైపు గల చుశూల్-మోల్డో సరిహద్దు పాయింట్ వద్ద జరిగాయి. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సమావేశానికి హాజరయ్యేందుకు చైనా రక్షణమంత్రి లీ షంగ్ఫూ భారత్ రానున్న నేపథ్యంలో ఈ చర్చలు జరిగాయి.

మీ కోసం

ఐస్ క్యూబ్‌తో ముఖంపై పావుగంట మర్దన చేసుకుంటే... మృతకణాలు తొలగి రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. ముఖం తాజాగా కనిపిస్తుంది.

జీవనసౌరభం

సమయం చాలా విలువైంది. వేరే వాళ్ల గురించి ఆలోచిస్తూ, విమర్శిస్తూ కాలాన్ని వృథా చేసుకోవద్దు.

వేసవికాలం

వేసవికాలం వచ్చింది
చాలా సెలవులు తెచ్చింది
ఏటి గట్టుకు వెళదామా
హాయిగ ఈత కొడదామా!

తోటల్లోకి వెళదామా
తాటి ముంజలు తిందామా
మామిడి రసాలు కొందామా
చక్కగా ఆరగిద్దామా!

బజారు వైపు వెళ్దామా
ఈత పండ్లు తెద్దామా
పుచ్చకాయ ముక్కలు తిందామా
వేసవి తాపాన్ని తీర్చుకుందామా!

నిమ్మకాయలు తెద్దామా
నిమ్మరసం తాగేద్దామా
చెరుకు రసాన్ని తాగుదుమా
కడుపున చల్లగా చేద్దామా!

జంబో నారింజ పండ్లను తెద్దామా
జామ్ జామ్‌గా తిందామా
నేరేడు పండ్లను కొందామా
చక్కగా చప్పరిద్దామా!

నీడ పట్టున ఉందామా
అందరం కలిసి తిందామా
మజ్జిగ నీళ్లు తాగుదుమా
వడదెబ్బకి దూరంగా ఉండెదమా!

– మొర్రి గోపి
88978 82202

ఖాళీలు పూరించండి



పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.

నేను గీసిన బొమ్మ

మితింటి హృషికేష్,
6వ తరగతి,
ఢిల్లీ పబ్లిక్ స్కూలు,
నిడమానూరు,
విజయవాడ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కొత్త కొత్త ప్రదేశాలు చూడాలను ఎవరికి ఉండదు? మరి అన్నీ చూసేందుకు అందరికీ సాధ్యపడదు. అలాంటిది మొహమ్మద్ సలీం ఖాన్ యూట్యూబ్ ఛానెల్లో చూడొచ్చు. అవును! అతను దేశ విదేశాలు బైక్‌పై తిరుగుతూ తన ప్రయాణాన్ని, అక్కడి విశేషాలను వివరిస్తూ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నాడు. ఇప్పటికి 17 లక్షల మందికి పైగా వీక్షకులు అతడి యూట్యూబ్‌ను ఫాలో అవుతున్నారు. సలీం చెప్పే విశేషాలను ఎంతో ఇష్టంగా చూస్తున్నారు. ఈ జర్నీ మొదలైందో అతడి మాటల్లోనే ...

దేశ విదేశాలను చుట్టేస్తూ ...

సరదాగా బైక్ ప్రయాణం

'మా సొంతూరు పశ్చిమ బెంగాల్‌లో దక్షిణ్ దినాజ్‌పూర్ జిల్లాలోని ఒక చిన్న గ్రామం. నేను నెలలు బిడ్డగా ఉన్నప్పుడే తల్లిదండ్రులు ఉపాధి కోసం ముంబైలోని ధారవికి వచ్చారు. ఈ మురికివాడలోనే నా బాల్యం గడిచింది. ఓ చిన్న ఇంట్లో అద్దెకు ఉండేవారం. నాన్న వాచ్‌మెన్‌గా ఉంటే, తల్లి ఇళ్లల్లో పాచి పని చేసేది. వచ్చిన కొద్ది డబ్బుతోనే నన్ను, అన్నయ్యను పోషించారు. ఆదాయం ఇంటి ఖర్చులకు సరిపోయేది కాదు. దాంతో ఐదో తరగతిలో ఉన్నప్పుడు నేను ఓ టైలర్ షాపులో పనికి కుదిరాను. చేతిపనులు చేస్తే వారానికి పది రూపాయలు ఇచ్చేవారు. అమ్మ ఇళ్లల్లో గిన్నెలు తోముతూ, బట్టలు ఉతుకుతూ పని చేసేది. ఓ రోజు ఇంటి యజమాని మా అమ్మను నీచంగా మాట్లాడాడు. అవమానించి ఇల్లు ఖాళీ చేయించాడు. ఆ సంఘటన ఎప్పటికీ మరిచిపోలేను. మనసుకు చాలా బాధ కలిగించింది. పెద్దయ్యాక ఎలాగైనా సొంతిల్లు కట్టు కోవాలనిపించింది. మాలాంటి పేదలకు అదొక కల అని అమ్మ నిత్యం చెబుతుండేది.

చదువుకుంటూనే నేను ఏదో ఒక పనికి వెళ్లేవాడిని. హోటల్లో వెయిటర్‌గా పని చేస్తూ పదో తరగతి పూర్తి చేశాను. ఖాళీ సమయంలో స్నేహితులతో కలిసి క్రికెట్ బాగా ఆడేవాడిని. పోటీల్లో పాల్గొని ప్రైజ్‌లు తీసుకున్నా. ఎప్పటికైనా భారత్ క్రికెట్ జట్టులో ఎంపికవ్వాలని బలంగా అనిపించేది. అయితే, కాలేజీలో ఉన్నప్పుడు వెన్నెముకకు తీవ్రగాయం అయ్యింది. ఎప్పటికీ క్రికెట్ ఆడకూడదని వైద్యులు చెప్పారు. దాంతో ఎంతో ఇష్టమైన క్రికెట్ వదిలేశా.

అమ్మ కళ్లలో ఆనందం

ముంబైలో ఫ్యాషన్ డిజైనింగ్‌కు సంబంధించిన ఆభరణాలు చాలా తక్కువ ధరకు దొరుకుతాయి. అందులో వస్త్రాలు, బ్యాగ్‌లు, వాలెట్లు, బూట్లు కొని ఆన్‌లైన్లో పెట్టి అమ్మేవాడిని. దాంతో మంచి ఆదాయం వచ్చింది. ఆ డబ్బును ఖర్చు పెట్టకుండా దాచిపెట్టా. ఇల్లు కట్టుకోవాలన్న లక్ష్యంతో కష్టపడి పనిచేశా. దాంతో 21 ఏళ్ల వయస్సుకే ఓ చిన్న ఇల్లు కొన్నాను. అమ్మకు కానుకగా ఇచ్చాను. అది చూసి అమ్మ సంతోషంతో కన్నీళ్లు పెట్టుకుంది. ఆ ఆనందం ఎప్పటికీ గుర్తు ఉండిపోతుంది. డిగ్రీ పూర్తి అయ్యాక నటనవైపు దృష్టిపెట్టా. యాక్టింగ్ స్కూల్లో చేరా. శిక్షణలో ఉండగానే కొన్ని ప్రకటనలు చేసే అవకాశం వచ్చింది. షార్ట్ ఫిల్మ్‌లోనూ నటించాను. 'ఇన్సాన్'లో నా నటనకి 2016లో నాసిక్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో 'ఉత్తమ స్టూడెంట్ ఫిల్మ్ మేకర్'గా అవార్డు వచ్చింది. కానీ ఆదాయం స్థిరంగా ఉండేది కాదు. ఓ నెల్లో అవకాశాలే ఉండేవి కావు. దాంతో ఖర్చులకు ఇబ్బంది పడేవాళ్లం.



కుటుంబ సభ్యులతో సలీమ్

కులం, మతం భేదం లేకుండా ...

నటుడిగా నా ప్రయాణాన్ని ఇంకా బాగా మెరుగుపరుచుకోవాలి. అందుకే కెమెరాకు అలవాటుపడాలని నిర్ణయించుకున్నా. 'ఎంఎస్‌కె ట్రావెల్' పేరుతో యూట్యూబ్‌లో నా చిన్న చిన్న వీడియోస్ తీసి అప్‌లోడ్ చేయడం మొదలుపెట్టా. ఫాలోవర్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. దాంతో దేశంలోని ప్రసిద్ధి చెందిన నగరాలు, క్షేత్రాలు, గుళ్లు తిరిగి వాటి విశిష్టతను వివరించా. ఫాలోవర్స్ సూచన మేరకు ఆ ప్రాంతాలకు ఎలా చేరుకోవాలి? దారి ఎలా ఉంటుందో కూడా వీడియోలో వివరంగా చూపిస్తున్నా. ఏ పండగను ఏ రాష్ట్ర ప్రజలు ఎలా జరుపుకుంటారో వివరిస్తున్నాను. ఢిల్లీలోని ఐకానిక్ జామా మసీదులో రంజాన్ వేడుకలు, హోళీ, దీపావళి, దసరా, గిరిజనుల జీవనశైలి, వారి ప్రత్యేకతలు చెప్పా.

ఈ ప్రయాణంలో నా మతం, ఆచారాలు పక్కనపెడతాను. అక్కడ జనంతో కలిసి ఉత్సవాల్లో పాల్గొంటాను. పశ్చిమ బెంగాల్‌లో చేపల వేట, హోటళ్లలో దొరికే ఆహారం, గురుద్వారాలు, బౌద్ధ దేవాలయాలను సందర్శించడం చూపించా. పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాలు, లడఖ్, అస్సాం, నాగాలాండ్, అరుణాచల్, మేఘాలయ, రాజస్థాన్, కేరళ, హిమాచల్ ప్రాంతాలకు వెళ్లి ఆ ప్రాంత సంస్కృతి, సాంప్రదాయాల గురించి రికార్డు చేశాను. ఈ ప్రయాణంలో వేలాది మంది అభిమానం పొందాను. ఖతార్, అబుదాబి, దుబాయ్, థాయ్‌లాండ్, మయన్మార్, నేపాల్, రష్యా దేశాల్లోనూ పర్యటించాను. ఇప్పటివరకూ వెయ్యికి పైగా వీడియోలు చేశా. నా ప్రయాణ విశేషాలను వీక్షకులు ఇష్టపడడం వల్ల ఫాలోయింగ్ బాగా పెరిగి ఆదాయం బాగా వస్తోంది. బైక్‌పై ప్రయాణ జీవితం నాకు బాగా నచ్చింది. కొన్ని ప్రయాణాలు కష్టంగా సాగుతాయి. అదొక అనుభవం అనుకుని ముందుకు వెళతా. మతం, భాషా, ప్రాంతం అనే బేధం లేకుండా జనంతో కలిసి జీవిస్తున్నాను."

ఈ సలీం 30 ఏళ్లకే టాప్ 100 డిజిటల్ స్టార్స్‌లో ఒకడిగా గుర్తింపు పొందాడు. ప్రయివేటు ప్రకటనలకు అంబాసిడర్‌గా నిలిచాడు.

అతి చల్లని నీరు .. అనారోగ్యం కూడా!

ఈ ఎండల్లో చాలామంది చల్లని నీరు తాగడానికే ఇష్టపడతారు. అయితే ఫ్రిజ్‌లో ఉంచిన అతిగా చల్లబడిన నీరు తాగటం వల్ల కొన్ని సమస్యలు ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు.

ఫ్రిజ్ నీరు తాగడం వల్ల మలబద్ధక సమస్య వస్తుంది. ఎండ నుంచి నీడకు వచ్చిన వెంటనే ఈ నీరు తాగినప్పుడు పేగులు కుంచించుకుపోతాయి. అలాగే, పొత్తికడుపు నొప్పి ఏర్పడుతుంది. తద్వారా మలబద్ధకం, జీర్ణ సమస్యలు తలెత్తుతాయి.

వేసవి కాలంలో ఫ్రిజ్ నీటిని ఎక్కువగా తాగడం వల్ల హృదయ స్పందన రేటు తగ్గుతుంది. ఇది గుండెపోటుకు కూడా కారణం కావచ్చు. చల్లటి నీరు తాగడం వల్ల జీర్ణవ్యవస్థపై కూడా చెడు ప్రభావం పడుతుంది.

ఫ్రిజ్ నీరు ఎక్కువసార్లు తాగడం వల్ల బ్రెయిన్ ఫ్రీజ్ సమస్య కూడా వస్తుంది. ఈ నీరు నరాల్లోకి చేరిన వెంటనే మెదడుకు సందేశాలు పంపుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఇది తలనొప్పి సమస్యను కలిగిస్తుంది.

ఫ్రిజ్ నీరు తాగడం వల్ల జీవక్రియ వ్యవస్థ మందగించి, కొవ్వును సరిగ్గా విడుదల చేయలేరు. కొన్నిసార్లు ఇది బలహీనత, అలసటను కూడా కలిగిస్తుంది.

డిఫరెంట్ లుక్‌లో రామ్ చరణ్

క్రేజీ డైరెక్టర్ శంకర్, హీరో రామ్ చరణ్ కాంబినేషన్‌లో పాన్ ఇండియా సినిమా రాబోతుందని తెలిసిన విషయమే. ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ సినిమా ఇంటర్వెల్ సీక్వెన్స్‌ను దర్శకుడు శంకర్ అద్భుతంగా ప్లాన్ చేశారు. ఫ్లాష్ బ్యాక్‌లో వచ్చే ఈ ఇంటర్వెల్ సీక్వెన్స్ స్వతంత్ర పోరాట యోధుల గొప్పతనాన్ని చెప్పే విధంగా ఉంటుందని సమాచారం. ఈ సీక్వెన్స్‌లో రామ్ చరణ్ లుక్ డిఫరెంట్‌గా ఉండబోతోంది. పైగా ఈ సినిమాలో చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. ఒక పాత్రలో గ్రామీణ యువకుడిగా, మరో పాత్రలో సూపర్ స్టైలిష్‌గా కనిపించనున్నాడు. దీని కోసం బాలీవుడ్ ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్ అలీమ్ హకీమ్ పనిచేస్తున్నాడు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రంలో బరువైన ఎమోషన్స్‌తో పాటు గ్రాండ్ విజువల్స్ కూడా ఉండబోతున్నాయి.

బిగ్గెస్ట్ ఐ మ్యాక్స్‌లో 'సింహాద్రి'

టాలీవుడ్‌లో రీ రిలీజ్ ట్రెండ్ కొనసాగుతోంది. ఇప్పటికే ఖుషీ, ఒక్కడు, వర్షం, ఆరెంజ్, దేశముదురు లాంటి ఎన్నో సినిమాలు మళ్లీ విడుదల య్యాయి. యంగ్ టైగర్ ఎన్టీఆర్ హిట్ కొట్టిన సింహాద్రిని కూడా మే 20న థియేటర్లలో గ్రాండ్‌గా రీ రిలీజ్ చేసేందుకు సన్నాహాలు జరుగు తున్నాయి. ఈ చిత్రం మెల్‌బోర్న్‌లో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద ఐమ్యాక్స్ స్క్రీన్‌లో విడుదల కానుంది. రీ రిలీజ్ కోసం మేకర్స్ కష్టపడ్డారు. షోకి సంబంధించిన బుకింగ్స్ ఇప్పటికే ఓపెన్ అయ్యాయి. డాల్బీ అట్మాస్ ఆడియోతో 4కెలో సినిమా రిలీజ్ కానుంది. ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో భూమిక చావ్లా మరియు అంకిత కథానాయికలుగా నటించారు. వి.విజయ్ కుమార్ వర్మ నిర్మించిన ఈ చిత్రానికి ఎం.ఎం. కీరవాణి సంగీతం అందించారు.

దీపావళికి 'అయలాన్'

హీరో శివకార్తికేయన్ నటిస్తున్న చిత్రం 'అయలాన్'. రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్‌గా నటించింది. పాన్ ఇండియా సినిమాగా రూపొందుతున్న ఈ చిత్రం దీపావళి పండగ సందర్భంగా విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సైన్స్ ఫిక్షన్ మూవీస్‌గా తెరకెక్కిస్తున్న చిత్రంలో ఏలియన్ ఓ ప్రధాన పాత్రగా తీశారు. విజువల్ ఎఫెక్ట్స్ వర్క్, క్వాలిటీ గ్రాఫిక్స్ కోసం మేకర్స్ చాలా కష్టపడ్డారు. హాలీవుడ్ సినిమాలకు విజువల్ ఎఫెక్ట్స్ అందించిన ఫాంటమ్ ఎఫ్ఎక్స్ కంపెనీ మేకర్స్‌లో కలిసి పనిచేసింది. ఆర్. రవికుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కెజెఆర్ స్టూడియోస్, 24ఎఎం స్టూడియోస్ పథకాలపై కోటపాడి జె. రాజేష్, ఆర్.డి. రాజా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తున్నారు.



'యూనివర్సిటీ'కి యు సర్టిఫికెట్

పీపుల్ స్టార్ ఆర్. నారాయణ మూర్తి నటించి, నిర్మించి, దర్శకత్వం వహించిన సినిమా 'యూనివర్సిటీ'. స్నేహ చిత్ర పిక్చర్స్ పతాకంపై రూపుదిద్దుకున్న ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను ఇటీవల పూర్తి చేసుకుని, యు సర్టిఫికెట్‌ను అందుకున్నట్లు నటుడు ఆర్. నారాయణమూర్తి తెలిపారు. ప్రస్తుత విద్యావ్యవస్థకు సంబంధించిన చిత్రమిది. యూనివర్సిటీ చదువులు పూర్తిచేసుకుని కెరీర్‌పై బోలెడన్ని ఆశలు పెట్టుకుని వస్తున్న యువత ఎదుర్కొంటున్న సమస్యలను సినిమాలో చూపించనున్నారు. కష్టపడి పరీక్షలకు ప్రిపేర్ అవుతుంటే పేపర్ల లీకేజీలు, ఉద్యోగ పరీక్షల్లోనూ పేపరు లీకేజీలు యువతను ఎలా తప్పదోవ పెట్టిస్తున్నాయో ఈ చిత్రంలో చూపించారు. పాటలను గద్దర్, నిస్సార్, మోటపలుకులు రమేశ్, వేల్పుల నారాయణ అందించారు. గద్దర్, సాయిచరణ్, గోస్కుల రమేశ్, పల్లె నరసింహం గానం చేశారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, మాటలు, సంగీతం, దర్శకత్వం: ఆర్.నారాయణమూర్తి.

'ఐబి-71' ట్రైలర్

సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో బాలీవుడ్ హీరో విద్యుత్ జమ్వాల్ నటిస్తున్న చిత్రం 'ఐబి 71'. మే 12న రిలీజ్ కానున్న ఈ మూవీ 1971లో ఇండియన్ ఏజెంట్స్, పాకిస్తాన్‌లోకి వెళ్లి చేసిన ఒక మిషన్ ఆధారంగా రూపొందింది. దాదాపు 50 ఏళ్లుగా ఇండియన్ హిస్టరీలో దాగి ఉన్న ఒక సీక్రెట్ మిషన్ కథ ఇది. 30 మంది ఏజెంట్స్, పది రోజుల్లో, ఒక మిషన్‌ని పాకిస్తాన్ వెళ్లి ఎలా కంప్లీట్ చేశారు అనేది ఈ సినిమా. మేకర్స్ ట్రైలర్ ని విడుదల చేశారు. ఆనాటి పరిస్థితులకి తగ్గట్లు చేసిన ప్రొడక్షన్ డిజైన్ ఆకట్టుకుంది. ప్రశాంత్ విహారీ ఇచ్చిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఆకట్టుకుంటుంది.

సన్‌రైజర్స్ చేజేతులా..

అగర్వాల్ పోరాటం వృథా ఢిల్లీ చేతిలో ఏడు పరుగుల తేడాతో ఓటమి

హైదరాబాద్: ఉప్పల్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-16 మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు అనూహ్యంగా ఓటమిపాలైంది. ఢిల్లీ నిర్దేశించిన 145పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సన్‌రైజర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 6 వికెట్లు కోల్పోయి 137పరుగులే చేయగల్గింది. తొలుత సన్‌రైజర్స్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌కి తోడు సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో రాణించడంతో ఢిల్లీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 144పరుగులకే పరిమితమైంది. టాస్ గెలిచిన ఢిల్లీ తొలుత బ్యాటింగ్‌కు మొగ్గుచూపింది. వాషింగ్టన్ సుందర్ ఒకే ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టి ఢిల్లీకి గట్టి షాకిచ్చాడు. ఎనిమిదో ఓవర్‌లో మూడు వికెట్లు తీశాడు. రెండో బంతికే వార్నర్(21), నాలుగో బంతికి సర్ఫరాజ్ ఖాన్(10), చివరి బంతికి అమాన్ ఖాన్(4) ను ఔట్ చేశాడు. దీంతో ఎనిమిది ఓవర్లు పూర్తయ్యేసరికి ఢిల్లీ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 62 పరుగులు మాత్రమే చేసింది. వాషింగ్టన్ సుందర్ వేసిన ఎనిమిదో ఓవర్ లోని రెండో బంతిని ఆడిన వార్నర్... బ్రూక్‌కు దొరికాడు. నాలుగో బంతికి సర్ఫరాజ్... భువనేశ్వర్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఒకే ఓవర్లో మూడు వికెట్లు పోవడంతో ఢిల్లీ ఆ తర్వాత ఆచితూచి ఆడింది. ఆ తర్వాత మనీష్ పాండే 34, అక్షర్ పటేల్ 34 పరుగులు రాణించడంతో ఢిల్లీ ఆ మాత్రమైనా స్కోర్ చేయగలిగింది. సన్ రైజర్స్ బౌలర్లలో సుందర్‌కు మూడు, భువనేశ్వర్ కుమార్‌కు రెండు, నటరాజన్‌కు ఒక వికెట్ దక్కాయి.

ఛేదనలో సన్‌రైజర్స్‌కు శుభారంభం దక్కలేదు. బ్రూక్(7) మరోసారి నిరాశపరచగా.. అగర్వాల్(49) అర్ధసెంచరీకి దగ్గర్లో ఔటయ్యాడు. ఆ తర్వాత త్రిపాఠి(15), అభిషేక్ శర్మ(5), కెప్టెన్ మార్క్రమ్(3) స్వల్ప స్కోర్‌కే పెవీలియన్‌కు చేరాడు. దీంతో సన్‌రైజర్స్ జట్టు 85పరుగులకే 5వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో గాయపడ్డ సుందర్(24నాటౌట్) భారీ షాట్స్ కొట్టలేకపోయాడు. క్లాసెన్(31) పోరాడినా నోర్జే బౌలింగ్‌లో ఔటవ్వడంతో సన్‌రైజర్స్ విజయావకాశాలు దెబ్బతిన్నాయి. చివరి ఓవర్లో 13పరుగులు చేయాల్సిన సన్‌రైజర్స్ జట్టు నోర్జే వేసిన బౌలింగ్‌లో 5పరుగులచే చేయడంతో ఓటమిపాలైంది. దీంతో ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఐదో పరాజయాన్ని చవిచూసింది.

పాయింట్ల పట్టిక

ఫ్రాంచైజీ	మ్యా	గె	ఓ	పా	నె.ర.
చెన్నై	7	5	2	10	+0.66
రాజస్తాన్	7	4	3	8	+0.84
లక్నో	7	4	3	8	+0.54
గుజరాత్	6	4	2	8	+0.21
బెంగళూరు	7	4	3	8	-0.01
పంజాబ్	7	4	3	8	-0.16
ముంబయి	6	3	3	6	-0.25
కోల్‌కతా	7	2	5	4	-0.18
హైదరాబాద్	7	2	5	4	-0.72
ఢిల్లీ	7	2	5	4	-0.96

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర: నెట్‌రన్‌రేట్

ఐపిఎల్‌లో నేడు..
గుజరాత్ × ముంబయి
(వేదిక: అహ్మదాబాద్; రా.7.30గం॥లకు)

వెటరన్ టిటి క్రీడాకారుడు

అర్జున్ సింగ్ భగత్ కన్నుమూత

జలంధర్: వెటరన్ టేబుల్ టెన్నిస్(టిటి) క్రీడాకారుడు అర్జున్ సింగ్ భగత్(77) గుండెపోటుతో మృతిచెందారు. రాజస్తాన్‌లోని జలంధర్‌లో జరిగే మాస్టర్స్ నేషనల్స్‌లో టిటి ఛాంపియన్‌షిప్ పోటీలను చూసేందుకు వచ్చిన అర్జున్ సింగ్ హోటల్‌లోని ఒక గదిలో ఉండగా.. మరుసటి రోజు మిత్రులు ఎంత పిలిచినా లేకవపోడంతో హోటల్ సిబ్బంది గది తాళం తీసి చూడగా.. అపస్మార స్థితిలో పడి ఉన్నారు. దీంతో సమీపంలోని ఆసుపత్రికి తరలించగా.. గుండెపోటుతో మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. అర్జున్ సింగ్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. మంగళవారం అర్జున్ సింగ్ స్వస్థలమైన జోథ్‌పూర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల జరిగిన 2023 ప్రపంచ వెటరన్ టిటి ఛాంపియన్‌షిప్‌లో అర్జున్ సింగ్ కాంస్య పతకం సాధించారు. గతంలో జాతీయస్థాయిలో అనేక టోర్నమెంట్‌లలో అనేక పతకాలు గెలిచిన అర్జున్.. నేషనల్ వెటరన్స్ ఛాంపియన్‌షిప్‌లో రెగ్యులర్ ఆటగానిగా కొనసాగుతున్నారు. గత ఏడాది శ్రీనగర్‌లో జరిగిన సీనియర్ నేషనల్స్ పురుషుల డబుల్స్‌లో స్వర్ణ పతకం నెగ్గారు. ఆయన మృతికి టిటిఎఫ్ఐ అధ్యక్షురాలు మేఘనా అహ్లావత్ ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు.

లెరెన్-నెపోంనిచ్ 11వ గేమ్ డ్రా

ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్

అస్తానా(కజకిస్తాన్): ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌కు చైనాకు చెందిన డింగ్ లెరెన్, రష్యాకు చెందిన ఇయాన్ నెపోంనిచ్‌ల మధ్య జరుగుతున్న 11వ గేమ్ డ్రా అయ్యింది. దీంతో ఇరువురు ఆటగాళ్లకు అర పాయింట్ దక్కింది. సోమవారం నెపోంనిచ్ ఇ4తో గేమ్‌ను ప్రారంభించగా.. డింగ్ లెరెన్ ఇ5తో గేమ్‌ను ప్రారంభించాడు. మొత్తం 14రౌండ్‌లకు జరిగే ఈ పోటీలో 7.5పాయింట్లు వచ్చిన గ్రాండ్‌మాస్టర్ విజేతగా నిలవనున్నాడు. 11 రౌండ్ ముగిసిన అనంతరం డింగ్ లెరెన్ 5.0 పాయింట్లతో, నెడునిచ్ 6.0పాయింట్లతో ఉన్నారు. టైటిల్‌ను విజేతగా నిలవాలంటే లెరెన్‌కు 2.5పాయింట్లు, నెడునిచ్‌కు 1.5పాయింట్లు కావాల్సి ఉంది.

ఐర్లాండ్ 319/4 శ్రీలంకతో రెండోటెస్ట్

గాలే: శ్రీలంకతో జరుగుతున్న రెండోటెస్ట్‌లో ఐర్లాండ్ జట్టు భారీస్కోర్ దిశగా పయనిస్తోంది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ జట్టు సోమవారం తొలిరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్ల నష్టానికి 319పరుగులు చేసింది. ఓపెనర్లు జేమ్స్(10), మూర్(5) నిరాశపరిచినా.. కెప్టెన్ ఆండ్రూ(95), స్టెర్లింగ్(74), టక్కర్(78నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68